

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

## జన సైన్యానికి నువ్వొక ధైర్యం

డిప్యూటీ సీఎం పవన్‌కు సీఎం చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు

4



# ప్రతీ పోర్టుకూ కనెక్టివిటీ మాస్టర్ ప్లాన్

- తూర్పు తీర మారిటైమ్ లాజిస్టిక్స్ గేట్ వేగా ఏపీ
- రవాణా మార్గాలను అనుసంధానించేలా ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ సిస్టం
- ఈస్ట్ కోస్ట్ మారిటైమ్ లాజిస్టిక్స్ సమ్మిట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు

2



## లెక్కకు మించి యూరియా

- ఎరువుల సరఫరాపై రైతులు ఆందోళన పడొద్దు
- యూరియా బ్లాక్ మార్కెట్ తరలిస్తే కఠిన చర్యలు
- మార్క్ ఫెడ్ ద్వారా 2 లక్షల మెట్రిక్ టన్నుల విక్రయాలు
- గత ఏడాదితో పోలిస్తే 91 వేల మెట్రిక్ టన్నులు అదనం
- రసాయినాల వినియోగంపై రైతుకు అవగాహన కల్పించాలి
- తక్కువ మొత్తంలో వాడే రైతులకు సబ్సిడీలు
- కాఫీ తోటల తెగుళ్లపై తక్షణం చర్యలు చేపట్టాలి
- ఉద్యాన పంటలు, ఎరువుల లభ్యతపై సీఎం చంద్రబాబు సమీక్ష

3

## దేశంలోనే తొలిసారి.. ప్రభుత్వ పాఠశాలలో స్మార్ట్ కిచెన్




- సికె దిన్నె స్కూల్లో ప్రారంభించిన విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేష్
- పనితీరును పరిశీలించి రాష్ట్రవ్యాప్తంగా అమలుచేస్తామని వెల్లడి
- ఈ సారి విద్యార్థులతోపాటు తనకు కూడా పరీక్షేనన్న మంత్రి
- విద్యార్థులను కన్నబిడ్డల్లా భావించి నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచన

6

## రాజధాని ప్రాజెక్టులకు ఎస్పీవీ



- అర్బన్ డిజైన్లు, ఆర్కిటెక్చరల్ గైడ్‌లైన్స్ నోటిఫికేషన్‌కు ఆమోదం
- కన్వెన్షన్ సెంటర్లకు భూమి ఇచ్చేందుకు సర్కారు అంగీకారం
- సీఎం చంద్రబాబు నేతృత్వంలో 52వ సీఆర్డీఏ సమావేశం

3

## మహిళలకు గౌరవం ఇచ్చేదే మంచి సమాజం

- అప్పుడే అభివృద్ధి సాధ్యం
- మార్పు ఇంటినుండే మొదలవ్వాలి
- మహిళలు, పురుషులు సమానమని నమ్మే పార్టీ, ప్రభుత్వం మనది
- వారికి పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించటమే లక్ష్యం
- కొప్పర్తికి పరిశ్రమలు తీసుకువచ్చే బాధ్యత నాది
- పరిశ్రమదారులకు అండగా ఉంటాం
- టెక్సానా మాన్యుఫాక్చరింగ్ యూనిట్ ప్రారంభం అనంతరం మహిళలతో ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి లోకేష్

9



## రికార్డుస్థాయిలో ఏపీకి ఎరువులు

- రాష్ట్రానికి అదనంగా 53 వేల ఎంటి యూరియా
- ఖరీఫ్‌లో 5.65 లక్షల ఎంటి యూరియా సరఫరా
- రబీకి 9 లక్షల ఎంటి యూరియాను సిద్ధం చేస్తున్న ప్రభుత్వం

4



## పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లిన వారికే పదవులు

- సెప్టెంబర్ నెలాఖరుకు అన్నిస్థాయిల్లో కమిటీలు పూర్తిచేస్తాం
- జగన్‌ని కలవడానికి ఇప్పుడు కూడా వివిపి పాస్ కావాలంట
- అహంకారంతో కాదు... ప్రేమతో ప్రజల మనసులను గెలవాలి
- కమలాపురం ఉత్తమ కార్యకర్తల సమావేశంలో యువనేత లోకేష్

7

## అమరావతిలో అమరజీవి

- 58 అడుగుల కాంస్య విగ్రహం
- 6.8 ఎకరాల్లో స్మృతివనం నిర్మాణం
- మంత్రి లోకేష్ చేతుల మీదుగా నేడు శంకుస్థాపన

అమరావతి (చైతన్యరథం): రాజధాని అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి వనం నిర్మాణానికి ఈ నెల 3వ తేదీ బుధవారం శంకుస్థాపన కార్యక్రమం జరగనుంది. ఆంధ్రరాష్ట్రం కోసం ఆత్మార్పణ చేసుకున్న అమరజీవి 58 రోజుల ఆమరణ నిరాహార దీక్షకు ప్రతీకగా 58 అడుగుల పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన జరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం, అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నిర్మాణం జరగనుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 6.8 ఎకరాల స్థలంలో స్మృతి వనం నిర్మాణాన్ని చేపడుతున్నారు. ఇందులో భాగంగా అమరజీవి కాంస్య విగ్రహం, ఆడిటోరియం నిర్మాణాలకు బుధవారం ఉదయం 10:30 గంటలకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా శంకుస్థాపన మహోత్సవ కార్యక్రమం జరుగుతుంది. ప్రజలు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# ప్రతీ పోర్టుకూ కనెక్టివిటీ మాస్టర్ ప్లాన్



- తూర్పు తీర మారిటైమ్ లాజిస్టిక్స్ గేట్ వేగా ఏపీ
- రవాణా మార్గాలను అనుసంధానించేలా ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ సిస్టం
- ఈస్ట్ కోస్ట్ మారిటైమ్ లాజిస్టిక్స్ సమ్మిట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి (చైతన్య రథం): తూర్పు తీర మారిటైమ్ లాజిస్టిక్స్ గేట్ వేగా ఏపీ మారుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఉత్తరాది రాష్ట్రాలతోపాటు పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, కర్ణాటక తదితర రాష్ట్రాల హింటర్ ల్యాండ్‌కార్గోను కూడా ఏపీ పోర్టుల ద్వారా రవాణా చేసేలా కార్యాచరణ చేపడుతున్నామని వివరించారు. మంగళవారం విశాఖలో జీఎఫ్‌ఎస్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈస్ట్ కోస్ట్ మారిటైమ్ లాజిస్టిక్స్ సమ్మిట్‌కు సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏపీని లాజిస్టిక్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ చేపడుతున్నామని స్పష్టం చేశారు. ఈస్ట్ కోస్టు గేట్ వేగా ఏపీ అత్యుత్తమ ప్రదేశమన్నారు. సదస్సుకంటే ముందు మారిటైమ్ లాజిస్టిక్స్ అభివృద్ధిపై దేశవ్యాప్తంగా వివిధ పోర్టులు, కార్గో హ్యాండ్లింగ్ కంపెనీలకు చెందిన 62మంది సీఈఓలతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. రాష్ట్రంలో మారిటైమ్ లాజిస్టిక్స్ రంగంలో ఉన్న అవకాశాలు, పోర్టు కార్గో హ్యాండ్లిగ్‌లో మౌలిక సదుపాయాల కల్పన, రోడ్డు, రైలు కనెక్టివిటి, ఓడరేవుల్లో టెర్మినళ్ల ఆధునీకరణ, షిప్ బిల్డింగ్, మారిటైమ్ లాజిస్టిక్స్‌లో అంతర్జాతీయంగా అనుసరిస్తున్న ప్రమాణాలతో పాటు వివిధ అంశాలను ప్రతిపాదించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని వివిధ పోర్టుల ద్వారా 69 మిలియన్ టన్నుల మేర ఇనుప ఖనిజం, 11 మిలియన్ టన్నుల బొగ్గు, 5.5 మిలియన్ టన్నుల ఎరువుల రవాణా జరుగుతోందని సీఎం తెలిపారు. బల్క్ కార్గో రవాణాకు భారీ నౌకలు రాకపోకలు సాగించేలా 18 మీటర్ల లోతైన ఓడరేవులు తూర్పుతీరంలో ఏపీ మినహా మరెక్కడా లేవన్నారు. సముద్ర రవాణాపరంగా ఏపీ దేశంలోనే రెండోస్థానంలో ఉందన్నారు. పోర్టులకు అనుసంధానంగా మూడు పారిశ్రామిక కారిడార్లు కూడా ఏపీలో ఉన్నాయని తెలిపారు. పొరుగు రాష్ట్రం తెలంగాణ డ్రైపోర్టును ఏర్పాటు చేసి మచిలీపట్నం ద్వారా కార్గో రవాణా చేయాలని భావిస్తోందన్నారు. గోదావరి నది ద్వారా అంతర్గత జల రవాణా మార్గాలతో మహారాష్ట్ర, కర్ణాటక కూడా ఏపీలోని కొన్ని పోర్టుల ద్వారా సరకు రవాణా చేయాలని భావిస్తున్నట్టు సీఎం స్పష్టం చేశారు. ఇవన్నీ ఏపీకి ఉన్న సానుకూలతలని తెలిపారు.

## ప్రతీ పోర్టుకు కనెక్టివిటీ మాస్టర్ ప్లాన్

పోర్టులు, ఎయిర్ పోర్టులు, రహదారులు, రైలు మార్గాలను అనుసంధానించి ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ వ్యవస్థను రూపొందిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వీటితోపాటు అంతర్గత జలరవాణా మార్గాలను కూడా అభివృద్ధిచేస్తామని వెల్లడించారు. గోదావరి, కృష్ణా నదుల ప్రవాహ మార్గాల్లో దాదాపు 1500 కిలోమీటర్ల మేర జల రవాణా మార్గాలను వినియోగించుకునేందుకు అవకాశం ఉందన్నారు. కాకినాడ-చెన్నైల మధ్య పురాతనమైన బకింగ్ హామ్ కెనాల్ రవాణా మార్గాన్ని పునరుద్ధరిస్తామని సీఎం తెలిపారు. ఈ రవాణా మార్గాలను అనుసంధానిం చటం ద్వారా అతి తక్కువ రవాణా వ్యయం సాధిం చేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఆపరేషనల్‌గా ఉన్న పోర్టులు, కొత్తగా అందుబాటులోకి రానున్న పోర్టులతో రహదారులు,రైలు మార్గాలు, అంతర్గత జలరవాణా, ఎయిర్ కార్గో మార్గాలను అనుసంధానించేలా ప్రతీ పోర్టుకూ కనెక్టివిటి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తామని సీఎం వెల్లడించారు. రవాణా పరమైన అంశాలను నిర్వహిం చేందుకు వీలుగా ఏపీలో త్వరలోనే లాజిస్టిక్స్ కార్పొ రేషన్ ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తక్కువ వ్యయంతోనే రైలు, రోడ్డు మార్గాలను పోర్టులకు అనుసంధానించే అవకాశం ఉందని తెలిపారు.

## పోర్టు ఆధారిత ఆర్థిక వ్యవస్థ

పోర్టులకు అనుసంధానంగా పారిశ్రామిక కార్యకలాపాలతో పాటు టౌన్ షిప్‌లను కూడా ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని సీఎం వివరించారు. మూలపేట, మచిలీపట్నం, కాకినాడ, రామాయపట్నం ఇలా వివిధ పోర్టుల వద్ద పరిశ్రమల ఏర్పాటు, టౌన్ షిప్‌ల కోసం 10 వేల ఎకరాల భూమి కూడా అందుబాటులో ఉందన్నారు. ఆర్థిక వ్యవస్థతో పాటు ఈ రంగాల్లో నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలు మెరుగయ్యేలా లాజిస్టిక్స్ యూనివర్సిటీ, సివిల్ ఏవియేషన్ యూనివర్సిటీలు కూడా త్వరలో ఏర్పాటవుతాయని సీఎం తెలిపారు. విశాఖ, అమరావతి, తిరుపతి సహా రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల నుంచి ఎయిర్ కార్గో రవాణాకు కూడా అనువుగా ఏర్పాట్లు చేస్తామన్నారు. మొత్తంగా జీఎస్డీపీలో లాజిస్టిక్స్ రంగం 3 శాతానికి పెంచుకునేందుకు అవకాశం ఉందన్నారు. దుగరాజపట్నం సహా వివిధ ప్రాంతాల్లో షిప్ బిల్డింగ్ యూనిట్లు, మరమ్మత్తులు, కంటైనర్లు, షిప్ రీసైక్లింగ్ లాంటి పరిశ్రమల ఏర్పాటుకు అవకాశముందని సీఎం స్పష్టం చేశారు. మారిటైమ్ లాజిస్టిక్స్‌కు సంబంధించి 15-20 మంది పారిశ్రామికవేత్తలతో కూడిన సలహా బోర్డును కూడా ఏర్పాటు చేయనున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. అంతకుముందు మారిటైమ్ రంగంలోని ఆరు స్టార్టప్ కంపెనీలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం పరిశీలించారు. ఎయిర్ కార్గో ఫోరం ఆఫ్ ఇండియా ఏపీ చాప్టర్‌ను సీఎం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంత్రులు బీసీ జనార్ధన్‌రెడ్డి, డీబీవీ స్వామి, మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, ఆ సంస్థ అధికారులు, జీఎఫ్‌ఎస్టీ వైస్ ఛైర్మన్ ఎస్‌పి టక్కర్ తదితరులు హాజరయ్యారు.








చైతన్యరథం

# లెక్కకుమించి యూరియా

- ఎరువుల సరఫరాపై రైతులు ఆందోళన పడొద్దు
- యూరియా బ్లాక్ మార్కెట్ తరలిస్తే కఠిన చర్యలు
- మార్క్ ఫెడ్ ద్వారా 2 లక్షల మెట్రిక్ టన్నుల విక్రయాలు
- గత ఏడాదితో పోలిస్తే 91 వేల మెట్రిక్ టన్నులు అదనం
- రసాయినాల వినియోగంపై రైతుకు అవగాహన కల్పించాలి
- తక్కువ మొత్తంలో వాడే రైతులకు సబ్సిడీలు
- కాఫీ తోటల తెగుళ్లపై తక్షణం చర్యలు చేపట్టాలి
- ఉద్యాన పంటలు, ఎరువుల లభ్యతపై సీఎం చంద్రబాబు సమీక్ష



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో ఎరువుల సరఫరాపై రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. డిమాండ్‌కంటే అదనంగానే నిల్వలున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోకుండా కఠినంగా వ్యవహరించాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఉద్యాన పంటలు, ఎరువుల లభ్యత, మార్కెటింగ్ శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ-క్రాప్ ద్వారా రాష్ట్రంలో ఎంతమేర ఏయే పంటలు సాగు అవుతున్నాయి, ఎరువుల వినియోగం ఎంత జరుగుతుందన్న లెక్కలు తీయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నిరంతర పర్యవేక్షణ ద్వారా సమస్య రాకుండా చూడాలని అధికారులకు సూచించారు.

ఈసారి 2.02 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి సరఫరా అయ్యిందని.. వాస్తవ డిమాండ్ కంటే అదనంగా నిల్వలున్నాయని అధికారులు వివరించారు. గతంతో పోలిస్తే ఈసారి 91 వేల మెట్రిక్ టన్నుల యూరియా అదనంగా వచ్చినట్టు తెలిపారు. ఇక డిఏపి 51,700మెట్రిక్ టన్నులమేర వచ్చిందని.. గత ఏడాదితో పోలిస్తే 16వేల మెట్రిక్ టన్నులు ఇది అదనమని అధికారులు సీఎంకు తెలిపారు. కాంప్లెక్స్ ఎరువులు కూడా ప్రస్తుత ఏడాదిలో 2.72 లక్షల మెట్రిక్ టన్నులమేర వచ్చిందని వివరించారు. గతంతో పోలిస్తే 1.20 లక్షల మెట్రిక్ టన్నులు ఇది అదనమని తెలియచేశారు. దీనిపై స్పందించిన సీఎం రాష్ట్రంలో ఎరువుల లభ్యత ఇంతగావున్నా.. కొందరు కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని.. ఇంటిగ్రేటెడ్ ఫెర్టిలైజర్ మేనేజ్మెంట్ సిస్టం ద్వారా యూరియా వినియోగం కూడా లెక్కించాలని అన్నారు.

### రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకం తగ్గితే సబ్సిడీలు

రసాయన ఎరువులు, పురుగు మందులరహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఆమేరకు వాటి వినియోగం తగ్గించేలా రైతుల్లో అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. పంటల సాగులో రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం తగ్గించిన రైతులకు రాయితీలు ఇచ్చే అంశంపై ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఎవరు ఎంత వినియోగిస్తున్నారనే అంశాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఎప్పటికప్పుడు రైతు సేవా కేంద్రాల ద్వారా కూడా ఎరువుల వినియోగంపై గణాంకాలు నమోదు చేయాలని స్పష్టం చేశారు.

### 11 ఉద్యాన పంటలకు సాగు ధర దక్కాలి

రాష్ట్రంలోని 11 ఉద్యాన పంటలకు సంబంధించి సాగు వ్యయానికి తగినట్టే ఆయా పంటలకు కనీస ధర వచ్చేలా చూడాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్ట పోవడానికి వీల్లేదని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. మరోవైపు కాఫీ తోటలకు కొత్తగా వచ్చిన బోరర్ తెగులుపై తక్షణమే చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. కొత్త తెగులు వచ్చిన కాఫీ పంట 20 ఎకరాల్లో ఉందని... దానిని తక్షణం తొలగించాల్సిన అవసరం ఉందని అధికారులు సీఎంకు తెలిపారు. ఇతర ప్రాంతాలకు తెగులు వ్యాపించకుండా చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. అలాగే తొలగించిన పంటకు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని స్పష్టం చేశారు. వచ్చే మూడేళ్లపాటు ట్రాప్‌లను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాల్సిందిగా ముఖ్యమంత్రి సూచనలు జారీ చేశారు.

మరోవైపు ఉల్లి పంట మొత్తాన్ని కొనుగోలు చేయాల్సిందిగా అధికారులకు సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలు చేసిన ఉల్లిని స్థానికంగా కమ్యూనిటీ హాళ్లను తీసుకుని ఆరబెట్టాలని సీఎం సూచనలు జారీ చేశారు. ఇప్పటి వరకూ హెచ్డీ బర్లీ పొగాకు కొనుగోళ్లకు సంబంధించి రూ.54 కోట్ల రూపాయలను చెల్లింపులు జరిగాయని .. మరో రూ.59 కోట్లు చెల్లించాల్సి ఉందని అధికారులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు, సీఎస్ కె.విజయానంద్, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు సమీక్షకు హాజరయ్యారు.

# రాజధాని ప్రాజెక్టులకు ఎస్పీవీ

- అర్బన్ డిజైన్లు, ఆర్కిటెక్చరల్ గైడ్‌లైన్స్ నోటిఫికేషన్‌కు ఆమోదం
- కన్వెన్షన్ సెంటర్లకు భూమి ఇచ్చేందుకు సర్కారు అంగీకారం
- సీఎం చంద్రబాబు నేతృత్వంలో 52వ సీఆర్డీఏ సమావేశం

అమరావతి (చైతన్య రథం): రాజధానిలో కీలక నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసేలా దృష్టి సారించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి నేతృత్వంలో 52వ సీఆర్డీ అథార్టీ సమావేశం జరిగింది. ఏడు అంశాలకు సమావేశంలో ఆమోదం లభించింది. రాజధాని పరిధిలో చేపట్టే కీలక ప్రాజెక్టులు కార్యరూపం దాల్చేలా స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు, ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు, స్మార్ట్ ఇండస్ట్రీస్, ఐకానిక్ బ్రిడ్జ్, స్పోర్ట్స్ సిటీ, రివర్ ఫ్రంట్, రోప్ వే, ఇన్నర్ రింగ్ రోడ్‌వంటి ప్రాజెక్టుల నిమిత్తం స్పెషల్ పర్పస్ వెహికల్ దోహద పడుతుంది. అయితే ఎస్పీవీ పరిధిలోకి బయో డిజైన్ ప్రాజెక్టును కూడా తీసుకురావాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. స్పోర్ట్స్ సిటీ తరహాలోనే హెల్త్ సిటీ కూడా అమరావతిలో ఏర్పాటు కానుందని.. దాని పరిధిలో బయో డిజైన్ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని సీఎం చెప్పారు. ప్రజారోగ్య సేవల నిమిత్తం బయో డిజైన్ ప్రాజెక్టులో భాగస్వాములుగా ఉండేందుకు ఏడు దేశాలకు చెందిన నిపుణులు, సంస్థలు సిద్ధంగా ఉన్నాయని సీఎం తెలిపారు. ఎస్పీవీ పరిధిలోని ప్రాజెక్టుల డిజైన్, రెవెన్యూ జనరేషన్ మొదలు నిర్మాణం పూర్తయ్యేంతవరకు ఎస్పీవీనే పూర్తి బాధ్యత వహించనున్నట్టు అధికారులు సీఎంకు వివరించారు.

### గవర్నమెంట్ కాంప్లెక్స్‌కు మౌలిక సదుపాయాలపై ఫోకస్

అమరావతిలో ప్రభుత్వ భవనాల సముదాయం కోసం అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించిన టెండర్‌ను సీఆర్డీఏ ఆమోదించింది. అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్ భవనాలకు అనుసంధానంగా రోడ్లు, ఫుట్‌పాత్‌ల నిర్మాణానికి సంబంధించిన పనులు ఇకపై మొదలు కానున్నాయి. దీంట్లో భాగంగా 53.68 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. రోడ్ల నిర్మాణమే కాకుండా... ఏడేళ్ల పాటు రోడ్ల నిర్వహణ బాధ్యతను కూడా టెండర్ దక్కించుకున్న సంస్థే చేపట్టేలా నిబంధనలు పెట్టినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇక రాజధాని ప్రాంతంలో అర్బన్ డిజైన్లు, ఆర్కిటెక్చరల్ గైడ్ లైన్స్‌కు సంబంధించిన నోటిఫికేషన్ జారీకి అథార్టీ ఆమోదించింది. డిజైన్లను ఆమోదించే సందర్భంలో జాగ్రత్తలు తీసుకోవాలని.. అమరావతి నగరం మొత్తంగా ఆకర్షణీయంగా కన్పించేలా ఉండాలని చంద్రబాబు సూచించారు. ప్రతి కట్టడమూ ప్రజలను ఆకర్షించేలా ఉండాలని సీఎం స్పష్టం చేశారు. సీఆర్డీఏ పరిధిలో చేపడుతున్న ప్రాజెక్టులతో కార్యాకలాపాలు పెరిగాయని అధికారులు చెప్పగా... ఈ మేరకు అవసరమైన సిబ్బందిని డిప్యుటేషన్, ఆన్ డ్యూటీ విధానంలో నియమించుకునేందుకు సీఎం అనుమతిచ్చారు.



### కన్వెన్షన్ సెంటర్లకు భూములు

రాజధాని పరిధిలో కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణం కోసం కొన్ని ప్రముఖ హెూటళ్లు ముందుకు వచ్చాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రాజధాని పరిధిలో ఇప్పటికే కొన్ని హెూటళ్లకు భూములు కేటాయించామని.. వాటికి అనుబంధంగా కొందరు కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణం చేపట్టాలని భావిస్తున్నారని... అయితే అందుకు భూములు ఇవ్వాలని ప్రతిపాదించాయని చెప్పారు. నిర్మాణాలు ప్రపంచ ప్రమాణాలకు ధీటుగా ఉండాలని సూచిస్తూ... ముందుకొచ్చిన సంస్థలకు కన్వెన్షన్ సెంటర్ల నిమిత్తం భూములు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారు. మాస్టర్ ప్లాన్ అవసరాలకు అనుగుణంగా ఏమైనా భూసేకరణ చేపట్టాలంటే రైతులతో మాట్లాడి ఆ ప్రక్రియ చేపట్టనున్నట్టు అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. రైతులతో మాట్లాడి... వారికి ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా ప్రక్రియను చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అధికారులు ఇచ్చారు. కృష్ణా నదిలోని ద్వీపాలను అభివృద్ధి చేసి టూరిజాన్ని ఆకర్షించేలా చూడాలని సీఎం సూచించారు. సమావేశంలో మంత్రి నారాయణ, మున్సిపల్, సీఆర్డీఏ, ఏడీసీ సహా వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# టీడీపీ కంచుకోటగా కడప జిల్లా

- తీర్చిదిద్దాలని మంత్రి లోకేష్ పిలుపు
- సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేసిన ఘనత టీడీపీది
- నాకు డైరెక్ట్ కాంటాక్ట్ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతోనే
- పులివెందుల ఎమ్మెల్యేకు దిమ్మతిరిగేలో దెబ్బకొట్టిన టీడీపీ కార్యకర్తలు, కడప ప్రజలు
- అక్కడ స్వేచ్ఛగా ఎన్నికలు జరిగితే జగన్ గెలిచే ప్రసక్తే ఉండదు
- వైసీపీ దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాలి
- కమలాపురం నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తాం
- కనీసం లక్ష మంది పనిచేసే విధంగా కొప్పర్తి అభివృద్ధి
- కమలాపురం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నేతలతో సమన్వయ సమావేశంలో మంత్రి నారా లోకేష్



కమలాపురం (చైతన్యరథం): సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేసిన ఘనత తెలుగుదేశం పార్టీదని, తనకు డైరెక్ట్ కాంటాక్ట్ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలే అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కడప జిల్లా కమలాపురం నియోజక వర్గం బుగ్గలేటిపల్లిలో మంగళవారం కమలాపురం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నేతలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. యువగళంలో కార్యకర్తలు, ప్రజలు పడుతున్న ఇబ్బందులు నేరుగా చూశానన్నారు. ఇవన్నీ తెలుసుకున్న తర్వాతనే చంద్రబాబు సూపర్ సిక్స్ ప్రకటించారు. దానిని సూపర్ హిట్ చేసిన ఘనత టీడీపీది. ఎత్తిన పసుపు జెండా దించకుండా టీడీపీకి కాపలా కాసిన ప్రతి కార్యకర్తకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నా. నాకు అంజిరెడ్డి తాత, మంజులక్క, తోట చంద్రయ్య, చెన్నుపాటి గాంధీలే స్ఫూర్తి అని మంత్రి లోకేష్ చెప్పారు.

## కార్యకర్తలే కీలకం

నాకు వేరే వాళ్లతో పనిలేదు. నాకు డైరెక్ట్ కాంటాక్ట్ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతోనే. అందుకే ఎన్ని పనులున్నా కార్యకర్తలతో సమావేశం అవుతున్నాను. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నా. కడపజిల్లాలో అత్యధిక సీట్లుగెలిచి చరిత్ర సృష్టించారు. దీని వెనుక కార్యకర్తల శ్రమ ఉంది. పులివెందుల ఎమ్మెల్యేకు దిమ్మతిరిగే విధంగా దెబ్బకొట్టింది టీడీపీ కార్యకర్తలు, కడప ప్రజలు. ఆ దెబ్బ అహంకారానికి వ్యతిరేకం, కుటుంబ పాలనకు వ్యతిరేకం. మాధవీ రెడ్డి భారీ మెజార్టీతో గెలిచారు. ఎమ్మెల్యే చైతన్యరెడ్డి బాగా కష్టపడ్డారు. పెద్దాయన కూడా కష్టపడ్డారు. కార్యకర్తలు అహర్నిశలు కష్టపడ్డారు. వైసీపీ నేతలు మహిళలను అవమానించారు. మా అమ్మని కూడా అవమానించారు. అయినా తగ్గేదేలే అని చెప్పానని మంత్రి లోకేష్ గుర్తు చేశారు.

## పులివెందులలో స్వేచ్ఛగా ఎన్నికలు జరిగితే జగన్ గెలిచే ప్రసక్తే ఉండదు

అహర్నిశలు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు తెలుసుకోవాలి.ప్రజలతో మమేకం కావాలి. ఇప్పటి నుంచే కష్టపడాలి. కార్యకర్తలు, నేతలు అలక వీడాలి. సమస్యలు ఏమైనా ఉంటే మనమే చర్చించు కుని పరిష్కరించుకోవాలి. పులివెందుల ఎమ్మెల్యేకు చాలా రోజుల తర్వాత ప్రజలు గుర్తుకువచ్చారు. గతంలో చంద్రబాబు బయటకు రావాలంటే గేట్లకు తాళ్లు కట్టారు. సొంత కార్యకర్తలను పొట్టనపెట్టుకున్న వ్యక్తి జగన్ రెడ్డి. జడ్పీటీసీ ఎన్నికల్లో డిపాజిట్ రాని పరిస్థితి. పులివెందులలో స్వేచ్ఛగా ఎన్నికలు జరిగితే, అందరూ కష్టపడితే జగన్ అనే వ్యక్తి గెలిచే ప్రసక్తే ఉండదు. జగన్ ఇప్పుడు బయటకు వస్తున్నారు. ఉల్లికి మద్దతు ధర కోసం చంద్రబాబు క్వింటాలుకు రూ.1200 మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని మొన్ననే చెప్పారు. జగన్ రెడ్డికి ఇప్పుడు గుర్తుకువచ్చింది. ఉల్లిగడ్డకు, ఆలుగడ్డకు తేడా తెలియని వ్యక్తి జగన్ రెడ్డి. హెరిటేజ్ స్టోర్‌లు విక్రయించి ఎనిమిదేళ్లు అవుతుంది. ఈ విషయం కూడా తెలియదని మంత్రి లోకేష్ ఎద్దేవా చేశారు.

## కనీసం లక్ష మంది పనిచేసే విధంగా కొప్పర్తి అభివృద్ధి

పెన్షన్‌ను రూ.200 నుంచి రూ.2వేలకు, ఆ తరువాత రూ.3వేలను ఒకే సంతకంతో నాలుగు వేలు చేసింది టీడీపీ.దివ్యాంగులకు పెన్షన్ రూ.6వేలు చేశాం. ఏడాదికి రూ.72వేలు చెల్లిస్తున్నాం. మంచానికే పరిమితమైనవారికి దేశంలో ఎక్కడా లేనివిధంగా రూ.15వేలు చెల్లిస్తున్నాం. అన్న క్యాంటీన్లు తిరిగి ప్రారంభించాం. అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి పథకాలను అమలుచేస్తున్నాం.ఇచ్చిన హామీలను నెరవేర్చాం. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. కొప్పర్తిలో తాజాగా రెండు కంపెనీలు ప్రారంభించాం. కొప్పర్తిలో కనీసం లక్ష మంది పనిచేసే విధంగా అభివృద్ధి చేసి కంపెనీలు తీసుకువస్తాం. రైతులు పిల్లల భవిష్యత్‌కోసం భూములుఇచ్చారు.ఎలక్ట్రానిక్స్, ఇతర సంస్థలను తీసుకువచ్చే బాధ్యత మేం తీసుకుంటాం. పక్కనే కడప ఎయిర్ పోర్ట్, ఇతర మౌలిక సౌకర్యాలు ఉన్నాయి. ఇంత అద్భుతమైన ఇండస్ట్రియల్ పార్క్ దేశంలో ఎక్కడా లేదు. అందుకే పెట్టుబడులు తీసుకువచ్చే బాధ్యత తాను తీసుకుంటానని మంత్రి లోకేష్ అన్నారు.

## వైసీపీ దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాలి

సంక్షేమం, అభివృద్ధితో పాటు రాజకీయం కూడా చేయాలి. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నట్టే వ్యవహరించాలి. ప్రతిపక్షం దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాలి. సొంత బాబాయిని చంపి నెపం చంద్రబాబుపై వేశారు. చెల్లి సునీత న్యాయం కోసం పోరాడే పరిస్థితి తెచ్చారు. ఆస్తి కోసం సొంత చెల్లిని మెడపట్టి బయటకు గెంటేశారు. ఇవన్నీ మనం మాట్లాడాలి.

మనం ఏనాడూ హత్యా రాజకీయాలను ప్రోత్సహించలేదు. ఫ్యాక్షన్‌ను ఏనాడూ టీడీపీ ప్రోత్సహించలేదు. దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఒక అబద్ధాన్ని పదేపదే చెప్పి నిజం చేసే కుట్రలకు పాల్పడుతున్నారు. పెట్టుబడులను అడ్డుకునేందుకు సింగపూర్‌కు కుట్రపూరితంగా మెయిల్స్ పంపారు. ఏ ఆశయంతో ప్రజలను మనల్ని గెలిపించారో దానిని నెరవేర్చాలని మంత్రి లోకేష్ అన్నారు.

## కడప జిల్లాను టీడీపీ కంచుకోటగా తీర్చిదిద్దాలి

కార్యకర్తలు, నేతలు అహంకారం వీడాలి. కలిసికట్టుగా పనిచేయాలి. కడప జిల్లాను టీడీపీ కంచుకోటగా తీర్చిదిద్దాలి. కమలాపురం నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తాం. రెడ్ బుక్ తన పని తాను చేస్తోంది. నేను ఏదీ మర్చిపోలేదు. నందం సుబ్బయ్య, తోట చంద్రయ్యను చంపింది మర్చిపోతానా? చంద్రబాబుని 53 రోజులు అక్రమంగా జైలులో బంధిస్తే కొడుకుగా నేను మర్చిపోతానా? తప్పు చేసిన వారిని చట్ట ప్రకారం శిక్షిస్తామని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

# రికార్డుస్థాయిలో ఏపీకి ఎరువులు

- రాష్ట్రానికి అదనంగా 53 వేల ఎంటి యూరియా
- ఖరీఫ్‌లో 5.65 లక్షల ఎంటి యూరియా సరఫరా
- రబీకి 9 లక్షల ఎంటి యూరియాను సిద్ధం చేస్తున్న ప్రభుత్వం



అమరావతి (చైతన్య రథం): గతంలో ఎన్నడూ లేనంతగా రాష్ట్రానికి ఎరువుల కేటాయింపు జరుగుతోంది. ప్రస్తుత కేటాయింపులకు అదనంగా 53 వేల మెట్రిక్ టన్నుల యూరియాను కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది. ఈ యూరియా నౌకల ద్వారా కాకినాడ, గంగవరం, కృష్ణపట్నం పోర్టులకు చేరుకుంది. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల విషయంలో గత ఏడాదికంటే ఈ ఏడాది గణనీయంగా విక్రయాలు పెరిగాయని వ్యవసాయ శాఖ తెలిపింది. రాష్ట్రంలో ఉన్న పరిస్థితిని కేంద్రానికి ఎప్పటికప్పుడు వివరిస్తూ ఉండడంతో రాష్ట్రానికి ఎక్కువ కేటాయింపులు జరుపుతూ కేంద్రం నిర్ణయం తీసుకుందని అధికారులు చెప్పారు. కేంద్రం ఇచ్చిన ఎరువులు, యూరియా నిల్వలను మార్క్‌ఫెడ్ సమన్వయంతో రైతులకు సమయానికి అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. కాకినాడ పోర్టుకు 17,154 మెట్రిక్ టన్నులు, కృష్ణపట్నం పోర్టుకు 9,200 మెట్రిక్ టన్నులు, గంగవరం పోర్టుకు 26,547 మెట్రిక్ టన్నుల యూరియా చేరుకుంది. ఈ సరఫరాతోపాటు గత 10 రోజుల్లో రాష్ట్రానికి 22 వేల మెట్రిక్ టన్నుల యూరియా చేరగా.. వచ్చే 10 రోజుల్లో అదనంగా 30 వేల మెట్రిక్ టన్నులు రానున్నట్టు వ్యవసాయ శాఖ చెబుతోంది. దీనికి తోడు దేశీయంగా వివిధ కంపెనీల నుంచి సరఫరా అయ్యే ఎరువులు కూడా అందుబాటులో ఉన్నాయని... రైతులకు ఎరువుల సమస్య తలెత్తే అవకాశం లేదని వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు. ఖరీఫ్ సీజన్‌కు ఇప్పటి వరకూ 5.65 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు సరఫరా అయినట్టు వ్యవసాయశాఖ తెలియచేసింది. అటు వచ్చే రబీ సీజన్‌కు కూడా మరో 9 లక్షల మెట్రిక్ టన్నుల్ని సిద్ధం చేస్తున్నట్టు వెల్లడించింది.

## మార్క్‌ఫెడ్ ద్వారా ఎరువుల సరఫరాలో 78శాతం వృద్ధి

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి గత ఏడాదితో పోలిస్తే మార్క్ ఫెడ్ ద్వారా ఎరువుల సరఫరా గణనీయంగా పెరిగిందని వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు తెలిపారు. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు అన్నీ కలిపి గతేడాదికంటే 1.2 లక్షల మెట్రిక్ టన్నులమేర అదనంగా మార్క్ ఫెడ్ ద్వారా సరఫరా చేశామని అధికారులు తెలిపారు. గతేడాది 1.53 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా చేస్తే... ఈ ఏడాది ప్రస్తుత సీజన్‌లో 2,72,000 మెట్రిక్ టన్నులమేర మార్క్ ఫెడ్ ద్వారా సరఫరా జరిగిందని వెల్లడించారు. గతంతో పోలిస్తే ఇది 78 శాతం అధికమని వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇక గత ఏడాదిలో 1,11,000 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేస్తే.. ఈ ఏడాది 2.02 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా జరిగిందని వివరించారు. గతానికంటే అధికంగా 91 వేల మెట్రిక్ టన్నులను సరఫరా చేశామని చెబుతున్నారు. ఇక డీఏపీ సరఫరా కూడా గతానికి మించి 85 శాతం జరిగిందని వెల్లడించారు. గత ఏడాది 23,700 మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేయగా... ఈ ఏడాది 51,700 మెట్రిక్ టన్నుల మేర సరఫరా జరిగిందని స్పష్టం చేశారు. ఈసారి 28 వేల మెట్రిక్ టన్నులు ఎక్కువగా సరఫరా చేశామని వ్యవసాయ శాఖ అధికారులు వివరించారు. ఈ స్థాయిలో జరిగిన భారీ కేటాయింపులతో ప్రస్తుత సీజన్‌తో పాటు వచ్చే రబీ సీజన్‌లోనూ రైతులకు ఎరువుల కొరత ఉండదని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. యూరియా, ఎరువుల కేటాయింపుల విషయంలో కేంద్రంతో, రైతులకు సరఫరా చేసే అంశంలో మార్క్‌ఫెడ్‌తో సమన్వయం చేసుకుంటున్నామని అధికారులు చెప్పారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని వివరించారు.

## జన సైన్యానికి నువ్వొక ధైర్యం

**డిప్యూటీ సీఎం పవన్‌కు సీఎం చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు**



అమరావతి (చైతన్య రథం): జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు సీఎం చంద్రబాబు నాయుడు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు 'ఎక్స్'లో పోస్ట్ పెడుతూ.. "పవన్ అడుగడుగునా సామాన్యుడి పక్షం. అణువణువునా సామాజిక స్పృహ.. మాటల్లో పదును.. చేతల్లో చేవ.. మాటకు కట్టుబడే తత్వం. జన సైన్యానికి ధైర్యం. రాజకీయాల్లో విలువలకు పట్టం. అన్నీ కలిస్తే పవనిజం అని నమ్మే అభిమానులు, కార్యకర్తలు, ప్రజల దీవెనతో నిండు నూరేళ్లూ వర్ధిల్లాలి. మరెన్నో విజయ శిఖరాలను అందుకోవాలి. పాలనలో, రాష్ట్రాభివృద్ధిలో మీ సహకారం మరువలేనిది" అని పేర్కొన్నారు.

# అండగా ఉంటా.. న్యాయం చేస్తా

- ప్రజలకు మంత్రి లోకేష్ భరోసా
- కడప బుగ్గలేటిపల్లిలో 69వ రోజు ప్రజాదర్బార్
- మంత్రి లోకేష్‌ను కలిసేందుకు పెద్దఎత్తున తరలివచ్చిన ప్రజలు, పార్టీ కార్యకర్తలు
- వినతుల స్వీకరణ.. పరిష్కరిస్తామని హామీ



కడప(చైతన్యరథం): పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కడప జిల్లా పర్యటనకు వచ్చిన విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్.. మంగళవారం ఉదయం కమలాపురం నియోజకవర్గం బుగ్గలేటిపల్లిలోని తన క్యాంప్ సైట్‌లో 69వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. మంత్రి లోకేష్‌ను కలిసేందుకు పెద్ద ఎత్తున ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించిన మంత్రి లోకేష్.. వారు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతులు స్వీకరించారు. వాటిని పరిష్కరించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వారితో కలిసి ఫోటోలు దిగారు.

## పోడు భూములకు డీకే పట్టాలు మంజూరు చేయండి

కమలాపురం నియోజకవర్గం సీకే దిన్నె మండలం ఇప్పపెంట గ్రామానికి చెందిన 45 గిరిజన కుటుంబాలు మంత్రి లోకేష్‌కు విజ్ఞప్తి చేస్తూ.. కూలి పనులు చేస్తూ జీవనం సాగించుకునే తాముఎలాంటి ఆధారం లేక బుగ్గమక ప్రాజెక్టు వద్ద 60 ఎకరాలను చదును చేసుకుని పోడు వ్యవసాయం చేస్తున్నామని తెలిపారు. సదరు వ్యవసాయ భూములకు డీకే పట్టాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కడప జిల్లాలో మండల పరిషత్ కార్యాలయంలోని ఉపమండల అభివృద్ధి అధికారి నేతృత్వంలో పని చేస్తున్న మండలస్థాయి కంప్యూటర్ ఆపరేటర్లకు (MLCOs)జీతాలను రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్ ద్వారా చెల్లించాలని పంచాయతీరాజ్ మండల లెవల్ కంప్యూటర్ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.


సీకే దిన్నె మండలం కొప్పర్తి గ్రామంలో 2008లో ఏపీఐఐసీ సేకరించిన అరెకరం భూమికి ఇప్పటివరకు నష్టపరిహారం చెల్లించలేదని,పరిశీలించి తగిన న్యాయం చేయాలని గ్రామానికి చెందిన చమిడిరెడ్డి జనార్ధన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

సిద్ధవటం, అట్లూరు, బద్వేలు మండలాల ప్రజల చిరకాల కోరిక అయిన కడప-పోరుమామిళ్ల రహదారిలో సిద్ధవటం పెన్నానదిపై ఖాదర్ బంగ్లా నుంచి మాచుపల్లె మధ్యలో బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎస్.మోహన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

కడప నగరంలో వేలాదిగా ఉన్న రజక కుటుంబాలకు పక్కా గృహాలు నిర్మించి ఆదుకోవాలని అక్కాయపల్లె రజక సేవా సంఘం ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి కోరారు. ఆయా విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.









## పవర్ స్టార్, పీపుల్ స్టార్ పవనన్న

### - మంత్రి లోకేష్ పుట్టినరోజు శుభాకాంక్షలు

అమరావతి (చైతన్యరథం): ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు. వెండితెరపై అభిమానులను అలరించిన పవర్‌స్టార్, జనహితమే అభిమతంగా రాజకీయాల్లో ప్రవేశించి పీపుల్ స్టార్‌గా ఎదిగారు. ప్రజల కోసం తగ్గుతారు. ప్రజాస్వామ్యాన్ని గెలిపించేందుకు నెగ్గితీరుతారు. సొంత తమ్ముడు కంటే ఎక్కువగా నన్ను అభిమానించి, అండగా నిలిచిన పవనన్నకు హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు. అంటూ ఎక్స్‌లో మంత్రి లోకేష్ పోస్ట్ చేశారు.

## ఉపముఖ్యమంత్రి పవన్‌కు బాలకృష్ణ జన్మదిన శుభాకాంక్షలు

అమరావతి (చైతన్యరథం): ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా హిందూపూర్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శుభాకాంక్షలు తెలియజేశారు. నేనున్నది మీకోసం అంటూ జనం వైపు పయనం సాగించే జనసేన అధ్యక్షుడు..



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి.. సోదరుడు పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా... ఆయనకు నా హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు.

## ఇదేందయ్యా.. ఎప్పుడూ వినలా, చూడలా!

- సొంత కార్యకర్తలను కలుసుకునేందుకు వీఐపీ పాసులా
- జగన్ తీరుపై మంత్రి లోకేష్ వ్యంగ్యాస్త్రాలు

అమరావతి (చైతన్యరథం): తన సొంత నియోజకవర్గం పులివెందుల పర్యటనలో వైసీపీ కార్యకర్తలు తనను కలుసుకునేందుకు ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ వీఐపీ పాసులు జారీ చేయడంపై మంత్రి లోకేష్ ఎక్స్ వేదికగా వ్యంగ్యాస్త్రాలు సంధించారు. “ఓరి నీ పాసుగాల! సినిమా ఫంక్షన్లకు వీఐపీ పాసులు విన్నాం గానీ.. సొంత నియోజకవర్గంలో సొంత పార్టీ కార్యకర్తలను కలవడానికి వీఐపీ పాసులు ఏందయ్యా? ఎప్పుడూ వినలే..! చూడలే..!” అంటూ జగన్ తీరును ఎండగట్టారు.

ఇటీవల జడ్పీటీసీ ఉపఎన్నికల్లో ఘోర ఓటమి తర్వాత జగన్ తన సొంత నియోజకవర్గం పులి వెందులకు సోమవారం మొదటిసారి వచ్చారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలను కలవడానికి వీఐపీ పాసులు జారీచేయించారు. ఈ పరిణామం పలువురిని విస్మయానికి గురిచేసింది. తండ్రి వైఎస్‌రాజశేఖరరెడ్డి వర్ధంతికార్యక్రమంలో పాల్గొ నేందుకు జగన్ పులివెందుల వచ్చారు. కొందరు కార్యకర్తలను మాత్రమే మాజీ ముఖ్యమంత్రి కలు సుకున్నారు. పాసులున్న వ్యక్తులనే భద్రతా సిబ్బంది అనుమతించడం, గతంలో ఎన్నడూలేని విధంగా కొత్త పద్ధతిని ప్రవేశపెట్టడంపై ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు కంగుతిన్నారు. భద్రతా సిబ్బందితో పలువురు వాగ్వాదానికి దిగారు.




జగన్‌ను కలవడానికి జారీచేసిన పాస్

## హరి మావయ్య జ్ఞాపకాలు ఎప్పటికీ పదిలం

### - మంత్రి లోకేష్ నివాళులు

అమరావతి (చైతన్యరథం): మాజీ మంత్రి, మాజీ ఎంపీ నందమూరి హరికృష్ణ జయంతి సందర్భంగా విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ నివాళులర్పించారు. చైతన్య రథసారథి నందమూరి హరి మావయ్య జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పిస్తున్నాను. వారు మన మధ్య లేకపోయినా వారి జ్ఞాపకాలు మా మనస్సుల్లో ఎప్పటికీ నిలిచే ఉంటాయి. సినీ రంగానికి, పార్టీకి, ప్రజలకు నందమూరి హరికృష్ణ చేసిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకుందామని ఎక్స్‌లో మంత్రి లోకేష్ పిలుపు ఇచ్చారు.



## చైతన్య రథసారధి హరికృష్ణ

### - బాలకృష్ణ నివాళులు

అమరావతి (చైతన్యరథం): మాజీ మంత్రి నందమూరి హరికృష్ణ జయంతి సందర్భంగా ఆయన సోదరుడు, హిందూపూర్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నివాళులర్పించారు. తెలుగునేల నాలుగు చెరగులా గ్రామ గ్రామాన పర్యటించి.. అశేష ప్రజలతో, అభిమానులతో చైతన్య రథసారధిగా పెనవేసుకున్న ప్రేమాభిమానాల పెన్నిధి.. మా అన్న స్వర్గీయ నందమూరి హరికృష్ణ జయంతి సందర్భంగా.. వారికి నా హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నానన్నారు.

# దేశంలోనే తొలిసారి
# ప్రభుత్వ పాఠశాలలో స్మార్ట్ కిచెన్

- సికె దిన్నె స్కూల్లో ప్రారంభించిన విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేష్
- పనితీరును పరిశీలించి రాష్ట్రవ్యాప్తంగా అమలుచేస్తామని వెల్లడి
- ఈ సారి విద్యార్థులతోపాటు తనకు కూడా పరీక్షేనన్న మంత్రి
- విద్యార్థులను కన్నబిడ్డల్లా భావించి నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచన






కమలాపురం (చైతన్యరథం): దేశంలోనే తొలిసారిగా కమలాపురం నియోజకవర్గం సికె దిన్నె ఎంపిపి పాఠశాల ఆవరణలో రూ. 2కోట్లతో ఏర్పాటుచేసిన సెంట్రలైజ్డ్ అడ్వాన్స్ డ్ స్మార్ట్ కిచెన్‌ను రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ మంగళవారం ప్రారంభించారు. కమలాపురం 2, జమ్మలమడుగు 2, కడపలో 1 స్మార్ట్ కిచెన్‌ను మంత్రి లోకేష్ వర్చువల్ గా ప్రారంభించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద ఈ 5 స్మార్ట్ కిచెన్ల ద్వారా 136 పాఠశాలలకు చెందిన 10,332 మంది విద్యార్థులకు 13ప్రత్యేక వాహనాల్లో ఆహారాన్ని పంపిస్తారు. న్యూట్రిషనిస్ట్ పర్యవేక్షణలో సోలార్ పవర్‌తో పనిచేసే ఈ స్మార్ట్ కిచెన్‌లో అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలను పాటిస్తారు. మెరుగైన నాణ్యత కోసం ఇక్కడ ప్రత్యేకంగాఏర్పాటుచేసిన ఆర్ఓ ప్లాంటు నీటినే వంటకు ఉపయోగిస్తారు. ఆర్ఓ ప్లాంటు,ఆహార పంపిణీ వాహనాలను కూడా మంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం శుచి, రుచితో కూడిన భోజనాన్ని నిర్ణీత సమయానికి తాము అందించగలమని సిబ్బంది తెలిపారు. డిసెంబర్ కల్లా కడపజిల్లాలోని 11మండలాల్లో 33 స్మార్ట్ కిచెన్ల ద్వారా 1,24,689 మంది విద్యార్థులకు రుచి, శుచికరమైన ఆహారాన్ని అందిస్తామని మంత్రి లోకేష్ చెప్పారు. తల్లిదండ్రుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకొని స్మార్ట్ కిచెన్లను మరింత మెరుగ్గా తీర్చిదిద్దాలని మంత్రి కోరారు. ఈ సందర్భంగా స్మార్ట్ కిచెన్‌ను సందర్శించిన మంత్రి లోకేష్ అక్కడ సరుకుల నాణ్యత,భోజనం తయారీ విధానాన్ని పరిశీలించారు. సికె దిన్నె స్కూలు స్మార్ట్ కిచెన్ పనితీరును బట్టి దీనిని రాష్ట్ర వ్యాప్తంగా అమలుచేస్తామని మంత్రి తెలిపారు.



## విద్యార్థులతో మంత్రి లోకేష్ భేటీ

ఈ సందర్భంగా పదోతరగతి విద్యార్థినుల తరగతి గదిని పరిశీలించిన లోకేష్, వారితో భేటీ అయ్యారు. గత ఏడాది కాలంగా తాము చేపట్టిన సంస్కరణలు ఎలా ఉన్నాయని విద్యార్థులను వాకబు చేసి, వారి నుంచి సలహాలు స్వీకరించారు. విద్యార్థినులు మాట్లాడుతూ... సెమిస్టర్ వైజ్ టెక్స్ట్ బుక్స్ విధానం అమలుచేయడం వల్ల తమకు మోత బరువు తగ్గిందని తెలిపారు. క్లాస్ లీడర్ జాస్మిన్ మాట్లాడుతూ... సన్నబియ్యం ఇస్తుండ టం వల్ల మధ్యాహ్న భోజనం గతంకంటే ఇప్పుడు రుచిగా బాగుంటుందని చెప్పింది. తమ స్కూలులో కంప్యూటర్ ల్యాబ్స్, కొత్త బెంచిలు ఏర్పాటుచేయాలని, కాంపౌండ్ వాల్ ఎత్తు పెంచాలని కోరగా, సాధ్యమైనంత త్వరగా వాటిని కల్పిస్తామని మంత్రి తెలిపారు. లోకేష్ ముఖచిత్రంతో తాను వేసిన డ్రాయింగ్‌ను ఈ సందర్భంగా ఓ విద్యార్థిని మంత్రికి బహూకరించింది. ప్రభుత్వం కొత్తగా ఇస్తున్న యూనిఫామ్స్, బ్యాగ్స్ నాణ్యతపై మంత్రి లోకేష్ ఆరా తీశారు. గతంకంటే ఇప్పుడు బాగున్నాయని, బ్యాగుల సైజ్ కొంచెం పెంచాలని విద్యార్థినులు సూచించారు. ఇంటర్నల్ ఎసెస్‌మెంట్‌కోసం కొత్తగా ఇస్తున్న బుక్‌లెట్స్ బాగున్నాయని తెలిపారు. సోషల్ స్టడీస్‌లో నాలుగు బుక్స్ ఉన్నాయని, వాటిని రెండింటికి కుదించాలని కోరారు. ఇంగ్లీషు టెక్స్ట్ బుక్,సప్లిమెంట్ కలిపి ఒకే బుక్‌గా ఇస్తే బాగుంటుందని చెప్పారు. తమకు ఆర్ఓ తాగు నీటిని అందించాలని కోరగా, మంత్రి అక్కడికక్కడే ఆదేశాలు జారీచేశా రు. డిసెంబర్ కల్లా సిలబస్ పూర్తవుతుంది, మీరంతా కష్టపడి చదివి మెరుగైన ఫలితాలు సాధించాలి,ఈసారి మీకు మాత్రమే కాదు, నాకు కూడా పరీక్షేనని విద్యార్థులతో మంత్రి లోకేష్ అన్నారు.

## విద్యార్థి గంగిరెడ్డికి లోకేష్ అభినందన

సికె దిన్నె స్కూలు తరగతి గదులను సందర్శించి నపుడు గంగిరెడ్డి గణేష్ రెడ్డి అనే పదోతరగతి విద్యార్థికి చెందిన నోట్ బుక్‌ను చూసిన లోకేష్... చేతిరాత చాలా బాగుందంటూ ప్రత్యేకంగా అభినందించారు. ఆ తర్వాత స్కూలు ప్రధానోపాధ్యాయుని శోభారాణితో మంత్రి లోకేష్ సమావేశమై విద్యా ప్రమాణాల మెరుగుదలకు సూచనలు ఇవ్వాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ... ఎసెస్‌మెంట్ బుక్స్ వల్ల విద్యార్థులు రివిజన్ చేసు కోవడానికి బాగుంది, అయితే ఆ పుస్తకాలన్నీ టీచర్లు ఇంటికి తీసుకెళ్లి దిద్దడం కష్టంగా ఉందని అంటూ సైజు తగ్గించే అంశాన్ని పరిశీలించాలని కోరారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ...రాష్ట్రంలో గత ఏడాది కాలంగా విద్యారంగంలో ఎన్నోసంస్కరణలు తెచ్చాం, పారదర్శకమైన విధానాలను అమలు చేస్తున్నాం, ఒక్క పిటిఎం తప్ప మరే ఇతర విద్యేతర భారాన్ని టీచర్లపై మోపడం లేదు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను కన్నబిడ్డల్లా భావించి వారికి మెరుగైన విద్యనందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రి లోకేష్ వెంట జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత, జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ అధితి సింగ్, ఎమ్మెల్యేలు పుత్తా చైతన్యరెడ్డి, కడప ఎమ్మెల్యే రెడ్డివారి మాధవీరెడ్డి, ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.












# విద్యలో నాణ్యత పెంచుదాం






- ఏం చేయాలో చెప్పండి
- పెండ్లిమర్రు డిగ్రీ కళాశాల విద్యార్థుల సూచనలు కోరిన మంత్రి లోకేష్
- ఆదర్శ డిగ్రీ కళాశాలను ప్రారంభించిన మంత్రి

కమలాపురం (చైతన్యరథం): కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం పెండ్లిమర్రులో రూ.12కోట్ల రూసా నిధులతో నిర్మించిన ఆధునాతన ఆదర్శ డిగ్రీ కళాశాల భవనాలను రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ మంగళవారం ప్రారంభించారు. పిఎం ఉష పథకంలో భాగంగా నిర్మించిన అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌ను కూడా మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి లోకేష్ బిఏ ఎకనమిక్స్ ద్వితీయ సంవత్సరం తరగతి గదిని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... భావిభారత పౌరులను తయారు చేయడంలో విద్యాశాఖ కీలకమైనది, కష్టమైనది అయినా భావిభారత పౌరులను తయారుచేసే విద్యాశాఖను కోరి తీసుకున్నా..విద్యాపరంగా నాణ్యత పెంచడానికి మంత్రిగా తాను ఏం చేయాలో చెప్పాల్సిందిగా సూచనలు అడిగారు. విద్యార్థులు స్పందిస్తూ ఫ్యాకల్టీని పెంచాలని కోరారు. మంత్రి లోకేష్ స్పందిస్తూ... ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కళాశాల సమీపంలో బస్టాప్ ఏర్పాటు చేయాలని, కాంపౌండ్ వాల్ నిర్మించాలని విద్యార్థులు విజ్ఞప్తి చేశారు. కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి లోకేష్ చెప్పారు. ఉచిత బస్సుసౌకర్యం తమకు చాలా ఉపయోగకరంగా ఉందని విద్యార్థినులు మంత్రికి తెలిపారు. ఈ



కార్యక్రమంలో జిల్లా ఇన్ చార్జి మంత్రి సవిత, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ అధితి సింగ్, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్య రెడ్డి, యోగి వేమన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ అల్లం శ్రీనివాస రావు, విద్య, మౌలిక సదుపాయాల కార్పొరేషన్ చైర్మన్ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లిన వారికే పదవులు

- సెప్టెంబర్ నెలాఖరుకు అన్నిస్థాయిల్లో కమిటీలు పూర్తిచేస్తాం
- జగన్‌ని కలవడానికి ఇప్పుడు కూడా విఐపి పాస్ కావాలంట
- అహంకారంతో కాదు... ప్రేమతో ప్రజల మనసులను గెలవాలి
- కమలాపురం ఉత్తమ కార్యకర్తల సమావేశంలో యువనేత లోకేష్




కమలాపురం (చైతన్యరథం): సెప్టెంబర్ చివరినాటికి పార్టీలోని అన్నిస్థాయిల్లో కమిటీలను పూర్తిచేసి, అక్టోబర్ నుంచి పార్టీ బలోపేతంపైనే దృష్టిసారిస్తామని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం బుగ్గలేటిపల్లెలో కమలాపురం నియోజకవర్గ ఉత్తమ కార్యకర్తల సమావేశంలో మంగళవారం మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ...బాదుడే, బాదుడు, బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ వంటి 10 కార్యక్రమాలను గత అయిదేళ్లలో సమర్థవంతంగా నిర్వహించడం వల్లే 2024లో ఘనవిజయం సాధించామన్నారు. పార్టీ ఇచ్చిన కార్యక్రమాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లిన వారిని గుర్తించి పదవులు ఇస్తాం, అన్నిస్థాయిల్లో నాయకులు నిత్యం ప్రజల్లో ఉండాలి, ప్రజలచుట్టూ మీరు తిరిగితే పార్టీ మీ చుట్టూ తిరుగుతుంది. ఎవరి సిఫారసుల వల్ల పదవులు రావు, పనితీరు ప్రాతిపదికగా మాత్రమే గుర్తింపు ఇస్తాం. ఎన్నికలకు ముందు పార్టీ పిలుపు ఇచ్చిన ఇచ్చి దాదాపు 10 కార్యక్రమాలు, తర్వాత పార్టీ సభ్యత్వం, సుపరిపాలనలో తొలి అడుగు, ఇతర కార్యక్రమాలను బాగా అమలుచేసిన వారిని గుర్తిస్తాం. పార్టీ పదవులను కూడా క్రియాశీలకంగా పార్టీకి పనిచేసిన వారికే ఇచ్చాం. ఏ స్థాయిలో పనిచేశారో పరిశీలించాకే పదవులు ఇచ్చాం. ఈ ప్రక్రియ అంతటినీ అధినేత చంద్రబాబు పర్యవేక్షిస్తున్నారు. పాదయాత్ర తర్వాత మొదటిసారిగా నియోజకవర్గానికి వచ్చా. అధినేత చంద్రబాబు, నేను ఎక్కడ పర్యటనకి వెళ్లినా ముందుగా అక్కడ కార్యకర్తలను కలుస్తున్నాం. కష్టపడినవారికి, ఫోటోలు దిగేవారికి వ్యత్యాసం చూపాలని గతంలో కేడర్ కోరారు. టెక్నాలజీని ఉపయోగించి కష్టపడిన వారిని గుర్తిస్తానని ఆనాడు చెప్పాను. ఆ మేరకే కష్టపడిన వారిని గుర్తించి పదవులు ఇస్తున్నాం, కష్టాన్ని, పనిని నమ్ముకుంటే మిమ్మల్ని వెదుక్కుంటూ తాము వస్తామని మంత్రి లోకేష్ భరోసా ఇచ్చారు.

## ప్రేమతో ప్రజల మనసులు గెలవాలి

అహంకారంతోకాదు, ప్రేమ, ఆప్యాయతలతో మనం ప్రజల మనసులను గెలవాలి. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నట్లే వ్యవహరించాలి. అహంకారం లేకుండా బాధ్యతగా మెలగాలి. గత ఎన్నికల్లో ఎన్నడూ లేనివిధంగా కడప, కర్నూలు జిల్లాలో అత్యధిక సీట్లు సాధించాం. ఓర్పు, సహనంతో రాజకీయం చేయడం వల్లే ఇది సాధ్యమైంది. అందుకే ఈ రోజు మన పార్టీ నిలబడింది. వైసీపీ అధికారంలో ఉన్నపుడు అహంకారంతో విర్రవీగడంతో 151 సీట్లు 11 అయ్యాయి. చంద్రబాబుని అరెస్టు చేసినపుడు ఒక మహిళా మంత్రి స్వీట్లు పంచి, టపాసులు కాల్చారు. ఇప్పుడు కూడా జగన్ ను కలవడానికి వైసీపీ కార్యకర్తలు విఐపి పాస్ తీసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఇప్పటికీ ఆయన కార్యకర్తలను విస్మరిస్తున్నారు. ఒక కార్యకర్తను కారు కింద తొక్కించి చంపేశారు. మనం ప్రతిపక్షంలో ఉన్నపుడు పార్టీ కేడర్ ను ఇబ్బంది పెట్టిన వారెవరినీ వదలం. రెడ్ బుక్ తన పని తాను చేసుకుపోతుంది. ఈ విషయంలో మేము చాలా క్లారిటీతో ఉన్నామని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

## తప్పుడు కేసుల నుంచి విముక్తి కల్పిస్తాం

2019-24మధ్య తప్పుడు కేసులు ఎదుర్కొన్న కార్యకర్తలకు విముక్తి కల్పిస్తాం. ఎస్పీ, డిఐజితో మంత్రి, ఎమ్మెల్యే మాట్లాడతారు. రూ.120కోట్లు తప్ప ఉపాధి హామీ బిల్లులన్నీ ఇచ్చేశాం, పెండింగ్‌లో ఉన్న మిగిలిన ఉపాధి హామీ బిల్లులు చెల్లిస్తాం. మార్చిలోగా నీరు-చెట్టు, ఉపాధి హామీ బిల్లులన్నీ చెల్లిస్తాం. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిల్లో సమస్యలపై చర్చించి నాయకులు ఎక్కడికక్కడే పరిష్కరించాలి. ప్రభుత్వ పథకాల అమలులో పలు సమస్యలను కొందరు నా దృష్టికి తెచ్చారు, అవన్నీ పరిష్కరిస్తాం. సూపర్ సిక్స్‌లో ప్రధాన హామీలన్నీ దాదాపు పూర్తిచేశాం, ఆర్థికంగా ఇబ్బందులున్నందున ఒకటి, రెండు పెండింగ్‌లో ఉన్నాయి, పాదయాత్రలో ఇచ్చిన హామీలు కూడా పూర్తిచేస్తున్నాం. అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల బండి, రెండింటినీ బ్యాలెన్స్‌గా ముందుకు తీసుకెళతాం. నేను ప్రతి పొలిట్‌బ్యూరో సమావేశంలో కేడర్ తరపున పోరాడుతున్నా. నమ్ముకున్న దాని కోసం పోరాడుతున్నా, అధినేత వద్ద అందరికన్నా నేనే ఎక్కువ తిట్లు తింటున్నా. సమస్యలను నాలుగుగోడల మధ్య చర్చించుకొని నమ్మిన సిద్ధాంతం కోసం పోరాడాలి. 2029 ఎన్నికల్లో చరిత్ర తిరగరాయాలి. మేము తీసుకునే 10 నిర్ణయాల్లో 3 తప్పు అవుతాయి, వాటిని సరిదిద్దుకుంటామని యువనేత నారా లోకేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, కడప పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు రెడ్డివారి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# కడప జిల్లా కొప్పర్తి ఇండస్ట్రియల్ హబ్

## అభివృద్ధికి వేగంగా అడుగులు

**- టెక్నోడోమ్ ఎల్ఈడీ టీవీ మాన్యుఫాక్చరింగ్ ప్లాంట్, టెక్సానా రేడీమేడ్ దుస్తుల తయారీ యూనిట్‌ను ప్రారంభించిన మంత్రి లోకేష్**

**- కొప్పర్తి ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్‌లో ఎగ్జిక్యూటివ్ సెంటర్ భవనం ప్రారంభం**



కొప్పర్తి (చైతన్యరథం): కడప జిల్లా కమలాపురం నియోజకవర్గంలోని కొప్పర్తి ఇండస్ట్రియల్ హబ్ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ప్రపంచ ప్రఖ్యాత ఎలక్ట్రానిక్స్, ఐటీ ఉత్పత్తుల తయారీ సంస్థ టెక్నోడోమ్.. కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్క్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన ఎల్ఈడీ టీవీ మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌ను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా టెక్నోడోమ్ ఎల్ఈడీ టీవీ మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌కు చేరుకున్న మంత్రి లోకేష్‌కు సంస్థ ప్రతినిధులు, సిబ్బంది ఘనస్వాగతం పలికారు. రిబ్బన్ కట్ చేసిన మంత్రి.. ఎల్ఈడీ టీవీ మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌ను లాంఛనంగా ప్రారంభించి, శిలఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్లాంట్‌లోని లిక్విడ్ క్రిస్టల్ మాడ్యూల్(ఎల్‌సీఎమ్) తయారీ విభాగాన్ని, ఫైనల్ అసెంబ్లింగ్ యూనిట్, క్వాలిటీ డిపార్ట్‌మెంట్‌ను ప్రత్యక్షంగా వీక్షించారు. సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి నారా లోకేష్‌ను టెక్నోడోమ్ సీఎండీ సాకేత్ గౌరవ్, హెచ్‌ఆర్ మేనేజర్ శివశంకర్ శాలువాతో సత్కరించారు.

### టెక్నోడోమ్.. రూ.121 కోట్ల పెట్టుబడి, 300 ఉద్యోగాలు

ఎలక్ట్రానిక్స్, ఇతర గృహోపకరణాలను తయారుచేసే టెక్నోడోమ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్‌ను 2010లో స్థాపించారు. ఈ సంస్థ ప్రధాన కార్యాలయం న్యూఢిల్లీలో ఉంది. దుబాయ్ కు చెందిన టెక్నోడోమ్ గ్రూప్‌లో భాగంగా ఈ సంస్థను ఏర్పాటుచేశారు. తమ విస్తరణ ప్రాజెక్టులో భాగంగా కొప్పర్తి ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్టరింగ్ క్లస్టర్‌లో టెక్నోడోమ్ సంస్థ రూ.121 కోట్ల పెట్టుబడి పెట్టడంతో పాటు 300 మందికి ఉద్యోగాలు కల్పించనుంది. టెక్నోడోమ్ సంస్థ తమ విస్తృత ప్రణాళికలో భాగంగా ఏటా 10 లక్షల టీవీలు, 10 లక్షల ఎల్ఈడి మానిటర్లు తయారు చేయడమే కాకుండా.. భవిష్యత్తులో ఫ్రిజ్‌లు, ఏసీలు, ఇతర గృహోపకరణాలను ఉత్పత్తి చేసేందుకు రూ.55 కోట్ల పెట్టుబడి పెట్టనుంది.

### టెక్సానా.. రూ.50 కోట్ల పెట్టుబడి, 2,100 ఉద్యోగాలు

కొప్పర్తి ఇండస్ట్రియల్ హబ్ నార్త్ బ్లాక్ లో ప్రముఖ రెడీమేడ్ దుస్తుల తయారీ కంపెనీ టెక్సానా మాన్యుఫాక్చరింగ్ నూతన యూనిట్‌ను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. యూనిట్ మొత్తం కలియతిరిగి మహిళా సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. దేశంలో ప్రముఖ దుస్తుల తయారీ కంపెనీ అయిన టెక్స్‌పోర్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ముంబై ప్రధాన కేంద్రంగా పనిచేస్తోంది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడులో తన కార్యకలాపాలను కొనసాగిస్తోంది. 19 సొంత యూనిట్లను కలిగిన టెక్స్‌పోర్ట్ సంస్థ.. ఏటా 1.7 కోట్లకు పైగా దుస్తులను ఉత్పత్తి చేస్తోంది. కొప్పర్తిలో తమ అనుబంధ సంస్థ టెక్సానా వరల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ద్వారా రూ.50 కోట్ల పెట్టుబడి పెట్టడంతో పాటు ప్రత్యక్షంగా 2,100 మందికి ఉద్యోగాలు కల్పించనుంది.

### ఎగ్జిక్యూటివ్ సెంటర్ బిల్డింగ్‌ను ప్రారంభించిన మంత్రి లోకేష్

కొప్పర్తి ఎలక్ట్రానిక్స్ మానుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లో ఎగ్జిక్యూటివ్ సెంటర్ భవనాన్ని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రూ.31.50 కోట్ల వ్యయంతో 6.30 ఎకరాల్లో 46,700 చదరపు గజాల విస్తీర్ణంలో ఈ భవనాన్ని నిర్మించారు. జీ ప్లస్ 2 విధానంలో భవనాన్ని నిర్మించారు. ఈ సెంటర్ లో కో-వర్కింగ్ స్పేస్, ఏపీఐఐసీ కార్యాలయం, బిజినెస్ సెంటర్‌తో పాటు కన్వెన్షన్ సెంటర్, టెన్నిస్, బ్యాడ్మింటన్ కోర్ట్, పార్కింగ్ వంటి ఆధునిక సదుపాయాలు ఉన్నాయి.

ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, జిల్లా ఇంఛార్జ్ మంత్రి ఎస్.సవిత, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, సీనియర్ నేత పుత్తా నరసింహారెడ్డి, కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.













# మహిళలకు గౌరవం ఇచ్చేదే మంచి సమాజం

- అప్పుడే అభివృద్ధి సాధ్యం
- మార్పు ఇంటినుండే మొదలవ్వాలి
- మహిళలు, పురుషులు సమానమని నమ్మే పార్టీ, ప్రభుత్వం మనది
- వారికి పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించటమే లక్ష్యం
- కొప్పర్తికి పరిశ్రమలు తీసుకువచ్చే బాధ్యత నాది
- పరిశ్రమదారులకు అండగా ఉంటాం
- టెక్సానా మాన్యుఫాక్చరింగ్ యూనిట్ ప్రారంభం అనంతరం మహిళలతో ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి లోకేష్



కొప్పర్తి (చైతన్యరథం): మహిళలు, పురుషులు సమానమని నమ్మే పార్టీ, ప్రభుత్వం.. తెలుగుదేశం, ఎన్డీయే అని.. మహిళలకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కడప జిల్లా కమలాపురం నియోజకవర్గంలోని కొప్పర్తి ఇండిస్ట్రియల్ హబ్‌లో మంగళవారం ప్రముఖ రెడీమేడ్ దుస్తుల తయారీ కంపెనీ టెక్సానా మాన్యుఫాక్చరింగ్ నూతన యూనిట్ ప్రారంభం అనంతరం అక్కడ పనిచేసే మహిళా సిబ్బందితో మంత్రి నారా లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇక్కడ ఎంతమందికి ఇది మొదటి ఉద్యోగం, రెండోది, మూడోదో చేతులు పైకి ఎత్తాలన్నారు. నా తొలి ఉద్యోగం బాగా గుర్తుంది. ఎండాకాలం సెలవుల్లో మూడు నెలలు పనిచేయాలని మా నాన్న చంద్రబాబు చెప్పారు. ఇంటికి రానివ్వలేదు. అమెరికాలో జీఈ క్యాపిటల్ కంపెనీలో పనిచేశా. నా మొదటి బాస్ పేరు జాక్ అని కూడా గుర్తింది. జీవితంలో ఒకటి సాధించామని, సొంత కాళ్లపై నిలబడగలనని అప్పుడు అనిపించింది. పాదయాత్రలో 226 రోజులు పాటు 3,132 కి.మీలు నడిచా. చాలా మందిని కలిశా. ఎక్కడికి వెళ్లినా మాకు ఉద్యోగాలు కల్పించాలని అడిగారు. బాబు సూపర్ సిక్స్‌లో మేం ఇచ్చిన తొలి హామీ ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పన. దీపం, తల్లికివందనం, స్త్రీ శక్తి లాంటి హామీలు ఇచ్చాం. గంగాధర నెల్లూరులో నేను యువగళం పాదయాత్ర చేస్తున్నప్పుడు ఓ తల్లిని కలిశాను. తన భర్త తాగుడుకు బానిసై చనిపోయాడని, బజ్జీ కొట్టు నడుపుకుంటూ తన ఇద్దరు కుమారులను చదివించానని చెప్పారు. తమ కుమారులకు ఉద్యోగాలు కల్పిస్తే చాలని.. ఏమీ వద్దని ఆమె చెప్పారు. కియా ఫ్యాక్టరీ వద్ద ఫోటో దిగేందుకు వెళుతుండగా.. ఓ చెల్లి వచ్చి నన్ను కలిసింది. కియా అనుబంధ విభాగాల్లో ఉద్యోగం చేస్తున్నానని, ఇప్పుడు తనకు నెలకు రూ.40వేల జీతం వస్తోందని చెప్పారు. గతంలో గృహిణిగా ఉండగా.. ప్రస్తుతం కుటుంబాన్ని తానే పోషిస్తున్నానని చెల్లి గర్వంగా చెప్పారు. అందుకు కారణమైన చంద్రబాబుకి కృతజ్ఞతలు చెప్పాలని ఆమె కోరారని మంత్రి లోకేష్ గుర్తు చేశారు.

## మార్పు ఇంట్లోనే మొదలవ్వాలి..

గాజులు తొడుక్కున్నావా, చీర కట్టుకున్నావా వంటి మాటలను విడనాడాలి. మహిళలు, పురుషులు సమానమని నమ్మే పార్టీ, ప్రభుత్వం తెలుగుదేశం, ఎన్డీయే. మహిళలను గౌరవించడం ఇంట్లోనే మొదలవుతుంది. చంద్రబాబు 1992లో చిత్తూరు జిల్లాలో హెరిటేజ్ ను స్థాపించారు. సదరు కంపెనీని మా తల్లి భువనేశ్వరి సమర్థంగా నడిపారు. అదే కంపెనీలో బ్రాహ్మణి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఇప్పుడు నేను రోడ్లపై తిరుగుతున్నానంటే కారణం నారా బ్రాహ్మణి. నా క్రెడిట్ కార్డు బిల్లును నా సతీమణి నారా బ్రాహ్మణి కడుతున్నారు. మార్పు మన ఇంట్లో మొదలవ్వాలని నేను బలంగా నమ్ముతున్నానని మంత్రి లోకేష్ చెప్పారు.

## మహిళలను గౌరవించాలి

మహిళలకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. మీ పిల్లలను కూడా చూసుకోవాల్సిన బాధ్యత నాపై ఉంది. తల్లికి వందనం కూడా నా శాఖ కిందే వస్తుంది. ఉచిత బస్సులో ప్రయాణం చేసే వారు చేతులెత్తాలి. తల్లిని గౌరవించాలని చంద్రబాబు చెప్తుంటారు. తల్లిని అవమానిస్తే ఎంత బాధపడతారో నేను చూశాను. శాసనసభ సాక్షిగా నా తల్లిని అవమానించారు. కోలుకునేందుకు మూడు నెలల సమయం పట్టింది. మహిళలను గౌరవించాలి. అందుకోసమే ప్రభుత్వ పాఠశాలల్లో తల్లి కాళ్లకు నమస్కారం పెట్టే కార్యక్రమాన్ని తీసుకువచ్చామని మంత్రి లోకేష్ తెలిపారు.

## మహిళలు సొంత కాళ్లపై నిలబడాలనేది మా లక్ష్యం

ఎక్కడైతే మహిళలను గౌరవిస్తారో ఆ సమాజం బాగుపడుతుంది. సంక్షేమంతో పాటు అభివృద్ధి చేస్తాం. ఎన్టీఆర్ దగ్గర నుంచి చంద్రబాబు వరకు మహిళల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారు. డ్వాక్రా సంఘాల ఏర్పాటు, ఆస్తిలో సమానహక్కు, మహిళలకు తిరుపతిలో ప్రత్యేక విశ్వవిద్యాలయం ఏర్పాటుచేసింది తెలుగుదేశం, ఎన్టీఆర్. మహిళలు సొంత కాళ్లపై నిలబడాలనేది మా లక్ష్యం. మిమ్మల్నందరినీ చూస్తుంటే చాలా గర్వంగా ఉంది. 90 శాతం మందికి ఇది మొదటి ఉద్యోగం. శిక్షణ కూడా ఇచ్చారు. ఇక్కడ పని మానేయవద్దని మంత్రి లోకేష్ సూచించారు.

## కొప్పర్తికి పరిశ్రమలు తీసుకువచ్చే బాధ్యత నాది

ఇంకా పరిశ్రమలు తీసుకువస్తాం. ఇదే కొప్పర్తికి పరిశ్రమలు తీసుకువచ్చే బాధ్యత నాది. మంత్రి భరత్, నేను కలిసి కట్టుగా పనిచేసి పరిశ్రమలు తీసుకువస్తాం. ప్రస్తుతం ఉన్నవారిలో 50శాతం ఎమ్మెల్యేలు మొదటిసారి గెలిచిన వారు. 25 మంది మంత్రుల్లో 17 మంది కొత్తవారు. మాలో కసి ఉంది. రాష్ట్రాన్ని నెం.1 గా చేయాలనే లక్ష్యం పెట్టుకున్నాం. మీరు మొదలుపెట్టిన ప్రయాణం ఆగకూడదు. బాగా పనిచేయాలి. లక్ష్యాన్ని నిర్దేశించుకుని అందుకోసం కష్టపడాలి. రాబోయే రోజుల్లో మెరుగైన అవకాశాలు కల్పిస్తాం. ప్రభుత్వం మీకు అండగా నిలబడుతుంది. ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

## పరిశ్రమదారులకు అండగా ఉంటాం

కంపెనీ యాజమాన్యానికి కూడా ఏపీ ప్రజల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. మీకు అన్ని విధాల అండగా ఉంటాం. ఏపీ ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతున్నా. ఏ సమస్య ఉన్నా మెసేజ్ దూరంలోనే ఉంటానని మంత్రి లోకేష్ చెప్పారు. అనంతరం మహిళా సిబ్బందితో సెల్ఫీలు దిగారు.

ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, బీసీ సంక్షేమ, చేనేత జౌళ్ల శాఖ మంత్రి ఎస్.సవిత, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, సీనియర్ నేత పుత్తా నరసింహారెడ్డి, కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.





# వాణిజ్య రైతులకు అండగా చంద్రబాబు

- వారిని ఆదుకుంటోంది కూటమి ప్రభుత్వమే
- ఉల్లి రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు
- లో గ్రేడ్ పంటనూ కొనుగోలు చేస్తాం
- అందరికీ యూరియాను పంపిణీ చేస్తాం
- అరకు కాఫీ సాగుదారులకు నష్టపరిహారం
- వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు




అమరావతి (చైతన్యరథం): దేశంలోనే ప్రప్రథమంగా వాణిజ్య పంటల రైతులను ఆదుకున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుం దని వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రత్యేకించి ఉల్లి రైతులు ఏమాత్రం ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రభుత్వం ఇప్పటికే కనీస మద్ద తు ధరను ప్రకటించి దాదాపు 580 మెట్రిక్ టన్నుల ఉల్లిని కొనుగోలు చేసి అన్ని రైతుబజార్లలో విక్రయించడం మొదలు పెట్టిందని వివరించారు. యూరియా విషయంలోనూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, తగిన పరిమాణంలో రైతులు అందరికీ పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. మంగళవారం సచివాలయం ప్రచార విభాగంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో మంగళ వారం సమీక్ష నిర్వహించినట్లు చెప్పారు. ఇందులో ముఖ్యంగా యూరియా పంపిణీ, ఉల్లి పంట కొనుగోలు, అరకు కాఫీ తోటల కు కొత్తగా వచ్చిన తెగుళ్ల నివారణపై సమగ్రంగా సమీక్షించి పలు ఆదేశాలను జారీ చేయడం జరిగిందని వివరించారు. ఈ ఏడాది అధిక వర్షాల భయంతో కర్నూలు జిల్లాలో ఉల్లి రైతులు 30 రోజుల ముందుగానే ఒకేసారి దాదాపు 5700 మెట్రిక్ టన్నుల ఉల్లి పంటను తీయడం వల్ల ధరలు పడిపోయాయని, ఈ సమస్యపై గత నెల 28న ముఖ్యమంత్రి సమీక్షించి కనీస మద్దతు ధరను కిలో రూ.12 ప్రకటించి ఇప్పటివరకూ దాదాపు 580 మెట్రిక్ టన్నుల ఉల్లిని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఏ గ్రేడ్‌తో పాటు లో గ్రేడ్ ఉల్లిని కూడా కొనుగోలు చేసి ఉల్లి రైతు లను ఆదుకోవడం జరుగుతుందని, ఉల్లి రైతులు ఎవరూ ఆందో ళన చెందాల్సిన పనిలేదని స్పష్టం చేశారు.

**యూరియా పంపిణీకి చర్యలు**

యూరియా విషయంలోనూ ఆందోళన చెందాల్సిన పనిలేదని విజ్ఞప్తి చేశారు. దాదాపు 22 లక్షల హెక్టార్లలో ఖరీఫ్ సాగు ప్రారం భమైందని, బఫర్ స్టాక్‌తో కలిపి 6.59 లక్షల టన్నుల యూరియా అందులో ఉందని చెప్పారు. ఇప్పటివరకు 5.64 లక్షల టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు తెలిపారు. గతంలో 50:50 రేషి యాలో కేటాయించే విధానానికి బదులుగా మన రాష్ట్రానికి వచ్చే యూరియాలో 70 శాతం మార్క్‌ఫెడ్ ద్వారా రైతులకు అందజేయా లని, మిగిలిన 30 శాతం ప్రైవేటు డీలర్లకు కేటాయించాలని సీఎం ఆదేశించినట్లు చెప్పారు. ఈ విధానాన్ని అనుసరిస్తూ అన్ని ప్రాథమి క వ్యవసాయ సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు డీలర్ల ద్వారా రైతులకు అవసరమైన యూరియాను తగిన ప్రమాణంలో పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.

**అరకు కాఫీకి తెగులు..నష్టపరిహారానికి సీఎం ఆదేశం**

అరకు కాఫీకి అంతర్జాతీయ గుర్తింపు ఉందని, అయితే దాదాపు 20 ఎకరాల్లో అరకు కాఫీ తోటలకు కొత్తగా తెగులు సోకిందని, ఈ తెలుగు మరింత సోకకుండా ఈ పంటను వెంటనే నాశనం చేసి సంబంధిత రైతులకు నష్టపరిహారాన్ని అందజేయా లని సీఎం ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. అదేవిధంగా దేశంలో ఎక్కడా లేని విధంగా మిర్చి, కోకో, నల్లబెర్లి, మామిడి తదితర వాణిజ్య పంటల విషయంలో కూడా ప్రభుత్వం కనీస మద్దతను ప్రకటించి ఆయా రైతులను ఆదుకోవడం జరిగిందన్నారు. మిర్చి పంట విషయంలో సీఎం నేరుగా కేంద్ర వ్యవసాయ మంత్రితో మాట్లాడి మిర్చి రైతులను ఆదుకోవడం జరిగిందన్నారు. ఇప్పటి వరకూ దాదాపు రూ.54 కోట్లను నల్లబర్లి రైతుల ఖాతాల్లోకి జమ చేయడం జరిగిందని, మరో రూ.59 కోట్లను జమచేయడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా చిత్తూరు జిల్లాలో మామిడి రైతులను కూడా ఆదుకోవడం జరిగిందని, కోకో విషయంలో కూడా కిలోకు 50 పైసలు చొప్పున కొంతమేరకు రైతులకు సహా యం అందజేయడం జరిగిందని వివరించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన స్వల్ప కాలంలోనే అన్ని వర్గాలకు చెందిన రైతులను ఆదుకుంటే.. ప్రతిపక్ష పార్టీ నాయకులు అవగాహన లేకుండా మాట్లాడుతూ రైతులపై మొసలికన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు.

# మీ సామాజిక స్పృహ ఎందరికో ఆదర్శం

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు
- పవన్‌కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు



అమరావతి (చైతన్యరథం): డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ జన్మది నం సందర్భంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఒక ప్రకటనలో శు భాకాంక్షలు తెలిపారు. నమ్మిన సిద్ధాంతాల కోసం కట్టుబడి పేద ప్రజల శ్రేయస్సు కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న పవన్ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. చిత్ర పరిశ్రమకు పవర్‌స్టార్‌గా, సామాన్య ప్రజలకు సేనానిగా సేవలందిస్తూ ఏ కష్టమొచ్చినా ముందుండే మీ సామాజిక స్పృహ ఎందరికో ఆదర్శం. దేశంలోనే ఏ రాష్ట్రం చేయని విధంగా కూట మి ప్రభుత్వంలో 13,236 గ్రామసభలు నిర్వహించి వరల్డ్ రికార్డ్ సాధించిన ఘనత మీకే సాధ్యమైంది. శాఖా పరంగా పంచాయ తీలను అభివృద్ధి పథంలో పయనింపజేస్తూనే..సామాజిక సేవలో మీరు చూపిస్తున్న చొరవ ఎందరికో ఆదర్శం. సీఎం చంద్రబాబు సారథ్యంలో మీ బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ స్వర్ణాంధ్రకు బాటలు వేస్తారనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. నవ్యాంధ్ర నిర్మాణం కోసం అహర్నిశలు మీరు చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు.

## నిమ్మకూరులో హరికృష్ణ జయంతి వేడుకలు

- ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలు
- ప్రారంభించిన మంత్రి కొల్లు రవీంద్ర



పామర్రు (చైతన్యరథం): నియోజకవర్గం పరిధిలోని నిమ్మకూ రులో స్వర్గీయ నందమూరి హరికృష్ణ జయంతిని ఘనంగా నిర్వ హించారు. హరికృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి మంత్రి కొల్లు రవీంద్ర నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరికృష్ణ తక్కువ సినిమాలు చేసినా పోషించిన పాత్రలు చిరస్థాయిగా నిలిచాయి. శ్రీకృష్ణావ తారం, సీతారాముల కళ్యాణం, సీతయ్య వంటి చిత్రాల్లో ఆయన నటన తెలుగు ప్రజలను మంత్రముగ్ధులను చేసింది. తెరపై తనదైన శైలిలో ముద్ర వేసిన నటుడు హరికృష్ణ. సహజమైన అభినయం, శక్తివంతమైన డైలాగ్ డెలివరీతో ప్రేక్షకుల గుండెల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించారు. తెరమీద పాత్రలు ఎంత నిజా యితీగా పోషించారో తెర వెనుక వ్యక్తిత్వంలోనూ అంతే నిజాయి తీతో జీవించారు. రాజకీయ నాయకునిగా హరికృష్ణ సేవలు సదా స్మరణీయం. తెలుగు భాష, కృష్ణా జిల్లాపై ఆయనకున్న మమకా రం అమోఘం. ఆయన లేని లోటు ఎప్పటికీ తీరదన్నారు. చంద్రబాబు తొలిసారి సీఎంగా పదవీ ప్రమాణ స్వీకారం చేసి నిన్నటికి 30 ఏళ్లు పూర్తయింది. ఈ మూడు దశాబ్దాల్లో ఆయన చరిత్రలో నిలిచిపోయే కార్యక్రమాలు చేశారు. తెలుగు వారి ఆత్మస్థైర్యాన్ని దేశవ్యాప్తంగా ప్రతిష్ఠింపజేసిన నేత ఎన్టీఆర్ అయి తే..నూతనోత్సాహాన్ని కలిగించిన నాయకుడు చంద్రబాబు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నందమూరి హరికృష్ణ కుమార్తె నందమూరి సుహాసిని, సోదరుడు నందమూరి రామకృష్ణ, స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, గుడివాడ ఎమ్మెల్యే వెనిగళ్ల రాము, జిల్లా టీడీపీ అధ్యక్షులు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపక్ష హోదా అడుక్కుంటేరాదు.. ప్రజలివ్వాలి

- పులివెందుల ప్రజలకు ఎంట్రీ పాస్ కావాలా?
- జగన్‌రెడ్డి నియంత పోకడలు సిగ్గుచేటు
- వైసీపీ నేతలు బుద్ధి తెచ్చుకుని మాట్లాడాలి
- కూటమి ప్రభుత్వానికి ప్రజలు బ్రహ్మరథం
- పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



నెల్లూరు (చైతన్యరథం): ప్రతిపక్ష హోదా అడుక్కుంటే రాదు.. ప్రజలివ్వాలని సర్వేపల్లి ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గొడ్డలి పోటుతో చిన్నాయన్ని లేపేసిన మీరా మా నాయకుడి గురించి మాట్లాడేది అని ప్రశ్నించారు. నెల్లూరులో మీడియాతో సోమిరెడ్డి మాట్లాడారు. గతంలో సకల శాఖల మంత్రిగా వెలగబెట్టిన సజ్జల వ్యాఖ్యలు హాస్యాస్పదం. దమ్ము, ధైర్యం ఉంటే వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వాలని అదు గుతున్నారు.. ప్రజలు ఇవ్వని ప్రతిపక్ష హోదా కోసం ఎన్నిసార్లు అడుక్కుంటారు? సంవత్సరం మూడు నెలల నుంచి అడుక్కోవ డమే పనా? పులివెందుల జెడ్పీటీసీ గెలిపించుకోలేని జగన్‌రెడ్డిని కలవాలంటే ఎంట్రీపాస్ ఉండాలంట..సొంత నియోజకవర్గం, సొంత మండల ప్రజలు కలవాలంటే కూడా పాస్ తీసుకోవాలంట ..ఇవన్నీ జగన్‌రెడ్డి నియంతపోకడలకు నిదర్శనం. ఐదేళ్ల దరిద్రం పట్టించి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. కూటమి పాలనలో మేం ఏ ఊరికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. అన్ని వర్గాల ప్రజలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటున్నారు. సూపర్‌సిక్స్ హామీల అమలుతో ఏ ఊరికి వెళ్లినా ప్రజలు సాదరంగా తమను ఆహ్వానిస్తున్నారన్నారు. అప్పట్లో పార్టీని కాపాడుకునేందుకు అంద రం కలిసి ప్రజా స్వామ్యయుతంగా చంద్రబాబును ఎన్నుకున్నాం. ఇప్పటికీ ప్రజలు చంద్రబాబు నాయకత్వంలో తెలుగుదేశం పార్టీని ఆదరిస్తూ గెలిపించుకుంటున్నారు. వెన్నుపోటు అయితే ప్రజలు ఆదరిస్తారా? మీరు చిన్నాయనపై గొడ్డలి పోటు వేసి ఆ నెపాన్ని మాపై నెట్టి 2019 ఎన్నికల్లో గెలిచారు. ప్రజలు అంతా గ్రహించా కే మిమ్మల్ని 11 సీట్లకు పరిమితం చేశారు. కొంచెమైనా బుద్ధి తెచ్చుకుని మాట్లాడాలని వైసీపీ నేతలకు హితవు పలికారు.



# ఐపీఎస్ అధికారి సంజయ్‌ను విచారించిన పోలీసులు

అమరావతి (చైతన్యరథం): అగ్నిమాపకశాఖ, సీఐడీ విభాగాల్లో జరిగిన నిధుల దుర్వినియోగం కేసులో ఐపీఎస్ అధికారి సంజయ్‌ను ఏసీబీ అధికారులు మంగళవారం విచారించారు. మొదటిరోజు విచారణలో దాదాపు ఏడున్నరగంటల పాటు ప్రశ్నించారు. ఉదయం జైలు నుంచి కస్టడీకి తీసుకుని వైద్య పరీక్షలు నిర్వహించి గొల్లపూడిలోని ఏసీబీ కార్యాలయానికి తరలించారు. నిధుల దుర్వినియోగం, ఎవరి ఆదేశాల ప్రకారం కాంట్రాక్టర్‌కు నిధులు కేటాయించారు అనే విషయాలపై ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. చాలా ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెప్పకుండా మౌనం వహించినట్లు తెలుస్తోంది.

# అసలైన వెన్నుపోటుదారుడు జగన్‌రెడ్డే



- అది మొదలైందే వైఎస్ కుటుంబం నుంచే..
- సిసలైన 'ప్రొటెక్టర్' చంద్రబాబునాయుడు
- నాడు దుష్టశక్తి నుంచి పార్టీని కాపాడారు
- నేడు వైసీపీ నుంచి రాష్ట్రాన్ని రక్షించారు
- వెన్నుపోటుపై బహిరంగ చర్చకు సిద్ధమా?
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య

మంగళగిరి (చైతన్యరథం): అసలైన వెన్నుపోటుదారుడు జగన్ రెడ్డేనని..వెన్నుపోటు అనేది మొదలైందే వైఎస్ కుటుంబం నుంచే నని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య మండిపడ్డారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు సిసలైన ప్రొటెక్ట ర్.. వెన్నుపోటుదారుడని ఎవరైనా అంటే వారు ఓపెన్ డిబేట్‌కు రావాలని ఛాలెంజ్ చేశారు. జగన్‌రెడ్డి గోబెల్స్ ప్రచారం చేయ టంలో దిట్ట. హిట్లర్ ప్రభుత్వంలో ఉన్నవి లేనట్లు, లేనివి ఉన్నట్లు మంత్రిగా గోబెల్స్ చూపించేవాడు. అతన్ని దాటి జగన్‌రెడ్డి వెళ్లి పోయాడు. సీఎం చంద్రబాబు సహనశీలి. చేయని తప్పుకు మూడు దశాబ్దాల నుంచి వెన్నుపోటు అనే నిందను మోస్తున్నారు. ఆయన ఒక ప్రొటెక్టర్. పేదవాడికి కూడు గుడ్డ నీడవ్వాలన్న పవిత్ర ఆశయంతో ఎన్టీఆం పార్టీ పెట్టారు. ఆగస్టు సంక్షోభంలో కూడా కాంగ్రెస్ కోవర్టుల నుంచి దేశవ్యాప్తంగా ఉద్యమం చేసి ఉక్కు మహిళ మెడలు వంచి 30 రోజుల్లోనే తిరిగి ఎన్టీఆర్‌ను సీఎం చేసిన ప్రొటెక్టర్ చంద్రబాబు. ఒక దుష్టశక్తి కబంధ హస్తాల నుంచి పార్టీని రక్షించిన మహాశక్తి ఆయన. అప్పుడు ప్రజలందరూ ఆయ నకే మద్దతు పలికారు. చంద్రబాబు తీసుకున్న ఆ అసాధారణ నిర్ణయానికి 1999 ఎన్నికల్లో ప్రజలందరూ చంద్రబాబుకు జైకొట్టి గెలిపించారు. నాడు చంద్రబాబు పగ్గాలు చేపట్టకపోతే ఆ దుష్టశక్తి చేతిలో టీడీపీ కనుమరుగైపోయేది. అదే జరిగి ఉంటే సైబరాబాద్ ఉండేదా? రింగ్ రోడ్ పడేదా? శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వచ్చేదా? హైదరాబాద్‌లో మతకల్లోలాలు ఆగేవా? ఐటీ విప్లవం వచ్చేదా? విదేశాల్లో తెలుగు వారు ఉన్నత స్థాయిలో ఉండేవారా? రాష్ట్రంలో పార్టీని కాపాడి రాష్ట్ర ప్రజల కోసం రాష్ట్ర సంక్షేమం కోసం ఆయన చేసిన దాన్ని వెన్నుపోటు అని చెప్పి దుర్మార్గంగా మాట్లాడతారా? అని ధ్వజమెత్తారు.

**వెన్నుపోటు మొదలైందే వైఎస్ కుటుంబం నుంచి..**

బతుకుదెరువు కోసం పొట్ట చేత పట్టుకొని వచ్చిన జగన్ తాత రాజారెడ్డికి బైరటీస్ గనిలో కొంచెం వాటా ఇచ్చిన బీసీకి చెందిన జింక వెంకట నర్సయ్యకే వెన్నుపోటు పొడిచి మొత్తం గనిని నాడు రాజారెడ్డి లాక్కున్నాడు. నాటి రక్తపు కూడు మీకు నేడు ధన ప్రవా హానికి దారి తీసింది. కోట్ల రూపాయలు కొడుకు అక్రమంగా సంపాదించుకోవడానికి సాయపడి ప్రజలకు వెన్నుపోటు పొడిచిన వైఎస్ఆర్ అసలైన వెన్నుపోటుదారుడు. వైఎస్ఆర్ బతికి ఉంటే జగన్‌పై ఉన్న అన్ని అక్రమ కేసుల్లో ఏ1గా వైఎస్ఆర్, ఏ2గా జగన్‌రెడ్డి, ఏ3గా విజయ్ సాయిరెడ్డి ఉండేవాడు. తండ్రి శవం ఇంటి రాకముందే సంతకాలు సేకరించి తండ్రికి వెన్నుపోటు పొడిచన వ్యక్తి జగన్‌రెడ్డి. వాన్‌పిక్ సంస్థ ద్వారా రూ.834 కోట్లు సాక్షి పత్రికలో పెట్టుబడి పెట్టాడానికి నిమ్మగడ్డ ప్రసాద్‌కు డబ్బు లు ఎక్కడ నుంచి వచ్చాయి? వైఎస్ఆర్ ప్రోద్భలంతో రూ.43 వేల కోట్లు జగన్‌రెడ్డి అక్రమంగా సంపాదించినట్లు సీబీఐ తేల్చిం ది నిజం కాదా? అని ప్రశ్నించారు.

**జగన్ వెన్నుపోటుదారుడనే దానికి ఇవే నిదర్శనం**

తండ్రి శవం ఇంటికి రాకముందే పదవి కోసం సంతకాల సేకరణకు ఉపక్రమించిన మీది వెన్నుపోటు. ఎలాంటి కొడుకుని కన్నానురా? అని వైఎస్ ఛీకొట్టిన రోజులు ఉన్నాయి. ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని కన్న తల్లికి, చెల్లికి జగన్‌రెడ్డి వెన్ను పోటు పొడిచింది జగనే. కనీసం వారు తాడేపల్లిలో ఉండడానికి కూడా ఇల్లు లేక వెళ్లిపోయారు. సొంత బాబాయికే వెన్నుపోటు పొడిచింది జగన్ కాదా? పైగా నిందింతులకు అండగా చెల్లి సునీతమ్మకు వెన్నుపోటు పొడిచాడు. నవరత్నాలని చెప్పి మోసం చేసిన జగన్‌రెడ్డిది వెన్నుపోటు. విషపూరిత మద్యం ద్వారా ఎంతోమంది జీవితాలు ప్రాణాలు కోల్పోయారు.. ఇవి అసలైన వెన్నుపోట్లు. చంద్రబాబు వెన్నుపోటుదారుడని సజ్జల మాట్లాడు తున్నాడు. నీకు దమ్ముంటే ఎవరు వెన్నుపోటుదారుడో తేల్చు కుందాం.. ఓపెన్ డిబేట్‌కి రావాలని సవాల్ విసిరారు. ఆడు దాం ఆడుదాం ఆంధ్ర అంటూ ఊరేగిన వ్యక్తి నేడు పోలీసులు ఆడుకుంటారేమోనని భయపడి బయట ప్రపంచానికి దూరమైం ది. ఆ రోజా అయినా ఓపెన్ డిబేట్‌కి రావచ్చునని సవాల్ విసిరారు.

## రుణాలు ఇప్పిస్తామని వైసీపీ నేత మోసం

**నకిలీ పత్రాలతో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ - ప్రజావినతుల్లో బాధితుల ఫిర్యాదు**



మంగళగిరి (చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ప్రజావినతుల్లో సమస్యలు పరిష్కరించాలని అర్జీదా రులు తరలివచ్చారు. ఏపీ అర్బన్ ఫైనాన్స్, ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, ఏపీ ఫిషర్ మెన్ కోఆపరేటివ్ సొసైటీ పెడరేషన్ లిమిటెడ్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు అర్జీలు స్వీకరించారు. తమ గ్రామంలో జీవాలను పెంచుకుంటూ కూలి పనులు చేసుకుంటున్న తమను వైసీపీ నేత రుణాలు ఇప్పిస్తామని మోసగించారని పల్నాడు జిల్లా నాదెండ్ల మండ లం కనపర్రు గ్రామానికి చెందిన మల్లా రామారావు, మల్లా పోతు రాజు, మల్లా నాగేసు, నలబోతు కేశవులు ఫిర్యాదు చేశారు. చిలకలూరిపేట టౌన్‌కు చెందిన గుంజి శ్రీను వైసీపీ ప్రభుత్వంలో కీలక నాయకుడినని నమ్మబలికి ఎస్టీ కార్పొరేషన్ కింద లోన్లు, భూమి, ఇళ్లు ఇప్పిస్తానని నమ్మబలికి తమ వద్ద సుమారు రూ. కోట వరకు తీసుకున్నాడని వివరించారు. ఏమీ ఇప్పించకపోగా తమ డబ్బులు కూడా ఇవ్వకుండా మోసగించాడని తెలిపారు. అతని వద్దకు వెళ్లి డబ్బు అడుతున్న తరుణంలో బాపట్ల జిల్లా చినగంజాం మండలానికి చెందిన దేవరకొండ సుబ్బారావు, బాలిగ గాయత్రిలు "ఆస్తులు తమ పేరుపై ఉన్నాయి, డబ్బులు మేమే ఇస్తాం" అని చెప్పి రూ.21 లక్షలు వసూలు చేసి మోసగించారని వివరించారు. డబ్బులు ఇవ్వకపోగా కేసులు పెడితే చంపేస్తామని బెదిరించారని తెలిపారు. వారిపై చర్యలు తీసుకుని డబ్బు ఇప్పించాలని కోరారు.

**తప్పుడు పత్రాలతో భూమి తీసుకున్నారు.**

తమ గ్రామ పరిధిలో తమకు ఉన్న భూమి ఆన్‌లైన్‌లో భూక్యా అమ్ములు పేరుపై నమోదయ్యాయని తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం ఎంపేడు గ్రామానికి చెందిన డబ్బా బదూర్ సింగ్ తెలిపారు. విచారించగా గతంలో తమ పంటలకు రుణాలు ఇప్పి స్తానని నమ్మబలికి భూక్యా లింగయ్య ఒరిజినల్ పట్టాలు తీసుకుని ఎటువంటి సబ్సిడీ రుణాలు ఇప్పించకపోగా తప్పుడు పత్రాలు సృష్టించి తమ భూమిని భూక్యా అమ్ములు పేరుపై విక్రయాలు జరిపి ఆన్‌లైన్‌లో వారి పేరుపై నమోదు చేయించినట్టు తెలిసింద న్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసు కోలేదు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

**భూ సమస్యలు పరిష్కరించాలి**

బాపట్ల మండలం కుక్కలవారిపాలెం పంచాయతీ పరిధిలోని సర్వే నం.1397లోని ప్లాట్ నం.6లో 0.05 1/4 సెంట్ల స్థలాన్ని 29-06-2006న రిజిస్ట్రేషన్ చేసుకుని అప్పులు తీర్చేందుకు ఆ స్థలాన్ని విక్రయించదలుచుకోగా అది అసైన్డ్ భూమి అని అమ్మ కానికి వీలులేదని అధికారులు అడ్డుకున్నారని గుంటూరు జిల్లా కాకుమాను మండలం బోడిపాలెం గ్రామానికి చెందిన చెన్నపాటి పద్మశ్రీ తెలిపారు. తన స్థల సమస్యను పరిష్కరించి తగిన న్యాయం చేయాలని కోరారు. మరో ఫిర్యాదులో బుట్టాయగూడెం మండలం కొయరాజుల గూడెంలో సర్వే నెం.14లో తమకు భూమి ఉందని ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం ధర్మరావుపేట గ్రామా నికి చెందిన పెన్మెత్మ శ్రీరామరాజు తెలిపారు. రవిగూడెం గ్రామ గిరిజనులు కటం బుచ్చయ్య, కన్నయ్య, మడకం వెంకన్న, కటం లక్ష్మయ్య దౌర్జన్యంగా అడ్డుకుంటున్నారని వివరించారు. వారిపై చర్యలు తీసుకుని తమ భూమిని ఇప్పించాలని కోరాడు. వంశధార ప్రాజెక్ట్ కారణంగా భూములు కోల్పోయి జీవనోపాధి కోల్పోయిన పరిస్థితిలో ఉన్నామని శ్రీకాకుళం జిల్లా కొత్తూరుకి చెందిని లోతు గెద్ద తులసిబాబు తెలిపారు. పారాపురం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి సహకరించినప్పటికీ రిజర్వాయర్ పక్కనే నివసిస్తున్న తమ గ్రామాలకు సాగునీరు, తాగునీరు సదుపాయం కల్పించలేదని వివరించారు. పారాపురం బ్యాలెన్సింగ్ రిజర్వా యర్ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు వంశధార ఫేజ్ -2 ద్వారా లేదా నాబార్డ్ ద్వారా ప్రభుత్వం మంజూరు చేయించి లబ్బ, కారిగూడ, ఓంద్రుజోల, ఇరపాడు, మెట్టూరు, పారాపురం, పులిపుట్టి, గునభద్ర గ్రామాల ప్రజలకు తాగునీరు, సాగునీరు కల్పించాలని కోరాడు.

## మంత్రి మండిపల్లి రక్తదానం



రాయచోటి (చైతన్యరథం): ముఖ్యమంత్రిగా చంద్రబాబు తొలి సారి ప్రమాణ స్వీకారం చేసి 30 ఏళ్లు పూర్తి, పవన్‌కళ్యాణ్ జన్మ దినం సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మంగళవా రం రాయచోటి పట్టణంలోని దీప బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు, నాయ కులు ప్రతిఒక్కరూ రక్తదానం చేసి నిండు ప్రాణాలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, పట్టణ నాయకు లు బోనమల ఖాదర్‌వలి, టీడీపీ నాయకురాలు సుజాత, అతవుల్లా, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వైద్యకళాశాలలు, బోధనాసుపత్రులకు

## ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్ల నియామకం

అమరావతి (చైతన్యరథం): మూడు ప్రభుత్వ వైద్యకళాశాలలకు, నాలుగు బోధానాసుపత్రులకు ప్రభుత్వం కొత్త ప్రిన్సిపాళ్లను, సూపరింటెండెంట్లను నియమించింది. వీరిలో ఐదుగురు గత వారం అదనపు వైద్య విద్యా సంచాలకులు (ఏడీఎంఈలు)గా పదోన్నతి పొందారు. వీరికి పోస్టింగులతో పాటు, మరో ఇద్దరు ఏడీఎంఈల బదిలీలను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదించారు. కాకినాడలోని ప్రభుత్వ రంగరాయ మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్‌గా ఉన్న దేవి మాధవిని ఏడీఎంఈగా ప్రమోషన్ మీద విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించా రు. విజయవాడ సిద్దార్ధ మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్‌గా ఉన్న ఎం.విజయశ్రీని అనంతపురం కాలేజీ ప్రిన్సిపాల్‌గా నియమించా రు.

విశాఖ ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ సౌమినిని ఏడీఎం ఈగా పదోన్నతిపై మచిలీపట్నం బోధనాసుపత్రి కొత్త సూపరిం టెండెంట్‌గా నియమించారు. కర్నూలు సర్వజనా సుపత్రి సూపరింటెండెంట్‌గా ఉన్న కె.వెంకటేశ్వర్లు పదోన్నతిపై అదే పోస్టులో కొనసాగనున్నారు. ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ జె.కిషోర్‌ను పదోన్నతిపై పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్ సూపరింటెం డెంట్‌గా నియమించారు. గతవారం ఏడుగురు ప్రొఫెసర్లను ఏడీఎంఈ లుగా ప్రమోట్ చేయగా వారిలో ఇద్దరు పదోన్నతులను స్వీకరిం చలేదు. కాగా విజయనగరం జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎస్.అప్పలనాయుడును అయన కోరిక మేరకు శ్రీకాకుళం ప్రభు త్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు. పలాసలోని కిడ్నీ రీసెర్చ్ సెంటర్ సూపరింటెండెంట్‌గా ఉన్న అల్లు పద్మజ విజయ నగరం బోధనాసుపత్రి సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. నంద్యాల ఆసుపత్రి సూపరింటెండెంట్ డి.మల్లీశ్వరిని అనంతపు రం జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు.

**పూర్తిస్థాయిలో ఏడీఎంఈలు**

డీఎంఈ పరిధిలో మొత్తం 37 ఏడీఎంఈ పోస్టులు ఉన్నాయి. 2024 -25 ప్యానెల్ సంవత్సరంలో భారీ స్థాయిలో పదోన్నతులు కల్పించినందున అన్ని స్థానాలు భర్తీ అయ్యాయి. అయితే ఏడీ ఎంఇగా ఉన్న రఘునందన్ డీఎంఈగా బాధ్యతలు చేపట్టడం, పాడేరు ప్రిన్సిపాల్ ఆగస్టు 31న పదవీవిరమణ చేయడంతో పాటు తాజాగా ప్రమోట్ అయిన ఏడీఎంఈలలో ఇద్దరు ప్రమోషన్‌ను తిరస్కరించినందున నాలుగు ఏడీఎంఈ పోస్టులు ప్రస్తుతానికి ఖాళీగా ఉన్నాయి.

# విద్యుత్ ప్రమాదాల నివారణే లక్ష్యం

- **మానవ తప్పిదాలు, నిర్వహణ లోపాలు సరిచేయండి**
- **టోల్ ఫ్రీ నెంబర్ 1912కు విస్తృత ప్రచారం కల్పించండి**
- **తీసుకుంటున్న త్రైమాసిక చర్యలపై నివేదిక ఇవ్వండి**
- **విద్యుత శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశం**



అమరావతి (చైతన్యరథం): విద్యుత్ ప్రమాదాల శాశ్వత నివార ణే లక్ష్యంగా ఎలక్ట్రికల్ సేఫ్టీ అధికారులు పనిచేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న విద్యుత్ ప్రమాదాలపై సచివాలయం లో మంగళవారం ఆ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రమాదాలు జరగడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మానవ తప్పిదాలు, నిర్వహణ లోపాల వలన ప్రమాదాలు జరుగుతున్నాయని కొందరు అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముం దస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి ఏడాదికి ప్రమాదాల సంఖ్య తగ్గించేందుకు కఠిన చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ప్రమాదాలు జరిగిన తరువాత బాధితులకు కేవలం నష్ట పరిహారం చెల్లించడమే సమాధానం కాదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని కాలా ల్లోనూ ఎటువంటి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా నివారించ డమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. ప్రజల ప్రాణ రక్షణే కూటమి ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యతగా పేర్కొన్నారు. ప్రమాదాల వల్ల ఇకపై ఎవరూ నష్టపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా విద్యుత్ ప్రమా దాల విషయంలో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**సాంకేతికత వినియోగం అవసరం**

విద్యుత్ ప్రమాదాల నివారణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం అవసరమని సూచించారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఆధారంగా ప్రమాదాలను తగ్గించే దిశగా కసరత్తు చేయాలని ఆదేశించారు. ప్రతి త్రైమాసికానికి ఒకసారి ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై సంబం ధిత డిస్కంలకు సమగ్ర నివేదిక పంపాలని ఎలక్ట్రికల్ సేఫ్టీ అధికారులను ఆదేశించారు. అదే విధంగా విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్ 1912ను విస్తృతంగా ప్రచారం చేసి ప్రజల్లోకి తీసుకెళ్లా లని సూచించారు. విద్యుత్ ప్రమాదాల పట్ల ప్రజల్లో అవగాహన పెంచేందుకు సోషల్ మీడియా, మీడియా వేదికలను ఉపయోగిం చుకోవాలన్నారు. భవిష్యత్తు తరాల వారికి కూడా అవగాహన కల్పించడం ద్వారా ప్రమాదాల నివారణ సాధ్యపడుతుందని అభిప్రాయపడ్డారు. ఇందులో భాగంగానే పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా పక్క రాష్ట్రాల్లో విద్యుత్ ప్రమాదాల నివారణకు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేసి వాటిని రాష్ట్రంలో అమలు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించా రు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ సేఫ్టీ అధికారులు, పలువురు ఇంధన శాఖ అధికారులు పాల్గొన్నారు.

### రాష్ట్రంలో రికార్డ్ జీఎస్టీ వసూళ్లు..

## ఇప్పుడేమంటావు జగన్?

**- బయో డైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం సూటి ప్రశ్న**



అమరావతి (చైతన్యరథం): గత కొన్ని మాసాలుగా మొదటి తారీఖున జీఎస్టీ వసూళ్ల వివరాలు రాగానే, ఏవో పనికిమాలిన పోలికలు పెట్టి, ఎవరో రాసిచ్చిన లెక్కలను ఉదహరిస్తూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై తన 'ఎక్స్' అకౌంటులో విమర్శలతో కూడిన పోస్టు పెట్టడం వైఎస్ జగన్‌కు పరిపాటి అయిందని రాష్ట్ర బయో డైవర్శిటీ బోర్డు చైర్మన్, టీడీపీ అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్ కుమార్ ఆక్షేపించారు. కానీ వైసీపీ విమర్శలని పటాపంచలు చేస్తూ ఈ ఆగస్ట్ నెలలో ఆంధ్రప్రదేశ్ జీఎస్టీ వసూళ్లు రూ.3,989 కోట్లతో రికార్డు స్థాయిలో వచ్చాయని విజయ్ కుమార్ తెలిపారు. 2024 ఆగస్టు జీఎస్టీ వసూళ్లతో పోలిస్తే ఈ ఏడాది ఆగస్టు వసూళ్లు 21 శాతం వృద్ధిని సాధించాయి. దేశంలో సిక్కిం, నాగాలాండ్, అండమాన్ లాంటి తక్కువ పన్నుస్థాయి ఉన్న చిన్న రాష్ట్రాలను పక్కన పెడితే, ఏ పెద్ద రాష్ట్రంలోనూ ఇంత వృద్ధి నమోదు కాలేదు. ఆంధ్రప్రదేశ్ 21 శాతం వృద్ధితో దేశ సగటు వృద్ధి 10 శాతం కంటే రెట్టింపు సాధించింది. 2017లో జీఎస్టీ అమల్లోకి వచ్చాక నెల వారీగా చూసినా, ముందు సంవత్సరాలతో పోల్చి చూసినా అత్యధిక రాబడి ఈ ఏడాది ఆగస్టులో వచ్చిన రూ.3,989 కోట్లే కావడం గమనార్హం. గతేడాది ఆగస్టులో జీఎస్టీ వసూళ్లు రూ.3,298 కోట్లతో పోలిస్తే ఈ ఏడాది ఆగస్టులో రూ.3,989 కోట్లకు పెరిగింది.

**కోలుకుంటున్న ఆర్థికం**

తమ పాలనలో 2023లో బ్రహ్మాండంగా వసూళ్లు వచ్చాయని జగన్ చెప్పుకుంటారు... ఆ ఏడాది ఆగస్టుతో పోలిస్తే కూడా 2025 ఆగస్టులో నికర జీఎస్టీ వసూళ్లు 14.38% పెరిగాయి. స్థూల జీఎస్టీ వసూళ్లు 14.67% వృద్ధిని నమోదు చేశాయి. రాష్ట్ర జీఎస్టీ వసూళ్లు 13.82% వృద్ధి నమోదు చేస్తే, ఐజీఎస్టీ వసూళ్లు రూ.1,613 కోట్లతో రికార్డు సృష్టించాయి. 2024 ఏప్రిల్–ఆగస్టులో రూ.21,164 కోట్ల వసూళ్లు వుండగా.. 2025 ఏప్రిల్–ఆగస్టులో రూ.22,352 కోట్లకు చేరింది. కిందటి ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ సారి మొదటి ఐదు నెలల్లో ప్రతి నెలా పన్ను వసూళ్లు గతంకన్నా పెరిగాయంటే ఆర్థిక వ్యవస్థ ఎంతగా కోలుకుంటున్నదనేది స్పష్టమవుతోంది.

**మాటల్లో కాదు.. చేతల్లో**

వైసీపీ ప్రభుత్వం కంటే అధికంగా పన్ను వసూళ్లే కాదు.. స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల ఆదాయం నలభై శాతం పైన వృద్ధితో పురోగమిస్తుంటే, జగన్ మాత్రం పస లేని పనిమాలిన విమర్శలను ఎక్స్ అకౌంట్‌లో పెట్టేసి తనలో తానే పిచ్చి ఆనందం పొందుతుంటారు. తెలుగుదేశం ప్రభుత్వం ప్రజలకిచ్చిన మాట ప్రకారం, విధ్వంసానికి గురైన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థని మళ్ళీ గాడిలో పెట్టే విధంగా చర్యలు తీసుకుంటోంది. మాటల్లో కాకుండా.. రాష్ట్ర ఆర్థికస్థితి పురోగమనాన్ని రికార్డ్ స్థాయి పన్ను వసూళ్ళ రూపంలో చూపిస్తోందని విజయ్ కుమార్ స్పష్టం చేశారు.

## నెలాఖరులోగా సీఆర్డీఏ ప్రధాన కార్యాలయ ప్రారంభోత్సవం

**- మున్సిపల్ విభాగాలన్నీ ఇందులోకే**

**- మంత్రి నారాయణ వెల్లడి**



అమరావతి (చైతన్యరథం): ఈ నెలాఖరులోగా మంచిరోజు చూసి సీఆర్డీఏ ప్రధాన కార్యాలయం ప్రారంభిస్తామని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖల మంత్రి నారాయణ తెలిపారు. రాజధాని అమరావతిలోని రాయపూడిలో ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న సీఆర్డీఏ ప్రధాన కార్యాలయాన్ని మంగళవారం మంత్రి నారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో సీఆర్డీఏ కార్యాలయ నిర్మాణం జరుగుతోందన్నారు. 2014-19 లోనే ఈ కార్యాలయం పనులు చాలావరకూ పూర్తయ్యాయి. గత ప్రభుత్వం మూడు ముక్కలాటతో నిర్మాణాలు మధ్యలో నిలిపే సింది. ప్రస్తుతం సీఆర్డీఏ కార్యాలయం విజయవాడలో ఉండటంతో.. అక్కడికి వెళ్లాలంటే ప్రతిసారీ అమరావతి నుంచి విజయవాడ వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికీ మున్సిపల్ విభాగాల్లో కొన్ని మంగళగిరి, తాడేపల్లిలో ఉన్నాయి. రాయపూడిలో సీఆర్డీఏ ప్రధాన కార్యాలయం ప్రారంభమయితే మున్సిపల్ శాఖలో అన్ని డిపార్టుమెంట్లు ఈ కార్యాలయంలోకి వస్తాయి. ప్రజలకు పాలన సులభం చేయడానికే సీఆర్డీఏ కార్యాలయ భవనం ఏర్పాటు చేశామని మంత్రి నారాయణ తెలిపారు.

**ఆ భూములకు భూ సేకరణ విధానం**

అమరావతిలో ఇప్పటికీ భూ సమీకరణ ద్వారా భూములు ఇవ్వని అతి కొద్దిమంది రైతులకు మరోసారి విజ్ఞప్తి చేస్తున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. రాజధాని రైతులకు భూ సేకరణ కంటే భూ సమీకరణ ద్వారానే ఎక్కువ లాభం చేకూరుతుందని మరోసారి స్పష్టం చేసారు. ప్రస్తుతం అమరావతి నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయని...అయితే ఆయా నిర్మాణాల ప్రాంతంలో మధ్యలో ఒక ఎకరా నుంచి ఐదెకరాల వరకూ ఉన్న కొద్ది భూములను రైతులు అప్పట్లో భూ సమీకరణలో సీఆర్డీఏకు ఇవ్వలేదన్నారు. ఇలాంటి భూములు సుమారు 1800 ఎకరాల వరకూ ఉన్నాయన్నారు. ఆయా భూములను భూ సేకరణ ద్వారా తీసుకోవాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు.

ఈ అంశంపై సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సీఆర్డీఏ 52వ అథారిటీలో నిర్ణయం తీసుకున్నామన్నారు. ఆయా భూములను భూసేకరణ ద్వారా తీసుకునే అధికారాన్ని సీఆర్డీఏ కమిషనర్‌కు అథారిటీ అప్పగించినట్లు మంత్రి తెలిపారు.

## ప్రకాశం జిల్లాకు నరేగా పెండింగ్ నిధులు

**- రూ.10 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం**

**- సీఎం చంద్రబాబుకు మంత్రి డోలా కృతజ్ఞతలు**

కొండపి(చైతన్యరథం): ప్రకాశం జిల్లాకు నరేగా పెండింగ్ నిధులు రూ.10 కోట్లు విడుదలయ్యాయని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి మంగళవారం ఒక ప్రకట నలో తెలిపారు. త్వరలో ఈ నిధులు పనులు చేసిన వారి ఖాతాల్లో జమ అవుతాయని వెల్లడించారు. గత ప్రభుత్వం కేవలం కక్షతో నిధులివ్వకుండా పనులు చేసిన వారిని ఇబ్బందులకు గురి చేసిం దని మండిపడ్డారు. తాము చెప్పిన మాట ప్రకారం పెండింగ్ నిధులు చెల్లిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాదిన్నర పాలనలోనే ప్రకాశం జిల్లాలో రూ.170 కోట్లతో నరేగాలో అభివృద్ధి పనులు చేశామని, పంచాయతీరాజ్‌లో రూ.140 కోట్లతో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు నిర్మించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా నిధులు విడుదలకు చొరవ చూపిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

### బంగాళాఖాతంలో అల్పపీడనం



అమరావతి (చైతన్యరథం): వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినట్లు భారత వాతావరణ కేంద్రం మంగళవారం ప్రకటించింది. ఒడిశా పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 1.5 కిలో మీటర్ల ఎత్తులో బలమైన రుతుపవనాల ద్రోణి కొనసాగుతోంది. దీంతో ఏపీ వ్యాప్తంగా ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఉత్తర కోస్తాలో బుధవారం ఒకట్రెండు చోట్ల అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. అల్పపీడన ప్రభావం సుమారు రెండు రోజుల పాటు కొనసాగుతుందని పేర్కొంది.

# 'స్త్రీ శక్తి' మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక

- ఇప్పటికి 3 కోట్ల మందికి పైగా ఉచిత బస్సు ప్రయాణం
- కూటమి ప్రభుత్వంలోనే మహిళల అభ్యున్నతి
- ప్రతి మహిళను లబ్దిదారురాలిగా మార్చిన 'స్త్రీ శక్తి'
- మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్
- మైలవరంలో 'స్త్రీశక్తి' పై కృతజ్ఞతా ర్యాలీ, విజయోత్సవ సభ






మైలవరం (చైతన్యరథం): 'స్త్రీ శక్తి' మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక అని, విజనరీ లీడర్ సీఎం చంద్రబాబు గారి సారథ్యంలోని కూటమి ప్రభుత్వంతోనే మహిళల అభ్యున్నతి సాధ్యమని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. స్త్రీ శక్తి పథకం ఎటువంటి తారతమ్యాలు లేకుండా రాష్ట్రంలోని ప్రతి మహిళను లబ్ధిదారురాలిగా మార్చిందన్నారు.

'స్త్రీశక్తి' పథకం అమలు చేయటాన్ని హర్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ మైలవరం పట్టణంలో బస్టాండ్ నుంచి ప్రధాన కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహం వరకు మంగళవారం నిర్వహించిన భారీ విజయోత్సవ ర్యాలీలో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌తో పాటు మహిళా సోదరీమణులు పాల్గొన్నారు.

అన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జోహార్ ఎన్టీఆర్, జై చంద్రబాబు అంటూ నినదించారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్, స్త్రీ శక్తి పథకం బంపర్ హిట్ అంటూ మహిళలు నీరాజనం పలికారు.

అనంతరం ఎస్వి కళ్యాణమండపంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ మాట్లాడుతూ 'స్త్రీ శక్తి' పథకంతో ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం కల్పించినట్లు వెల్లడించారు.

ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే ప్రతి మహిళకు సగటున నెలకు రూ.1,500 నుంచి రూ.3,000లకు పైగా ప్రయోజనం కలుగుతుందన్నారు. గడచిన 15 రోజుల్లో ఈ పథకం కింద దాదాపు 3 కోట్ల మంది మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణాలు చేశారన్నారు. 74 శాతం బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం కల్పించామని, భవిష్యత్తులో ఎలక్ట్రికల్ ఏసీ బస్సుల్లో కూడా ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామని పేర్కొన్నారు.

తల్లికివందనం, దీపం-ఉచిత గ్యాస్, స్త్రీ శక్తి, మహాశక్తి ఇలా ప్రతి పథకంలోనూ మహిళలను ప్రధాన భాగస్వాములు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు.

గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో కపట నాటకాలు ఆడి, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. దీనివల్ల ఈ ప్రాంతం పూర్తిగా అభివృద్ధిలో వెనకబడిందన్నారు. తద్వారా మన బిడ్డల భవిష్యత్తు అంధకారంలో పడిందన్నారు.

గడచిన వైసీపీ పాలనలో ఒక పరిశ్రమ కూడా ఈ ప్రాంతానికి రాలేదన్నారు. మళ్లీ కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి అభివృద్ధి పట్టాలెక్కిందన్నారు. ఈ ప్రాంతానికి పెట్టుబడులు తీసుకువచ్చేందుకు, పరిశ్రమల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, దీనివల్ల ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు.

గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో దాదాపు 10.5 లక్షల కోట్ల అప్పును మన నెత్తిన రుద్దిందన్నారు. ప్రతినెలా మన ఏపీకి రూ.1.10 లక్షల కోట్ల ఆదాయం ఉంటే, అదే విధంగా ఖర్చు కూడా ఉందన్నారు. దీనికి అదనంగా గత ప్రభుత్వం చేసిన అప్పుకు కట్టాల్సిన వడ్డీతో పాటు మళ్ళీ సంక్షేమ, అభివృద్ధి పనులకు నిధులు అవసరమన్నారు.

ఇన్ని సవాళ్ళను అధికమిస్తూ ప్రతినెలా పింఛన్లు రూ.3,500 కోట్లు, ఉచిత బస్సు ప్రయాణానికి ఏడాదికి రూ.2000 కోట్లు, తల్లికి వందనంకు రూ.10 వేల కోట్లు, ఇంకా అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తదితర పథకాలకు కోట్లాది రూపాయలను సమీకరించి ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అన్నదాత సుఖీభవ పథకం అమలుకు హర్షిస్తూ ఏర్పాటుచేసిన గొల్లపూడిలో ట్రాక్టర్ ర్యాలీ విజయవంతమైందని, అదేవిధంగా స్త్రీశక్తి పథకం అమలుకు కృతజ్ఞతలు చెబుతూ కూడా ఇక్కడికి విచ్చేసిన సోదరీమణులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

ఇదే రోజున 54వ జన్మదినోత్సవాన్ని జరుపుకుంటున్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన సేవలను, దాతృత్వాన్ని కొనియాడారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీలకు రూ.1లక్ష చొప్పున 6 కోట్ల రూపాయలను ఆయన గతంలో ఇచ్చారని పేర్కొన్నారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఎన్టీఆర్

- హరికృష్ణ ప్రజాస్వామ్యానికి నిలువెత్తు ఉదాహరణ
- నిమ్మకూరుకు ఎన్టీఆర్ తెచ్చిన ఖ్యాతి అపారం
- మానికొండలో టీడీపీ తొలి విజయం.. రామకృష్ణ ప్రచార ఫలితం
- పేదలకు బియ్యం, మహిళలకు హక్కులు.. ఎన్టీఆర్ ధ్యేయం
- గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం (చైతన్యరథం) : సినిమా నటుడుగా అభిమానుల మనస్సులో తిరుగులేని స్థానం సాధించిన ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి, ప్రజలకు సేవచేయటం ద్వారా ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం పొందారని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అభిప్రాయపడ్డారు. నందమూరి హరికృష్ణ 69వ జన్మదిన పురస్కరించుకొని ఎన్టీఆర్ స్వగ్రామమైన నిమ్మకూరులో మంగళవారం ఉదయం ఏర్పాటు చేసిన మెగా వైద్యశిబిరం, రక్తదాన శిబిరం ప్రారంభోత్సవంలో యార్లగడ్డ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో యార్లగడ్డ ప్రసంగిస్తూ రాష్ట్రంలో ఎంతోమంది సినీ నటులు పేరు ప్రఖ్యాతులు సాధించినప్పటికీ, తెలుగు ప్రజల గుండెల్లో తిరుగులేని స్థానం దక్కించుకుంది మాత్రం ఎన్టీ రామారావే అన్నారు. తెలుగుదేశం పార్టీని స్థాపించి ఆరు నెలల్లోనే ముఖ్యమంత్రి అయిన ఆయన పేదలకు రెండు రూపాయలకే కిలో బియ్యం, రాయితీపై జనతా వస్త్రాలు వంటి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడంతోపాటు, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు వంటి చట్టం చేయటం ద్వారా ప్రజలకు చేరువయ్యారన్నారు. ప్రపంచంలో 60 సంవత్సరాల వయసులో పార్టీని స్థాపించి ముఖ్యమంత్రి పదవిని చేపట్టటం ఎన్టీ రామారావు కె సాధ్యమైందని ఎమ్మెల్యే వెంకట్రావ్ కొనియాడారు. "శక్తివంతమైన నాయకులు అత్యంత శక్తివంతమైన ప్రదేశాల నుండి వస్తారన్న" ఇంగ్లీష్ నానుడికి భిన్నంగా ఎన్టీ రామారావు వల్ల కుగ్రామమైన నిమ్మకూరు గ్రామానికి పేరు ప్రఖ్యాతులు వచ్చాయన్నారు. రాజ్యసభ పదవిని త్యాగం చేసి సమైక్యాంధ్ర ఉద్యమానికి అండగా నిలిచిన వ్యక్తి హరికృష్ణ అని గుర్తు చేశారు. సమైక్య ఉద్యమం సమయంలో రాష్ట్రంలో ఎంతోమంది ప్రజా ప్రతినిధులు రాజీనామాలు చేసినప్పటికీ సమైక్య రాష్ట్రం కోసం పదవికీ రాజీనామా చేసిన ఏకైక నాయకుడు హరికృష్ణ అని పేర్కొన్నారు. టిడిపి పార్టీ స్థాపించిన సమయంలో తండ్రి ఎన్టీఆర్ రాష్ట్ర పర్యటనలో వాహనాన్ని నడిపిన హరికృష్ణ నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు పనిచేశారని చెప్పారు. హరికృష్ణతో తనకు గల అనుబంధాన్ని ఈ సందర్భంగా యార్లగడ్డ గుర్తు చేసుకున్నారు. టీడీపీ స్థాపించిన తరువాత ఇప్పటి వరకు ఏ ఎన్నికల్లోను గన్నవరం నియోజకవర్గంలోని మానికొండ గ్రామంలో టీడీపీ కీ మెజార్టీ రాలేదని అసెంబ్లీ ఎన్నికల సమయంలో నందమూరి రామకృష్ణ ఆ గ్రామంలో ప్రచారం చేయటంతో తొలిసారి మానికొండలో టీడీపీ అధిక్యత సాధించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మంత్రి కొల్లు రవీంద్ర, నందమూరి సుహాసిని, నందమూరి రామకృష్ణ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ, గుడివాడ ఎమ్మెల్యేలు వర్ల కుమార్ రాజా,వెనిగండ్ల రాము, రావి వెంకటేశ్వరరావు, గొట్టిపాటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# చైతన్య రథసారథి నందమూరి హరికృష్ణ

## సంచలన నాయకుడు పవన్ కల్యాణ్: ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు

- సేవా మార్గంలో హరికృష్ణ చిరస్థాయిగా నిలిచారు
- పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అమిలినేని
- కళ్యాణదుర్గంలో కేక్ కటింగ్, ఘనంగా కార్యక్రమం
- ఘనంగా నందమూరి హరికృష్ణ 69వ జయంతి వేడుకలు

కళ్యాణదుర్గం (చైతన్యరథం): కళ్యాణదుర్గం ఎమ్మెల్యే కార్యాలయం ప్రజావేదికలో నందమూరి హరికృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు. అనంతరం స్థానిక నాయకులతో కలసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మాట్లాడుతూ రాజ్యసభలో తెలుగు వారి గొంతును తెలుగులోనే వినిపించిన మేధావి, టీడీపీ పార్టీ వ్యవస్థాపకులు అన్న నందమూరి తారక రామారావు చైతన్య రథసారది, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్యాబినెట్‌లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రిగా హిందూపురం ఎమ్మెల్యేగా, పొలిట్ బ్యూరో సభ్యులుగా పనిచేశారని గుర్తుచేసారు. ఘనంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 54వ పుట్టినరోజు సందర్బంగా ఎమ్మెల్యే అమిలినేని స్థానిక టీడీపీ, జనసేన నాయకులతో కలసి కేక్ కట్ చేసారు.

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, పర్యావరణం, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి వర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ కూటమి ప్రభుత్వం ఏర్పడటంలో కీలక పాత్ర పోషించారని, నేడు రాష్ట్ర అభివృద్ధిలో కూడా సీఎంకి చేదోడు వాదోడుగా ఉంటున్నారని అమిలినేని అన్నారు.



# చంద్రబాబు నాయకత్వంలో పని చేయడం అదృష్టం

- డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు
- 50 లక్షలతో గుడిపల్లి కాలువలో పూడిక తీత, ప్రొటక్షన్ వాల్ నిర్మాణాన్ని చేపడతాం
- సీఎం చంద్రబాబు నాయుడు స్ఫూర్తితో ప్రజాసేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చాను
- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

నెల్లూరు (చైతన్యరథం): తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 30 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సీఎం చంద్రబాబు నాయుడుకి శుభాకాంక్షలు తెలియజేసారు. ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమంలో భాగంగా ఆమె బుచ్చిరెడ్డి పాళెం పట్టణంలోని 11 వార్డుల్లో పర్యటించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు స్ఫూర్తితో నిత్యం ప్రజలలో వుంటూ ప్రజాసేవ చేయడానికే రాజకీయాలలోనికి



వచ్చానన్నారు. 50 లక్షల వ్యయంతో దుర్గంధ మయంగా మారిన గుడిపల్లి కాలువలో పూడిక తీయడంతో పాటు ప్రొటక్షన్ వాల్ నిర్మాణానికి త్వరలో శ్రీకారం చుడుతానన్నారు. గుడిపల్లి కాలువ కారణంగా ప్రజలు పడుతున్న అవస్థలను గత ప్రభుత్వం పట్టించుకోలేదని ఆమె ఆరోపించారు. మున్సిపల్, కమీషనర్ మరియు ఛైర్ పర్సన్లతో చర్చించి గుడిపల్లి కాలువ ప్రక్షాళన పనులను ప్రారంభిస్తానన్నారు.

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం కూటమి పార్టీల నేతల సమక్షంలో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సీఎం చంద్రబాబు ఇస్తున్న ప్రోత్సాహం కారణంగానే తాను రాజకీయాలలో రాణిస్తున్నట్టు తెలిపారు. సీఎం నాయకత్వంలో పని చేయడం సంతోషంగా వుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనకు సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. బుచ్చిరెడ్డి పాళెం పట్టణానికి మౌలిక వసతులు కల్పించి పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ డి బాలకృష్ణ, ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ ఛైర్మన్లు యారటపల్లి శివకుమార్ రెడ్డి, నస్రీన్ ఖాన్, స్థానిక కౌన్సిలర్ రాచూరి సత్యం, టిడిపి అర్బన్ మండల పార్టీ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసరావు, టిడిపి బుచ్చి మండల గౌరవాధ్యక్షులు టంగుటూరి మల్లారెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు ఎంవి శేషయ్య, కోడూరు కమలాకర్ రెడ్డి జనసేన నాయకులు చప్పిడి శ్రీనివాసులు, మహేంద్రలతో పాటు బుచ్చి పట్టణ కౌన్సిలర్లు, టిడిపి యూనిట్ మరియు క్లస్టర్ ఇంచార్జీలు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో అభివృద్ధికి శ్రీకారం

- బృందమ్మ కాలనీ అభివృద్ధికి రూ.62 లక్షలతో భూమిపూజ
- కూటమి ప్రభుత్వంతో అభివృద్ధి ఊపందుకుంటోంది
- ప్రజల సమస్యలకు త్వరగతిన పరిష్కారానికి హామీ
- శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



(శ్రీకాళహస్తి(చైతన్యరథం): పట్టణంలోని బృందమ్మ కాలనీ, ప్రాజెక్టు వీధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి భూమి పూజ చేశారు, బృందమ కాలనీ నందు 16 లక్షలతో డ్రైనేజ్‌కు, ప్రాజెక్టు వీధి నందు 46 లక్షలతో డ్రైన్‌కు భూమి పూజ చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి ప్రారంభమైందని అన్నారు, స్థానిక ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు, త్వరలో అన్ని సమస్యలకు పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు, ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పట్టణ అధ్యక్షులు విజయకుమార్ నాయుడు , కంఠ రమేష్, బాలాజీ రెడ్డి, వినయ్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలు

- టవర్ క్లాక్ సెంటర్‌లో డొక్కా సీతమ్మ అన్నదాన శిబిరం
- పల్లె పండుగలకు రూ.15 కోట్లు విడుదల చేసిన డిప్యూటీ సీఎం
- ఎమ్మెల్యే సునీల్ కుమార్ ప్రశంసలు
- ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ
- జనసేన నాయకులు గ్రామగ్రామాన సేవా కార్యక్రమాలు

గూడూరు, (చైతన్యరథం): ప్రజాసంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం నిస్వార్థంగా పనిచేసే ప్రజా నాయకుడు పవన్ కళ్యాణ్ అని గూడూరు శాసనసభ్యులు పాసీం సునీల్ కుమార్ అన్నారు. జనసేనపార్టీ నాయకులు తీగల చంద్రశేఖర్ రావ్ ఆధ్వర్యంలో మంగళవారం జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో భాగంగా గూడూరు టవర్ క్లాక్ సెంటర్లో భారీ అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటు కోసం నిస్వార్థంగా పవన్ కళ్యాణ్ పని చేశారనీ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా గూడూరు నియోజకవర్గంలో పల్లె పండుగ కార్యక్రమంకు సుమారు 15 కోట్ల రూపాయలు విడుదల చేశారన్నారు. నిధులతో ప్రతి పంచాయతీలో సిసి రోడ్లు, డ్రైనేజ్ నిర్మించడం జరుగుతుందని తెలిపారు. రానున్న 15 ఏళ్ల పాటు కూటమి ప్రభుత్వం కలిసి ఉండాలని, పవన్ కళ్యాణ్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జనసేన లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి నెల్లూరుజిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ రావ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గ్రామాలు పూర్తిగా అభివృద్ధిలో వెనుక పడి ప్రజలు అష్టకష్టాలు పడ్డారనీ, ప్రస్తుతం పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా పవన్ కళ్యాణ్ బాధ్యతలు తీసుకున్న అనంతరం గ్రామాలు




పూర్తి స్థాయిలో అభివృధి బాటలో పయనిస్తున్నాయన్నారు. జనసేన నాయకులు ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు సామాజిక సేవలోనూ ముందుంటారనని అందులో భాగంగానే డొక్కా సీతమ్మ పేరిట 500 మందికి అన్నదానం నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

**ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్,పండ్లు పంపిణీ**

జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ జన్మదినం‌ను జనసేన పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి నెల్లూరుజిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ రావ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జనసేన కేంద్ర కార్యాలయం పిలుపు మేరకు మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

## సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పాశం

- 44 మందికి రూ.29.17 లక్షల ఆర్థిక సాయం
- వైసీపీ హయాంలో అభివృద్ధి శూన్యం
- మళ్లీ కార్యకర్శక ప్రభుత్వమే ప్రజలకు అవసరం
- గతంలో రూ.8 కోట్ల నిధులు తీసుకొచ్చానని గుర్తు చేసిన ఎమ్మెల్యే సునీల్



గూడూరు(చైతన్యరథం): గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని 44 మందికి 29 లక్షల 17 వేల 92 రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ లబ్దిదారులకు అందజేశారు ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ గతంలో నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు 8 కోట్ల రూపాయలు సీఎం సహాయ నిధి ద్వారా తీసుకువచ్చానని ఆ తర్వాత వచ్చిన ఎన్నికల్లో టిడిపి పార్టీని ప్రజలు ఓడించాలని గుర్తు చేశారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ పార్టీ ఎటువంటి అభివృద్ధి పనులు చేయలేదని ఎస్సీ ఎస్టీ బీసీలకు ఎటువంటి రుణాలు ఇవ్వలేదని అన్నారు పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు గుర్తుంచుకొని ఆదరించాలని సూచించారు ఈ కార్యక్రమంలో నాయకులు కిరణ్ కుమార్, భాస్కర్ రెడ్డి ,పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లరాజు, బిల్లు చెంచురామయ్య, రహీం, ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రొద్దుటూరులో ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

ప్రొద్దుటూరు, (చైతన్యరథం): ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్ జన్మదిన శుభసందర్భంగా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ కౌన్సిలర్ జయ శంకర్,మాజీ తెలుగుదేశం పట్టణ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నంద్యాల వరద రాజుల రెడ్డి, తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం నేతలు విశ్వనాథ్, రిటైర్డ్ ఎస్సై శంకర్, మంచి శివ, తోట చంద్ర శేఖర్, తోట విజయ్, యజ్ఞ వాక్కుడు, ఆకుల చంద్ర శేఖర్ (బ్రదర్స్), శివ శంకర్ , ఈశ్వరయ్య, రామ కృష్ణ, జంగమయ్య, కరెడ్ల శివ ప్రసాద్, కరెడ్ల వీర రాఘవ, పత్తి శివ కళ్యాణ్, సుంకర మురళి, మంచి శివకుమార్, రామారావు, రామంజి ప్రసాద్ పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే షాజహాన్ బాషా మండలంలో సుడిగాలి పర్యటన

రామసముద్రం, (చైతన్యరథం): మండలంలో ఎమ్మెల్యే షాజహాన్ బాషా సుడిగాలి పర్యటన చేశారు. మండలంలోని గుండ్లపల్లె గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు గుండ్ల పల్లె రామకృష్ణా రెడ్డిని వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఊలపాడు గ్రామంలో టిడిపి నాయకులు బాణాసంచాలు కాలుస్తూ డప్పులు వాయిద్యాలతో స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టి పూలహారాలు వేసి స్వాగతించారు.ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. నూతనంగా మంజూరైనా ఆర్య వైశ్య కమ్యూనిటీ భవనం పనులను పరిశీలించారు. మండలంలోని పలు పంచాయతీలు



అరికల, మూగవాడి, కాప్పల్లె, రామసముద్రం, ఆర్, నడింపల్లె, కమ్మవారి పల్లె సిఎం సహాయనిధి ద్వారా 9 మందికి 8.50 లక్షల రూపాయలు చెక్కులను లబ్దిదారులకు ఎమ్మెల్యే షాజహాన్ బాషా అందజేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నా టిడిపి పార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్ గౌడ్, తిప్పన్న, పెద్ది రెడ్డి,ముని వెంకటస్వామి శివారెడ్డి, రూపేష్ రెడ్డి, మహేష్ రెడ్డి, రాజేష్ స్వామి, బద్రీనాథ్,మాజీ జడ్పీటీసీ శివశంకర్, నరసింహులు శెట్టి, హొటల్ నారాయణ స్వామి నాగభూషణం, జైకుమార్, మాలమహానాడు అధ్యక్షులు కిట్ట.. ఊలపాడు శ్రీనివాసులు పతి,అల్తాఫ్ బాషా,నాగరాజ,తదితరులు పాల్గొన్నారు.

# పౌరుషానికి ప్రతీక నందమూరి హరికృష్ణ: ఎమ్మెల్యే దగ్గుపాటి

- **ఘనంగా డిప్యూటీ సీఎం పుట్టినరోజు, హరికృష్ణ జయంతి వేడుకలు**
- **నిజాయితీ, సేవతో నిలిచిన నేతలకిదే నిజమైన గౌరవం**
- **పాల్గొన్న ఎమ్మెల్యే సురేంద్రబాబు, వెంకటశివుడు యాదవ్, మంతెన సత్యనారాయణ, నాని, బీవీ**

అనంతపురం(చైతన్యరథం): రాజకీయాల్లో, నిజ జీవితంలో పౌరుషంగా, విలువలతో బ్రతికిన నాయకుడు నందమూరి హరికృష్ణ అని.. సినిమాలు, రాజకీయాల్లో సంచలనానికి కేంద్ర బిందువు పవన్ కళ్యాణ్ అని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అనంతపురం నగరంలోని ఆర్. అండ్.బి అతిథి గృహంలో మాజీ మంత్రి, సినీ నటుడు నందమూరి హరికృష్ణ జయంతి, ఉప ముఖ్యమంత్రి, పవర్ స్టార్ పవన్ కల్యాణ్‌ల పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో జిల్లా టిడిపి అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ముఖ్యమంత్రి ప్రోగ్రాం కోఆర్డినేటర్ మంతెన



సత్యనారాయణ రాజు, ఉమ్మడి అనంతపురం జిల్లా టిడిపి అబ్జర్వర్ కోవెలమూడి నాని, టిడిపి రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ బీవీ వెంకటరాముడు పాల్గొన్నారు. ముందుగా హరికృష్ణ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నిర్వహించారు. జోహార్ హరికృష్ణ అంటూ నినాదాలు చేశారు. అనంతరం పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ఎన్టీఆర్ కుమారుడిగా మాత్రమే కాకుండా చైతన్య రథం సారథిగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా, సినీ నటుడిగా, నిర్మాతగా విభిన్న రంగాల్లో రాణించారన్నారు. హరికృష్ణ పేరు చెబితే పౌరుషం, కోపం గుర్తుకొస్తాయన్నారు. ఆయన బ్రతికినన్ని రోజులు విలువలతోనూ, ఎన్ని కష్టాలు వచ్చినా వెనక్కు తగ్గని నైజంతో ఉన్నారన్నారు. మరోవైపు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిరంజీవి తమ్ముడిగా సినిమాల్లోకి వచ్చినా.. నెంబర్ వన్ స్థానానికి ఎదిగారన్నారు. రాజకీయాల్లో కూడా రాష్ట్ర భవిష్యత్ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి పని చేసేందుకు ముందుకొచ్చారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ భాగస్వామ్యంలో ఆయన ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ఆయన మరింత ఉన్నత శిఖరాలకు ఎదగాలని దగ్గుపాటి ప్రసాద్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలు కార్పొరేషన్ డైరెక్టర్లు పి ఎల్ ఎన్ మూర్తి, పోతుల లక్ష్మీనరసింహులు, పరమేశ్వర్, కొండన్న, తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్, తెలుగుమహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని, క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాస్, బెస్త సాధికార సమితి రాష్ట్ర నాయకుడు చేపల హరి, బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దలవాయి వెంకటనారాయణ, టిడిపి నాయకులు ఓంకార్ రెడ్డి, దాడి మల్లికార్జున, ముస్తాక్, ఈడిగ నాగభూషణం, నాగార్జున, నెట్టెం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అనంత నగరాన్ని హరిత అనంతగా మార్చడమే లక్ష్యం

**- మున్సిపల్ అధికారులు, టిడిపి నాయకులతో కలిసి మొక్కలు నాటిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**



అనంతపురం(చైతన్యరథం): అనంతపురం నగరాన్ని హరిత అనంతగా మార్చడమే లక్ష్యమని అనంతపురం శాసనసభ్యులు దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. నగరంలోని శ్రీనగర్ కాలనీ నందు మున్సిపల్ కమిషనర్ బాలస్వామి, టిడిపి నాయకులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మొక్కలు నాటారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో అనంతపురం నగరాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. గత 15 సంవత్సరాలుగా శ్రీనగర్ కాలనీలోని 80ఫీట్ రోడ్డు నిర్మాణం లేక ప్రజలు ఇబ్బందులు పడేవారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ రోడ్డు సమస్యను పరిష్కరించామన్నారు. రానున్న రోజుల్లో అనంతపురం నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి గడ్డం సుబ్రహ్మణ్యం, రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేశ్వర్, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, మాజీ కార్పొరేటర్లు రాజారావు, బల్లా పల్లవి, సరళ, టిడిపి నాయకులు గోళ్ళ సుధాకర్ నాయుడు, నెట్టెం బాలకృష్ణ, ఈడీగ నాగభూషణం, ముస్తాక్, జయరాం నాయక్ మున్సిపల్ అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్ష



అనంతపురం (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఏర్పాట్లపై అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతపురం జిల్లాలో ఈ నెల 10వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా కేంద్రంలో సూపర్ సిక్స్ – సూపర్ హిట్ భారీ బహిరంగ సభలో పాల్గొననున్నారు. సభా ప్రాంగణం, పార్కింగ్ ఏర్పాట్లను ముఖ్యమంత్రి ప్రోగ్రాం కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు, ఉమ్మడి అనంతపురం జిల్లా అబ్జర్వర్ కోవెలమూడి నాని, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ బీవీ వెంకటరాముడు మరియు అధికారులతో కలిసి ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నందు సమీక్ష నిర్వహించారు.

## 44 సంవత్సరాల రాజకీయ సేవలో కార్యకర్తలే నా బలం

**- ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య**
**- కష్టాల్లో ఉన్న కార్యకర్తలకు చేదోడు వాదోడుగా ఉండాలి**
**- కార్యకర్తల ఆరోగ్యానికి ప్రత్యేక ప్రణాళిక...**
**- హాస్పిటల్స్‌లో 20% రాయితీ, సభ్యత్వ కార్డు ద్వారా సౌకర్యాలు**



రాజమండ్రి (చైతన్యరథం): 44 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో కార్యకర్తలే నా బలం అని, కష్టాల్లో ఉన్న కార్యకర్తలకు చేదోడు వాదోడుగా ఉండడమే తన జీవిత ధ్యేయమని, రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. రాష్ట్ర హెల్త్ వింగ్ ప్రధాన కార్యదర్శి యువ నాయకులు డాక్టర్ గోరంట్ల రవి రామ్ కిరణ్ ఆధ్వర్యంలో కార్యకర్తల ఆరోగ్యానికి ప్రత్యేక ప్రణాళికతో రూపొందించిన, తెలుగుదేశం పార్టీ క్యాడర్ వెల్ఫేర్ అనే కార్యక్రమాన్ని, ఈరోజు ఉదయం గోరంట్ల వారి కార్యాలయం నందు ప్రారంభించారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ భారతదేశంలో ఏ రాజకీయ పార్టీకి లేనివిధంగా కోటి 10 లక్షల క్రియాశీలక సభ్యత్వాలు కలిగిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని, పార్టీ కోసం ప్రాణాలు వదులుకొని, ప్రాణాన్ని పణంగా పెట్టి పార్టీ కోసం పని చేసే కార్యకర్తలకు మనం ఏం చేస్తున్నామన్నదే ముఖ్యమని, వారందరినీ ఆదుకోవలసిన అవసరం ఉందని గోరంట్ల అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కూడా కార్యకర్తలందరినీ ఆదుకునేందుకు, ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నారని, వాటిలో కూడా కొన్ని సూచనలు అధిష్టానానికి తెలియజేశానని అన్నారు. డాక్టర్ సెల్ తరపున గోరంట్ల రవి రామ్ విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ వారితో చర్చించి, ఒక నూతన కార్యక్రమానికి ఈరోజు నాంది పలికారని, డాక్టర్ సెల్ సహకారంతో నిర్దేశించిన కొన్ని హాస్పిటల్స్‌లో కార్యకర్తలకి అనారోగ్య కారణాలతో హాస్పటల్‌కి వెళ్ళినప్పుడు, ఫీజులో 20 శాతం రాయితీ ఇచ్చేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని, సభ్యత్వం కార్డు కలిగిన వారు గోరంట్ల కార్యాలయానికి వచ్చి, వివరాలు నమోదు చేసుకుని ఇక్కడ అందజేసే ఒక రసీదును వెంట తీసుకుని వెళ్లాలని తెలిపారు. క్యాడర్ వెల్ఫేర్ అనే కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో త్వరలో అమలు చేయబోతున్నారని, ముందుగా మన రూరల్ నియోజకవర్గంలో ఈరోజు ప్రారంభిస్తున్నామని, ఆర్థిక స్తోమత లేని కొంతమంది కార్యకర్తల హాస్పిటల్ ఖర్చులు భరించేందుకు ఈ క్యాడర్ వెల్ఫేర్‌కు ప్రతినెల 50 వేల రూపాయలు తనవంతుగా అందిస్తానని, మొదటగా ఈనెల 50 వేల రూపాయలను చెక్కు రూపంలో డాక్టర్ సెల్ వారికి అందించారు. రాజమండ్రిలో ప్రారంభించిన ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ ఎంతో సమర్థవంతంగా ముందుకు సాగుతుందని, బ్లడ్ బ్యాంక్ విషయంలో రవిరాం నిస్వార్థంగా పనిచేస్తున్నారని కొనియాడారు. డాక్టర్ గోరంట్ల రవి కిరణ్ మాట్లాడుతూ కార్యకర్తలకు బిల్లులో 20% రాయితీ ఇచ్చేందుకు ఇప్పటివరకు కొన్ని కార్పొరేట్ హాస్పిటల్స్ కూడా ముందుకు వచ్చాయని, రాబోయే రోజుల్లో మరికొన్ని హాస్పిటల్స్ కూడా వచ్చే అవకాశం ఉందని, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇంకా ఏమైనా వివరాలు తెలుసుకోవాలంటే ఈ టోల్ ఫ్రీ నెంబరులో గోరంట్ల టీం సభ్యులు మీ అందరికీ అందుబాటులో ఉంటారని తెలిపారు. సమావేశం అనంతరం హుకుంపేట గ్రామానికి చెందిన, యార్లగడ్డ స్వరూపారాణి సర్జరీ నిమిత్తం హాస్పిటల్ కి వెళ్ళేందుకు మొదటి రసీదును అందించారు. ఈ కార్యక్రమంలో ఎం.పీ.పీ వెలుగుబంటి సత్య ప్రసాద్, ఏ.ఎం.సి చైర్మన్ మార్ని వాసుదేవ్, రూరల్ మండల తెదేపా అధ్యక్షులు మత్సేటి ప్రసాద్, కడియం మండల తెదేపా అధ్యక్షులు వెలుగుబంటి రఘురాం, నున్న కృష్ణ, పందూరి అప్పారావు మరియు అన్ని గ్రామాల, వార్డుల, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## మత్స్యకారులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం కృషి

– ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

పోలాకి(చైతన్యరథం): సముద్రంలో వేటకు వెళుతున్న మత్స్యకారులకు ఆదుకునే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. ఈ రోజు పోలాకి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద 21 మంది మత్స్యకారులకు 50 శాతము రాయితీతో సామగ్రిని అందజే శామని పేర్కొన్నారు. సుమారు 32 లక్షల 19 వేల 300 రూపాయలు విలువ కలిగిన బోటు ఇంజిన్లు, వలలు, బోటు వంటి పరికరాలను అందించమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్, మండల పార్టీ అధ్యక్షులు ,పిఎసిఎస్ చైర్మన్, డైరెక్టర్లు, సర్పంచ్లు ,ఎంపీటీసీ సభ్యులు, మత్స్యకారులు, అధికా రులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఎప్పుడో మరణించిన అమ్మపై దుర్భాషలా?

బీహార్‌లో ఇటీవల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో జరిగిన 'ఓటర్ అధికార్ యాత్ర'లో కొంతమంది ప్రధాని నరేంద్ర మోదీ తల్లిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ క్రమంలోనే ప్రధాని మోదీ స్పందిస్తూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై మాట్లాడుతూ ప్రధాని మోదీ భావోద్వేగానికి లోనయ్యారు. చనిపోయిన తన తల్లిని కాంగ్రెస్-ఆర్జేడీ ఈ విధంగా దూషిస్తారని ఊహించలేదని అన్నారు. ఈ అవమానం తన తల్లికి మాత్రమే కాదు. బీహార్ తల్లులు, కుమార్తెలకు కూడా అవమానమని వ్యాఖ్యానించారు. మంగళవారం బీహార్ రాజ్య జీవిక నిధి సాఖ్ సహకారి సంఘ్ లిమిటెడ్‌ను

### ◆ మోదీ భావోద్వేగం

వర్చువల్‌గా ప్రారంభించిన సందర్భంగా చేసిన ప్రసంగంలో ఆయన ఈ కామెంట్స్ చేశారు. బీహార్ రాజ్య జీవిక నిధి శాఖ సహాయ సంఘ్ లిమిటెడ్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన అనంతరం ప్రధాని మోదీ సుమారు 20 లక్షల మంది మహిళలతో మాట్లాడారు. ఈ సందర్భంగా కొన్నాళ్ల క్రితం బీహార్‌లో ఆర్జేడీ-కాంగ్రెస్ రాజకీయ కార్యక్రమంలో కొందరు నేతలు తన తల్లి హీరాబెన్‌ను అవమానకరంగా దూషించారని ప్రస్తావించారు. రాజకీయ వేదికలపై చనిపోయిన తన తల్లిని లాగడాన్ని మోదీ తీవ్రంగా తప్పుబట్టారు.



అమ్మే మన ప్రపంచం..ఆత్మగౌరవం

'అమ్మే మన ప్రపంచం. అమ్మే మన ఆత్మగౌరవం. బీహార్‌లో ఆర్జేడీ-కాంగ్రెస్ నా తల్లిని అవమానించారు. అమ్మ అనారోగ్యంతో ఉన్నా.. అత్యంత పేదరికంలోనే మమ్మల్ని అందరినీ కష్టపడి పెంచింది. ఎప్పుడూ తనకోసం కొత్త చీర కొనుక్కోలేదు. మా కుటుంబం కోసం ప్రతి పైసాను పొదుపు చేసేది. నా తల్లి లాగే నా దేశంలోని కోట్లాది మంది తల్లులు ప్రతిరోజూ 'తపస్సు' చేస్తారు. ఇప్పుడు నా తల్లి జీవించి లేదని మీ అందరికీ తెలుసు. కొంతకాలం క్రితం 100 సంవత్సరాలు నిండాక ఆమె మనందరినీ విడిచిపెట్టి వెళ్లిపోయింది. రాజకీయాలతో నా తల్లిని ఆర్జేడీ, కాంగ్రెస్ నేతలు అవమానించారు. ఇది నా తల్లికి మాత్రమే అవమానం మాత్రమే కాదు. దేశంలోని తల్లులు, సోదరీమణులు, కుమార్తెలకు అవమానమే. నా హృదయంలో నాకు ఎంత బాధ ఉందో నాకు తెలుసు' అని భావోద్వేగానికి గురయ్యారు. తన తల్లిని తలచుకుని ఆవేదనకు లోనయ్యారు.

ఢిల్లీ అల్లర్ల కేసు..

## ఏడుగురికి నో బెయిల్

ఢిల్లీ: దేశ రాజధానిలో 2020లో చోటుచేసుకున్న అల్లర్ల కేసులో నిందితులుగా ఉన్న షర్జీల్ ఇమామ్, ఉమర్ ఖలీద్ సహా ఏడుగురు నిందితులకు బెయిల్ మంజూరు చేసేందుకు ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. ఈ కేసులో ఇమామ్, ఉమర్ ఖలీద్ బెయిల్ పిటిషన్లు 2022 నుంచి పెండింగ్లో ఉండగా తాజాగా ఈ కేసుపై విచారణ జరిపిన ధర్మాసనం బెయిల్ పిటిషన్లను తోసిపుచ్చింది. ఉద్దేశపూర్వకంగానే కుట్ర చేసి వారు అల్లర్లకు పాల్పడ్డారని.. దేశవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారు నిర్దోషులుగా తేలే వరకు జైల్లో ఉండడమే సరైనదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. 2020 ఫిబ్రవరిలో ఈశాన్య ఢిల్లీలో సీఏఏ వ్యతిరేక నిరసనలు హింసాత్మకంగా మారిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆ ఘటనలో దాదాపు 53 మంది దుర్మరణం చెందగా..700లకు పైగా గాయపడ్డారు. ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి అంకిత్‌శర్మను కూడా అత్యంత కిరాతకంగా హత్య చేశారు. అతడి హత్య కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ నేత తాహిర్ హుస్సేను పోలీసులు అరెస్టు చేశారు. అల్లర్లకు సంబంధించి 15 మందిని నిందితులుగా పేర్కొంటూ చట్ట వ్యతిరేక కార్యకలాపాల చట్టం (యూఏపీఏ) కింద ఛార్జిషీటు నమోదు చేశారు.

## బీజేపీ చలో ధర్మస్థల.. రాజకీయ యాత్ర

### సీఎం సిద్ధరామయ్య కామెంట్స్

బెంగళూరు: బీజేపీ చేపట్టిన చలో ధర్మస్థల.. అదొక రాజకీయ యాత్ర అని, తద్వారా ఎలాంటి లాభం లేదని ముఖ్యమంత్రి సిద్దరా మయ్య అన్నారు. కేవలం వారు రాజకీయలబ్ధికోసమే యాత్ర చేశారన్నారు. మైసూరులో మీడియాతో మాట్లాడిన ఆయన ధర్మ స్థల, చాముండి కొండలు,దసరా ఉత్సవాలవిషయంలో బీజేపీ బూటకపు నిరసన సాగిస్తోందన్నారు. హిందువులను ఆకర్షించుకోవాలని వారు ప్రయత్నిస్తున్నారన్నారు.అయితే అది తప్పు అని గుర్తిస్తారన్నారు. ధర్మస్థల పట్ల మాకు అపారమైన గౌరవం ఉందన్నారు. సిట్ ఏర్పాటు చేసినప్పుడు వ్యతిరేకించని బీజేపీ,ఇప్పుడు లబ్ధిపొందాలని ప్రయత్నిస్తోందన్నారు. తానూ ఓ హిందువేనని, మా పల్లెలో రామ మందిరంనిర్మించలేదా అన్నారు.బానుముస్తాక్ ఓ కన్నడ రచయిత్రి అని, అంతర్జాతీయస్థాయిలో గౌరవం పొందారని,ఆమెతో దసరా ఉత్సవాలు ప్రారంభించడంలో తప్పేముందన్నారు. చాముండి కొండలు హిందు వుల ఆస్తి అనుకున్నా దసరా పండుగ నాడహబ్బ (రాష్ట్ర పండుగ) అని అందరూ కలసి జరుపు కునే వేడుక అన్నారు.

## తమిళనాడులో ఎన్డీయే విజయం తథ్యం

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్

చెన్నై: వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో 234 నియోజకవర్గాల్లోనూ ఎన్డీయే విజయం ఖాయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ జోస్యం తెలిపారు. బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరిపిన సర్వేలో డీఎంకే కూటమి అన్ని చోట్లా చిత్తుగా ఓడిపోతుందని పేర్కొన్నారు. తెన్‌కాశి జిల్లా శంకరన్ కోవిల్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్డీయేకి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళని స్వామి అధ్యక్షుడిగా ఉన్నారని పేర్కొన్నారు.

## భారీ వర్షాలతో ఢిల్లీలో అతలాకుతలం

ఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీని మరోసారి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేని వర్షాల కారణంగా యమునా నది నీటిమట్టం ప్రమాదకర స్థాయిని దాటడంతో నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇళ్లలోకి వరద నీరు చేరడంతో జనజీవనం స్తంభించింది. ప్రధాన రహదారులపై 7-8 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడ్డాయి. ప్రయాణికులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. సోమవారం నుంచి కురుస్తున్న వర్షాలతో యమునా ఇతర నదుల్లో నీటిమట్టాలు పెరిగాయి. హరియాణాలోని యమునానగర్ జిల్లాలో హత్నికుండ్ బ్యారేజీ నుంచి 29,313 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో యమునాలో వరద ప్రవాహం భారీగా పెరిగింది. ఈ మేరకు లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సోమవారం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి ఢిల్లీ-ఎన్సిఆర్‌లో రోడ్లు జలమయమయ్యాయి. జనజీవనం స్తంభించింది. యమునా నది నీటి మట్టం పెరగడంతో అధికా



రులు రాజధానిలో వరద హెచ్చరికలు జారీ చేశారు. గురుగ్రామ్‌లో.. నాలుగు గంటల్లో 100 మి.మీ కంటే ఎక్కువ వర్షం నమోదైనట్ల అధికారులు తెలిపారు. దీంతో నగరం మొత్తం జలమయం కావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. కీలక ప్రాంతాల్లో ట్రాఫిక్ నిలిచిపోయింది. వాహనదారులు గంటల తరబడి భారీ రద్దీలో చిక్కుకున్నారు. అయితే ఈరోజు వర్షం కారణంగా కార్పొరేట్ కార్యాలయాలు, ప్రైవేట్ సంస్థల ఉద్యోగులను ఇంటి నుంచి పనిచేయాలని అధికారులు సూచించారు. ఎన్సీఆర్‌కి టెక్ హబ్ అయిన గురుగ్రామ్‌లో, హీరో హోండా చౌక్, పటేల్ నగర్, సిగ్నేచర్ బ్రిడ్జి సమీపంలో ఉన్న అనేక కీలక ప్రాంతాలు భారీగా వరదనీటిలో మునిగిపోయాయి. అలాగే ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే సర్వీస్ లేన్‌లో భారీ మొత్తంలో వర్షపు నీరు పేరుకుపోవడంతో దాన్ని మూసివేశారు. కుండపోత వర్షం కారణంగా ఎక్స్‌ప్రెస్‌వే డ్రైనేజీ వ్యవస్థ కూడా కూలిపోయింది. ఈ రహదారి ఢిల్లీలోని ద్వారకను ఖేర్కి దౌలా, గురుగ్రామ్‌లోని వివిధ మార్గాలను కలుపుతుంది.

**చిక్కుకున్న వాహనాలు**

ఢిల్లీ-జైపూర్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్‌లు, గురుగ్రామ్‌లోని సిగ్నేచర్ టవర్ చౌక్ వద్ద రెండు నుంచి మూడు అడుగుల నీటి నిల్వతో వాహనాలు చిక్కుకున్నాయి. ఢిల్లీ విపత్తు నిర్వహణ సంస్థ ఇవాళ సాయంత్రం 5 గంటల నుంచి పాత రైల్వే వంతెనపై రాకపోకలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ముందు జాగ్రత్తగా లోతట్టు ప్రాంతాల్లోని పాఠశాలలకు సెలవు ప్రకటించారు. మరికొన్ని పాఠశాలలు ఆన్‌లైన్ తరగతులకు నిర్వహిస్తున్నాయి. ఎయిర్‌పోర్ట్ రన్‌వేలపై నీరు నిలిచిపోవడంతో విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది.

పోలీసులపై కాల్పులు..

## రేప్ కేసులో అరెస్టయిన ఆప్ ఎమ్మెల్యే పరార్

పంజాబ్‌లోని ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే హర్మీత్ సింగ్ పఠాన్ మజ్రా అత్యాచార ఆరోపణలపై అరెస్టయ్యారు. అయితే ఆయన అనూహ్యంగా పోలీసు కస్టడీ నుంచి పరారయ్యాడు. హరియాణాలోని కర్నాల్‌లో పోలీసులపై కాల్పులు జరిపి పారిపోయాడు. పటియాలలోని సనౌర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న హర్మీత్ తన సహచరులతో కలిసి పోలీసులపై కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో ఒక పోలీస్ అధికారిని గాయపరిచి వాహనంతో ఢీకొని తప్పించుకున్నట్లు సమాచారం. ఎమ్మెల్యే హర్మీత్‌సింగ్ పఠాన్ మజ్రాను పట్టుకునేందుకు పంజాబ్ పోలీసులు గాలింపు చేపట్టారు. కాగా ఎమ్మెల్యేపై అత్యాచార కేసు జిరక్‌పూర్‌కు చెందిన ఒక మహిళ ఫిర్యాదు మేరకు నమోదైంది. హర్మీత్ విడాకులు తీసుకున్నట్లు తనకు తప్పుడు సమాచారం ఇచ్చి 2021లో పెళ్లి చేసుకున్నాడని సదరు మహిళ తన ఫిర్యాదులో పేర్కొంది. అంతేకాదు, తన మీద లైంగిక వేధింపులు, బెదిరింపులకు పాల్పడి అసభ్యకరమైన సందేశాలను పంపినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది.



అయితే ఈ ఆరోపణలను హర్మీత్ ఖండించారు. ఇవి రాజకీయ కుట్రలో భాగమని, ఆప్ ఢిల్లీ నాయకత్వం తనను లక్ష్యంగా చేసుకుందని ఫేస్‌బుక్ లైవ్‌లో ఆరోపించాడు. ఇదిలా ఉంటే ఈ ఘటనలకు ముందు హర్మీత్ పంజాబ్‌లో వరదల నిర్వహణపై తన పార్టీ ప్రభుత్వాన్ని, ఢిల్లీ నాయకత్వాన్ని విమర్శించాడు. ఈ క్రమంలో ఆప్ నేతృత్వంలోని పంజాబ్ సర్కార్ హర్మీత్ భద్రతా సిబ్బందిని ఉపసంహరించి సనౌర్ నియోజకవర్గంలోని పోలీసుస్టేషన్‌కు అధికారులను బదిలీ చేసింది. దీంతో ఈ కేసు రాజకీయ వివాదంగా మారింది, హర్మీత్ తన అరెస్ట్‌ను రాజకీయ కక్షసాధింపుగా చెబుతుండగా.. పోలీసులు అతడిని పట్టుకునేందుకు హరియాణా పోలీసులతో కలిసి గాలిస్తున్నారు.

## భారత పర్యటనకు జర్మన్ విదేశాంగ మంత్రి

బెంగళూరు: జర్మన్ విదేశాంగ మంత్రి జోహన్ డేవిడ్ వాడేఫుల్ రెండురోజుల అధికారిక పర్యటన నిమిత్తం మంగళవారం ఉదయం బెంగళూరు చేరుకున్నారు. బుధవారం కూడా వాడేఫుల్ పర్యటన భారత్‌లో కొనసాగుతుంది. ఆయన భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)ను సందర్శించి ఆ తర్వాత ఢిల్లీకి బయలుదేరుతారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పియూష్ గోయల్‌ను వాడేఫుల్ కలుస్తారు. ఆ తర్వాత న్యూఢిల్లీలో విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో సమావేశమవుతారు. అదేరోజు ఆయన జర్మనీకి తిరుగు ప్రయాణమవుతారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో, ప్రపంచ వేదికపై భారతదేశం కీలక భాగస్వామిగా పోషిస్తున్న పాత్రను తన పర్యటనకు ముందు వాడేఫుల్ తన ఎక్స్‌పోస్టులో వెల్లడించారు. జర్మనీ - భారత్ మధ్య సన్నిహిత రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలను ఆయన తన సందేశంలో నొక్కిచెప్పారు. ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం ఎంతో శక్తివంతమైందని కూడా వాడేఫుల్ అన్నారు. భద్రతా సహకారం, ఆవిష్కరణ, సాంకేతికత, నైపుణ్యం కలిగిన మానవ వనరులు వంటి వాటిపై ద్వైపాక్షిక సంబంధాలు అత్యంత కీలకమని ఆయన వెల్లడించారు.

అక్రమ బంగారం రవాణా కేసు..

## నటి రన్యారావుకు రూ.102 కోట్ల జరిమానా

అక్రమబంగారం స్మగ్లింగ్‌చేస్తూ పోలీసులకు పట్టుబడిన రన్యారావుకు ది డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్‌ఐ) షాకిచ్చింది. దర్యాప్తులో రన్యారావు 127.3కిలోల బంగారాన్ని అక్రమంగా రవాణా చేసినట్లు నిర్ధారణ అయింది. దీంతో రూ.102.55కోట్ల జరిమానా చెల్లించాలని షోకాజ్ నోటీసులు జారీచేసింది. న్యాయ విచారణ అనంతరం డీఆర్‌ఐ అధికారులు ఆమెకు నోటీసులు అందజేశారు.రన్యా సహా మొత్తం నలుగురునిందితులకు కలిపి రూ.270కోట్లు జరిమానా విధించినట్టు అధికారులు వెల్లడించారు.

**జైలులోనే నోటీసులు అందజేత**

న్యాయ విచారణ తర్వాత రన్యారావుకు జైలులోనే నోటీసులు అందజేశారు. 102.55 కోట్ల పెనాల్టీ చెల్లించని పక్షంలో ఆస్తులను జప్తు చేస్తామని నోటీసు ద్వారా హెచ్చరించారు. అలాగే రన్యాతో సహా మరో నలుగురు నిందితులకు జైల్లోనే నోటీసులు ఇచ్చారు. సోమవారం విదేశీ మారక ద్రవ్య పరిరక్షణ, స్మగ్లింగ్ కార్యకలాపాల నివారణ బోర్డు వేసిన పిటిషన్‌ను కర్ణాటక హైకోర్టు మంగళవారం విచారించింది. రన్యా రూ.102.55 కోట్లు, తరుణ్ కొండూర్ రాజు రూ.62 కోట్లు, భరత్ జైన్, సాహిల్ జైన్‌లు ఒక్కొక్కరు రూ.53 కోట్లు జరిమానా చెల్లించాలని ఆదేశించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 11కు వాయిదా వేసింది. ఈ ఏడాది మార్చి మొదటివారంలో రన్యారావు దుబాయ్ నుంచి భారత్‌కు అక్రమంగా బంగారం తరలిస్తూ బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో పోలీసులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడింది. డీఆర్‌ఐ అధికారులు ఆమె దగ్గర నుంచి 14.3కిలోల బంగారంను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు అనంతరం నిందితులకు ఒక సంవత్సరం జైలుశిక్ష కూడా పడింది.

చైతన్యరథం

# ఆ భేటీ.. మర్మమేమిటో!

### జిన్‌పింగ్ రైట్‌హ్యాండ్‌తో సమావేశమైన మోదీ - ఇరు దేశాల సంబంధాలు సాధారణ స్థితికి చేరొచ్చు: కైక్వీ



చైనా కమ్యూనిస్టు పార్టీలో కైక్వీ చాలా కఠినమైన వ్యక్తి. అసలు నవ్వడు అనే పేరుంది. అతడు అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు కుడిభుజం అని పార్టీ వర్గాలు చెబుతుంటాయి. పార్టీలో పలు కీలక పదవులను ఆయన నిర్వహిస్తున్నారు. బీజింగ్‌లోని విదేశీ దౌత్యవేత్తలు ఆయనతో భేటీ కావడానికి ఆసక్తి చూపినా.. చాలావరకు ఆయన వాటికి దూరంగా ఉంటారు. కానీ, ఇటీవల ప్రధాని మోదీ చైనా పర్యటన సందర్భంగా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు స్వయంగా కైక్వీని రంగంలోకి దింపారు. భారత ప్రధానితో ఇరుదేశాల సంబంధాలపై చర్చించాలని సూచించారు. ప్రధాని మోదీ–కైక్వీ మధ్య దాదాపు 45 నిమిషాలపాటు సమావేశం జరగడం తింజాయన్ దౌత్యవర్గాల్లో ప్రకంపనలు సృష్టించాయి. ఈసందర్భంగా ప్రధాని తన ఆలోచనలను ఆయనతో పంచుకొన్నారు. ఎస్‌సీవోలో పాల్గొన్న ఏ దేశ నాయకుడినీ ఆయన బహిరంగంగా కలవలేదు. కానీ, మోదీ –జిన్‌పింగ్ ద్వైపాక్షిక భేటీకి మాత్రం హాజరయ్యారు. ఇరుదేశాల సంబంధాలు వేగంగా సాధారణ స్థితికి చేరడానికి ఈ భేటీ దోహదపడుతుందని నమ్ముతున్నారు. చైనాలోని భారత వ్యతిరేక వర్గాలకు ఈ భేటీ బలమైన సంకేతాలు పంపినట్లు భావిస్తున్నారు.

**ఎవరీ కైక్వీ..?**

కైక్వీ ప్రస్తుతం కమ్యూనిస్టు పార్టీ సెక్రటేరియట్లో ఫస్ట్ ర్యాంకింగ్ హోదా, పొలిట్ బ్యూరో స్టాండింగ్ కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. అన్నింటికీ మించి జిన్‌పింగ్‌కు అత్యంత సన్నిహితుడు. ఆయనకు చీఫ్ ఆఫ్ స్టాఫ్, మావో యుగం తర్వాత ఈ రెండు పదవులు ఏకకాలంలో చేపట్టిన వ్యక్తి ఆయనే. చైనాలోని అధికార క్రమంలో ఐదో స్థానంలో ఉన్నారు. ఫుజియాన్ ప్రావిన్స్‌కు చెందిన కైక్వీ.. షీ జిన్‌పింగ్‌ను 1980ల్లో తొలిసారి కలిశారు. ప్రస్తుతం ర్యాంకులు ఎలాఉన్నా.. చైనా ప్రీమియర్ లి క్వియాంగ్‌తో సమానంగా ఆయన మాట చెల్లుబాటవుతుంది. పార్టీలో తెలివైన వ్యక్తిగా.. అందుబాటులో ఉండే నేతగా ఆయనకు పేరుంది. గతంలో సోషల్ మీడియాలో ఆయనకు కోటి మంది ఫాలోవర్లు ఉండేవారు. జిన్‌పింగ్ అధ్యక్ష పదవి చేపట్టాక దానిని ఆయన పక్కనపెట్టారు. దీంతోపాటు ఆయన బయట కనిపించడం కూడా అరుదుగా మారింది. ఆ తర్వాత చాలా వేగంగా పోలిట్ బ్యూరోలోకి వెళ్లారు. జిన్‌పింగ్‌ను బహిరంగానే మావోతో పోల్చిన తొలి నాయకుడు ఆయనే.

# బుల్లెట్‌ప్రూఫ్ రైలులో కిమ్!

### *చైనా సైనిక కవాతుకు ఉ.కొరియా నియంత హాజరు*

అరుదుగా దేశం దాటే ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్.. మంగళవారం చైనాలో అడుగుపెట్టారు. చైనా నిర్వహించనున్న సైనిక కవాతులో పాల్గొనేందుకు బుల్లెట్ ప్రూఫ్ రైలులో పర్యటనకు బయలుదేరారు. సోమవారం రాత్రి ఉత్తర కొరియా రాజధాని ప్యాంగ్యాంగ్ నుంచి ఆయన బయల్దేరినట్టు ఆ దేశ విదేశాంగశాఖ వెల్లడించింది. ఆయన వెంట విదేశాంగ మంత్రి చో సోన్ హుయ్, ఇతర అధికారులు ఉన్నారు. మంగళవారం సాయంత్రం ఆ రైలు బీజింగుకు చేరుకోనుంది. 2023 తర్వాత మళ్లీ ఆయన దేశం దాటడం ఇదే తొలిసారి. అప్పుడు కిమ్ రష్యా పర్యటనకు వెళ్లిన సంగతి తెలిసిందే. ఇక 2019లో ఆయన చైనాకు వచ్చారు. అమెరికా, దాని మిత్ర దేశాలు ఆంక్షలతో ఉక్కిరిబిక్కిరి అవుతోన్న ఉత్తర కొరియాకు చైనానుంచి పూర్తి మద్దతు అందుతోంది. దానివల్లే అది యూఎస్ ఒత్తిడిని తట్టుకొని, అణు బెదిరింపులు చేస్తోంది. మరోవైపు ఉక్రెయిన్‌తో యుద్ధం చేస్తోన్న రష్యాకు తన సైనికులను పంపుతోంది. ఇలా రెండు దేశాలతో సత్సంబంధాలు కొనసాగిస్తోంది. ఇప్పుడు ఈ ముగ్గురు ఒక వేదిక వద్ద కనిపించడం వారి మధ్య బలపడుతోన్న బంధానికి నిదర్శనంగా మారనుంది. అమెరికా ప్రాబల్యానికి సవాల్ విసరడమే ఈ మైత్రి లక్ష్యమని, మరోవైపు.. కిమ్ ఇద్దరు అగ్రనేతలతో కనిపించడం ఉత్తరకొరియా దౌత్యపరమైన స్థితిని పెంచుతుందని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తంచేశారు.

ఇదిలా ఉంటే, కిమ్ పర్యటన వేళ ఉత్తర కొరియాకు, చైనాకు మధ్య ఉన్న



సరిహద్దు వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారన్న వార్తలు వచ్చాయి. ఈ పర్యటనకు ముందు కిమ్ జోంగ్ ఉన్ ఒక కొత్త ఆయుధ కర్మాగారాన్ని సందర్శించారన్న వార్త ఆసక్తి రేపుతోంది. తాజా సందర్శనతో చైనా సరిహద్దు సమీపంలో ఉన్న జగాంగ్ రాష్ట్రంలో ఈ పరిశ్రమ ఉండవచ్చని భావిస్తున్నారు. కిమ్‌తోపాటు ఆయన తాత, తండ్రి ఈ లగ్జరీ బుల్లెట్ ప్రూఫ్ రైలునే విదేశీ పర్యటనలకు వాడారు. ఉ.కొరియా ఎయిర్‌లైన్స్‌కు అత్యంత దారుణమైన రేటింగ్ ఉండటంతో నేతలంతా ఈ రైలుపైనే ఆధారపడ్డారు. 2018లో సింగపూర్‌లో తొలిసారి ట్రంపును కలిసినప్పుడు చైనా అందించిన బోయింగ్ 747 విమానాన్ని కిమ్ ఉపయోగించారు.

# చివరకు భారత్ మాతోనే..

**అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ వ్యాఖ్యలు**

**పీటర్ నవారో మరోసారి నిస్సిగ్గు వ్యాఖ్యలు**

షాంఘై సహకార సదస్సు (ఎస్‌సీవో) తర్వాత భారత్‌పై ట్రంప్ కార్యవర్గం అక్కసు మరింత పెరిగిపోయింది. తాజాగా అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ మాట్లాడుతూ ఎస్సీవో సదస్సు మొత్తం నాటకీయంగా ఉందని అభివర్ణించారు. ఆయన ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కీలక వ్యాఖ్యలు చేశారు. రష్యానుంచి భారత్ చమురు కొనుగోలు చేయడాన్ని విమర్శించారు. ఆ చర్యలు ఉక్రెయిన్ యుద్ధాన్ని ఎగదోసేలా ఉన్నాయన్నారు. ఎస్‌సీవో సదస్సు సుదీర్ఘంగా జరిగినా.. నాటకీయంగా ఉందని పేర్కొన్నారు. ఏది ఏమైనా భారత్ మాత్రం అతిపెద్ద ప్రజాస్వామ్యమన్నారు. దాని విలువలు మాకు దగ్గరగా ఉంటాయిగానీ, చైనా, రష్యాలకు కాదన్నారు.

చైనా, భారత్‌లు రష్యా యుద్ధానికి బలం చేకూరుస్తుండటం వల్లే తాము, మిత్ర దేశాలు రంగంలోకి దిగామని బెసెంట్ పేర్కొన్నారు. భారత్–అమెరికా బంధం బలమైన పునాదులపై ఉందన్నారు.

ఇరుదేశాలు అభిప్రాయ భేదాలను పరిష్కరించుకొనే సత్తా ఉన్నవేనని అన్నారు. అదే సమయంలో భారత్‌పై ఆంక్షలకు వాణిజ్య



చర్చలు మందకొడిగా సాగడం కూడా ఓ కారణమని పేర్కొన్నారు. రష్యాపై చర్యలకు అన్ని ఆప్షన్లు తమ పరిశీలనలో ఉన్నట్లు బెసెంట్ పేర్కొన్నారు.

మరోవైపు భారత ప్రధాని నరేంద్ర మోదీ–రష్యా అధ్యక్షుడు పుతిన్ భేటీ ముగిసిన కొన్ని గంటల సమయంలోనే ట్రంప్ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. భారత్‌తో వాణిజ్యం పూర్తిగా ఏకపక్షంగా ఉందని పేర్కొన్నారు. అధిక సుంకాల కారణంగా భారత్‌కు అమెరికా వస్తువులను విక్రయించలేకపోతోందని ఆరోపించారు. భారత్ జీరో టారిఫ్‌లకు అంగీకరించినా.. అప్పటికే సమయం చేదాటిపోయిందన్నారు.

ట్రంప్ కార్యవర్గం మొత్తం భారత్‌పై ఆంక్షలకు రష్యా చమురు, వాణిజ్య చర్చలను కారణాలుగా చెబుతుంటే.. ప్రత్యర్థులు మాత్రం ట్రంప్ స్వార్థంతో న్యూఢిల్లీని దూరం చేసుకొన్నట్లు చెబుతున్నారు. ఆయన నోబెల్ బహుమతి పొందేందుకు భారత్ సహకరించలేదన్న అక్కసే కారణమని అంటున్నారు. తాజాగా అమెరికా మాజీ ఎన్ఎస్ఏ జాక్ సులేవాన్ మాట్లాడుతూ.. పాకిస్థాన్‌తో కుటుంబ వ్యాపార ఒప్పందాల కోసం.. భారత్‌తో స్నేహాన్ని అమెరికా అధ్యక్షుడు వదులుకొన్నారని వ్యాఖ్యానించారు.

**అది సిగ్గుచేటు..**

ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో మరోసారి భారత్‌పై తన నోటికి పనిచెప్పారు. అతిపెద్ద నియంతలతో కలిసి ప్రధాని మోదీ వేదిక పంచుకోవడం సిగ్గు చేటన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ భారత్ ఐరోపా, ఉక్రెయిన్‌తో కలిసి పనిచేయాలని.. రష్యా చమురు కొనుగోళ్లను నిలిపివేయాలన్నారు. శాంతికి మార్గం అన్నివైపుల నుంచి వెళుతుందని.. దానిలో న్యూఢిల్లీ నుంచి కూడా అని పేర్కొన్నారు.

# పాక్ తోక కత్తిరించిన భారత్

### *ఎస్సీవో సభ్యత్వానికి చెక్ పెట్టడంపై అజర్‌బైజాన్ ప్రేలాపనలు*



పాకిస్థాన్‌తో సన్నిహిత సంబంధాలు కొనసాగించడం వల్లే భారత్ ప్రపంచ వేదికలపై తమను దెబ్బకొట్టిందని అజర్‌బైజాన్ భారత్‌పై అక్కసు వెళ్లగక్కింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్‌కు సహకారం అందించినందుకే.. షాంఘై సహకార సంస్థ సదస్సులో పూర్తి సభ్యత్వం కోసం తాము చేసిన ప్రయత్నాన్ని భారత్ అడ్డుకుందని పేర్కొంది. ఈ చర్యలు బహుపాక్షిక దౌత్య ఉల్లంఘనలేనని ప్రేలాపనలు పేలింది. అంతర్జాతీయ వేదికలపై తమపై భారత్ ఎన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ.. తాము ఇస్లామాబాద్‌తో సంబంధాలు కొనసాగిస్తామని, అది తమ మిత్ర దేశమని అజర్‌బైజాన్ అధ్యక్షుడు ఇల్హామ్ ప్రగల్భాలు పలికారు. రాజకీయంగా, సాంస్కృతికంగా, వ్యూహాత్మకంగా ఇరుదేశాల మధ్య లోతైన బంధాలున్నా యన్నారు. అయితే చైనాలోని తియాన్జిన్‌లో నిర్వహించిన షాంఘై సహకార సంస్థ సదస్సులో అజర్‌బైజాన్ అధ్యక్షుడు ఇల్హామ్ అలీయేవ్ పాల్గొన్నారు. ఈక్రమంలో పాకిస్థాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్‌తో సమావేశమైన ఆయన ఇటీవల భారత్‌తో జరిగిన ఘర్షణల్లో విజయం సాధించారని పేర్కొంటూ... పాక్ ప్రధానిని అభినందించినట్టు సమాచా రం. ఆ దేశంతో ఆర్థిక, వాణిజ్య విషయాల గురించి కూడా చర్చలు జరిపినట్టు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. పహల్గాం ఉగ్రవాద దాడి తర్వాత పాకిస్థాన్, పీవోకేలోని ఉగ్రవాద మౌలిక సదుపా యాలను లక్ష్యంగా చేసుకొని భారత్ ఆపరేషన్ సిందూర్ పేరుతో దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో అజర్‌బైజాన్ పాక్‌కి బహిరంగంగా మద్దతిచ్చింది. దీంతో ఆపరేషన్ సిందూర్ సమ యంలో పాకిస్థాన్‌కు మద్దతిచ్చిన తుర్కియే, అజర్‌బైజాన్లపై మన దేశంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఆ రెండు దేశాలతో వాణిజ్య, ఇతర సంబం ధాలను రద్దు చేసుకుంటున్న భారత్‌లోని పలు సంస్థలు వెల్లడించాయి.

# ఇల్లుకాలి ఒకడేడుస్తుంటే..!

### వరదలతో సతమతమవుతున్న పాకిస్థాన్

### *వరదను కంటెయినర్లలో భద్రపర్చాలన్న రక్షణ మంత్రి*



పాకిస్థాన్‌ను వరదలు ముంచెత్తుతుంటే.. వరద నీటిని కంటెయినర్లలో భద్రపర్చుకోవాలని రక్షణ మంత్రి ఖవాజా మహమ్మద్ ఆసిఫ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పాక్‌లో వరదలు లక్షలాది ప్రజలపై ప్రభావం చూపుతున్నాయి. అయితే రక్షణ మంత్రి మాత్రం వరదలను అదృష్టంగా భావించాలని అంటూ.. లోతట్టు ప్రాంతాల ప్రజలు నీటిని వృథా పోనివ్వకుండా కంటెయినర్లలో నిల్వ చేసుకోవాలని ఉచిత సలహా పడేశారు. పాక్ పంజాబ్ సహా అనేక ప్రావిన్సుల్లో రికార్డు స్థాయిలో వర్షాలు కురుస్తున్నాయి. 2 వేలకు పైగా గ్రామాలు నీటిలో మునిగిపోగా.. లక్షలాది మందిపై ప్రభావం చూపినట్టు పాక్ సమాచారశాఖ వెల్లడించింది. ఒక్క పంజాబ్ రాష్ట్రంలోనే 7 లక్షలమంది సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లినట్టు అంచనా. పాక్ జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ప్రకారం గడిచిన రెండు నెలల్లో (జూన్ 26నుంచి ఆగస్టు 31వరకు) వరదల కారణంగా 854మంది చనిపోగా, దాదాపు 1100లకు పైగా గాయాలపాలయ్యారు. ప్రభుత్వ సహాయ కార్యక్రమాల జాప్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఈ పరిణామాలపై పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవల ఓ స్థానిక మీడియా ఛానల్ మాట్లాడుతూ.. "వరద పరిస్థితులకు వ్యతిరేకంగా నిరసనలు చేస్తున్న ప్రజలు ముందుగా ఆ నీటిని కాపాడుకోవాలి. వారి వారి ఇళ్లలోని టబ్లు, కంటెయినర్లలో నిల్వ చేసుకోవాలి. ఈ నీటిని అదృష్టంగా భావించి నిల్వ చేసుకోవాలి" అని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా మెగా ప్రాజెక్టుల కోసం 10–15 ఏళ్లు వేచిచూడొద్దని, త్వరితగతిన పూర్తయ్యే చిన్న డ్యామ్లను నిర్మించుకోవాలని సూచించారు. నీటిని వృథాగా పోనిస్తున్నామని, నిలువ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.




## బిడ్డర్లకు బీసీసీఐ లక్ష్మణరేఖ

**- టీమిండియా స్పాన్సరర్ షిప్ కోసం దరఖాస్తులు ఆహ్వానం**

టీమిండియా స్పాన్సరర్ షిప్ కోసం దరఖాస్తు చేసుకునే కంపెనీలు ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌లతో ఎలాంటి సంబంధాలూ ఉండకూడదని భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ (బీసీసీ) స్పష్టం చేసింది. ఆన్‌లైన్ గేమింగ్ నిషేధ బిల్లు -2025 పార్లమెంటులో ఇటీవలే ఆమోదం పొందింది. దీంతో ఇప్పటివరకూ టీమ్ ఇండియా స్పాన్సరర్‌గా ఉన్న డ్రీమ్ 11 తప్పుకోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో బీసీసీఐ నూతన స్పాన్సరర్‌ను వెతుక్కునే పనిలో ఉంది. ఇందులో భాగంగానే మంగళవారం టీమ్ ఇండియా స్పాన్సర్ షిప్ కోసం బిడ్డింగ్ ప్రక్రియను ప్రారంభించింది. దీని కోసం పలు మార్గదర్శకాలను జారీ చేస్తూ, ఆసక్తి ఉన్న కంపెనీల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది.

అలాగే ఆయా కంపెనీలు పలు నియమ, నిబంధనలకు లోబడి ఉండాలని షరతులు విధించింది. ముఖ్యంగా ఆన్‌లైన్ గేమింగ్ యాక్ట్ 2025ను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉల్లంఘించొద్దని పేర్కొంది. స్పాన్సర్ షిప్ కోసం దరఖాస్తు చేసుకునే కంపెనీలు ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్, గాంబ్లింగ్‌తో ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ ఎలాంటి సంబంధం కలిగి ఉండకూడదని తెలిపింది. ఆయా కంపెనీలు కేవలం భారత్‌లోనే కాదు.. ప్రపంచంలో కూడా ఇలాంటి సేవలు అందించకూడదని తేల్చింది. అలాగే ఆయా కంపెనీలకు బెట్టింగ్, బిడ్డింగ్ సంస్థల్లో పెట్టుబడులు కూడా ఉండకూడదని స్పష్టం చేసింది.

కేవలం గేమింగే కాకుండా, క్రిప్టో ట్రేడింగ్, క్రిప్టో ఎక్స్ఛేంజ్, క్రిప్టో టోకెన్స్‌కు సంబంధించిన వ్యాపార కార్యకలాపాల్లో కూడా ఆయా కంపెనీలు పాలు పంచుకోకూడదని బీసీసీఐ తేల్చి చెప్పింది. వీటితో పాటు నిషేధిత బ్రాండ్లకు సంబంధించిన కంపెనీలు కూడా బిడ్డింగ్‌లో పాల్గొనకుండా నిషేధం విధించింది. టీమ్ ఇండియా జెర్సీ స్పాన్సర్ షిప్‌నకు సంబంధించిన ఈ బిడ్డింగ్‌లో పాల్గొనాలనుకునే కంపెనీల వార్షిక టర్నోవర్ కనిష్ఠంగా రూ.300 కోట్ల రూపాయలైనా ఉండాలని బీసీసీఐ స్పష్టం చేసింది. అలాగే ఆయా కంపెనీలు తమ దరఖాస్తులను సమర్పించడానికి సెప్టెంబర్ 16 వరకు అవకాశాన్ని కల్పించింది. యూఏఈ వేదికగా ఆసియా కప్ సెప్టెంబర్ 9 నుంచే ప్రారంభం కానుంది. అంటే ఆసియా కప్ టోర్నీకి జెర్సీ స్పాన్సరర్ లేకుండానే టీమిండియా బరిలో దిగుతుందనే విషయం స్పష్టమయింది.

## ఆసియా కప్ హాకీ..
# గ్రూప్ టాపర్ భారత్

**- సూపర్-4కు చైనా, మలేసియా, కొరియా**




ఆసియా కప్ హాకీలో గ్రూప్ దశను భారత్ ఘనంగా ముగించింది.ఆసియా కప్ హాకీ టోర్నీ తొలి రెండు మ్యాచ్‌ల్లో చైనా, జపాన్‌పై గెలిచినప్పటికీ, స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయిన భారత్.. మూడో మ్యాచ్‌లో లరేగిపోయింది. ఇంతకుముందే సూపర్-4 బెర్త్‌ను ఖరారు చేసుకొన్న భారత్.. పూల్-ఎలో సోమవారం ఏకపక్షంగా సాగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో 15-0తో కజకిస్థాన్‌ను చిత్తు చేసి గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచింది. భారత జట్టులో అభిషేక్ నాలుగు గోల్స్‌తో చెలరేగాడు. అతను 5, 8, 20, 59వ నిమిషాల్లో గోల్స్ చేశాడు. సుఖ్ జీత్ సింగ్ (15, 32, 38వ నిమిషం), జుగ్‌రాజ్ సింగ్ (24, 31, 47వ) చెరో మూడు గోల్స్ సాధించారు. హర్మన్ ప్రీత్ (26వ), అమిత్ రోహిదాస్ (29వ), రాజిందర్ సింగ్ (32వ), సంజయ్ సింగ్ (54వ), దిల్ ప్రీత్ (55వ) తలో గోల్ కొట్టారు. ఈ మ్యాచ్‌లో భారత్ సగటున 4 నిమిషాలకు ఒక గోల్ సాధించింది. గ్రూప్-ఎలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన భారత్ అగ్రస్థానంతో ముందంజ వేసింది. ఈ గ్రూప్ నుంచి సూపర్-4 చేరిన మరో జట్టు చైనా. సోమవారం జపాన్‌తో చైనా మ్యాచ్ 2-2తో డ్రా అయింది. ఈ రెండు జట్లూ సమాన పాయింట్లు సాధించినప్పటికీ.. ఇరుజట్లూ చెరో 4 పాయింట్లతో సమంగా నిలిచినా.. మెరుగైన గోల్స్ తేడాతో చైనా రెండో స్థానంతో సూపర్-4కు చేరింది. పూల్-బి నుంచి మలేసియా, కొరియా సూపర్-4లో ప్రవేశించాయి. సోమవారం జరిగిన తమ ఆఖరి మ్యాచ్‌లో మలేసియా 15-0తో చైనీస్ తైపీపై, కొరియా 5-1తో బంగ్లాదేశ్‌పై గెలిచాయి. 9 పాయింట్లతో మలేసియా గ్రూప్-బి టాపర్‌గా నిలవగా.. రెండు మ్యాచ్‌లు గెలిచిన కొరియా 6 పాయింట్లతో రెండో స్థానం దక్కించుకొంది. బుధవారం నుంచి రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో జరిగే సూపర్-4 తొలి మ్యాచ్‌లో కొరియాతో భారత్ తలపడనుంది.

# టీ20లకు మిచెల్ స్టార్క్ గుడ్ బై





ఆస్ట్రేలియా దిగ్గజ బౌలర్ మిచెల్ స్టార్క్ టీ20లకు మంగళవారం వీడ్కోలు పలికాడు. వన్డేలు, టెస్ట్ క్రికెట్‌పై మరింత దృష్టి నిలిపేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అతడు ప్రకటించాడు. స్టార్క్ ఇప్పటివరకు 65 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. అలాగే 2021 టీ20 వరల్డ్ కప్ గెలిచిన ఆసీస్ జట్టులోనూ సభ్యుడు. అతడు చివరిసారిగా 2024 టీ20 వరల్డ్ కప్‌లో కనిపించాడు. టెస్ట్ క్రికెట్‌కే నా మొదటి ప్రాధాన్యం. నేను ఆస్ట్రేలియా తరపున ఆడిన ప్రతి టీ20 మ్యాచ్‌ను ఎంతో ఆస్వాదించా. ముఖ్యంగా 2021 వరల్డ్ కప్‌లో జరిగిన మ్యాచులంటే చాలా ఇష్టం. టీమ్ ఇండియాతో టెస్ట్ మ్యాచ్‌లు, ఇంగ్లాండ్‌తో యాషెస్ సిరీస్, వన్డే వరల్డ్‌కప్ 2027 కోసం సిద్ధంగా, ఫిట్‌గా ఉండాలనుకుంటున్నాను. అందుకే టీ 20లకు వీడ్కోలు పలికా. 2026లో టీ20 వరల్డ్ కప్ జరగనుంది. సెలక్టర్లకు యువ బౌలర్లను ఎంపిక చేసుకోవడానికి తగిన సమయం ఉండేలా, నేను ఇప్పుడే రిటైర్ అవుతున్నానని మిచెల్ స్టార్క్ పేర్కొన్నాడు.

ఆస్ట్రేలియా సెలక్షన్ బోర్డు చైర్మన్ జార్జ్ బెయిలీ ఈ విషయమై స్పందించాడు. స్టార్క్ టీ20ల్లో దేశం కోసం ఎంతో చేశాడు. ముఖ్యంగా 2021 వరల్డ్ కప్ విజేతగా నిలిచిన ఆస్ట్రేలియా జట్టులో సభ్యుడు. అలాగే అతడో అద్భుతమైన బౌలర్. వికెట్లు కూల్చడంలో అతడి నైపుణ్యం అమోఘం. ప్రస్తుతం స్టార్క్ టీ20 క్రికెట్‌కు వీడ్కోలు పలికిన నేపథ్యంలో.. ఇకపై వన్డే, టెస్ట్ క్రికెట్‌పై దృష్టిసారిస్తాడని జార్జ్ బెయిలీ వెల్లడించాడు.

ఇప్పటివరకు 65 టీ20 మ్యాచ్‌లు ఆడిన మిచెల్ స్టార్క్ 23.8 యావరేజ్‌తో 79 వికెట్లు కూల్చాడు. అలాగే 127 వన్డేల్లో 23.4 యావరేజ్‌తో 244 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. 100 టెస్ట్ మ్యాచ్‌ల్లో 27 యావరేజ్‌తో 402 వికెట్లు తీసుకున్నాడు. 52 ఐపీఎల్ మ్యాచుల్లో 23.1 యావరేజ్‌తో 65 వికెట్లు పడగొట్టాడు.

## పంజాబ్‌ను చూస్తే గుండె తరుక్కుపోతోంది..



పంజాబ్‌ను భారీ వరదలు ముంచెత్తున్నాయి. గత కొన్ని రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఇప్పటి వరకు 29 మంది మరణించారు. సుమారు వెయ్యి గ్రామాలు వాననీటిలో మునిగిపోయాయి. ఈ ప్రకృతి వైపరీత్యం వల్ల 2.65 లక్షలకు పైగా నివాసితులు ప్రభావితమయ్యారు. అంతేకాకుండా పంటలు కూడా భారీగా దెబ్బతిన్నాయి. ఈ వరదలు వల్ల పంజాబ్లోని గురుదాస్‌పూర్, పఠాన్‌కోట్, ఫజిల్కా, కపుర్తలా, తరన్ తరణ్, ఫిరోజ్‌పూర్, హోషియార్‌పూర్, అమృత్‌సర్ సహా 12జిల్లాలు అతలకుతలమ య్యాయి. ఆగస్టు నెలలో రాష్ట్రంలో 250 మి.మీ.లకు పైగా వర్షపాతం నమోదైంది. గత 25 సంవత్సరాలలో ఇదే అత్యధికం కావడం గమనార్హం. సట్లెజ్, బియాస్, రావి వంటి నదులు పొంగిపొర్లుతున్నాయి. ఈ తీవ్రమైన విప త్తుపై పంజాబ్‌కు చెందిన టీమిండియా టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్‌గిల్ స్పందిం చాడు. వరదలతో అతలాకుతలం నా పంజాబ్ చూస్తుంటే నా హృదయం తరుక్కుపోతుంది. పంజాబ్ ఎన్ని కష్టాలు వచ్చినా ఎల్లప్పుడూ బలంగా ఉంటుంది. మేము ఈ స్థితి నుంచి మళ్లీ పైకి వస్తాం. బాధిత కుటుంబాల కోసం నేను ప్రార్థిస్తున్నాను. ప్రజలకు నా పూర్తి మద్దతు ఉంటుందని ఎక్స్‌లో గిల్ పోస్ట్ చేశాడు. కాగా శుభ్‌మన్ గిల్ ఆసియాకప్ కప్-2025 కోసం సిద్ధమవుతున్నాడు. అతడు ప్రస్తుతం బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఉన్నాడు. సెప్టెంబర్ 9 నుంచి ఆసియాకప్ టీ20 టోర్నీ ప్రారంభం కానుంది. ఆ టోర్నీలో భారత జట్టుకు గిల్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

## రోహిత్-కోహ్లీకి సరైన వీడ్కోలు దక్కలేదు..

భారత క్రికెట్‌కు సేవలందించిన గొప్ప దిగ్గజాలు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మకు టీ20, టెస్ట్ ఫార్మాట్ విషయంలో సరైన వీడ్కోలు దక్కకపోవడం తనను బాధించిందని భారత జట్టు లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్ అన్నారు. ఈ ఇద్దరూ టీమిండియాకు ఎంతో గొప్పగా ఆడారు కనుక, అభిమానుల ముందే మైదానంలో వీరికి వీడ్కోలు పలికి ఉంటే బాగుండేదని బిష్ణోయ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇంగ్లాండ్‌తో టెండూల్కర్-అండర్సన్ ట్రోఫీకి ముందు రోహిత్, కోహ్లి.. ఒకరి తరువాత మరొరు అకస్మాత్తుగా టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించారు. అంతకు ముందే వారిద్దరూ టీ 20లకు వీడ్కోలు చెప్పిన విషయం తెలిసిందే. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్ విరాట్, రోహిత్ శర్మ ఆడిన చివరి అంతర్జాతీయ మ్యాచ్. ఈ మ్యాచ్‌లో భారత జట్టు విజయాన్ని సాధించగా, వీరిద్దరూ కీలక పాత్ర పోషించారు. ఇలాంటి దిగ్గజాలకు మైదానంలో అభిమానుల సమక్షంలోనే వీడ్కోలు చెబితే బాగుంటుందని ఓ ఇంటర్వ్యూలో తన భావోద్వేగాన్ని వ్యక్తం చేశాడు బిష్ణోయ్. వారిద్దరూ భారత క్రికెట్‌కి చేసిన సేవకు సరిగ్గా సరిపడే వీడ్కోలు ఇవ్వాల్సిందని వ్యాఖ్యానించాడు.

## ఆసియా కప్ రికార్డుపై రషీద్ దృష్టి




అంతర్జాతీయంగా వివిధ టోర్నీల్లో విశేషంగా రాణిస్తున్న అఫ్ఘానిస్తాన్ స్టార్ బౌలర్ రషీద్‌ఖాన్ ఒక్క టోర్నీలో మాత్రం తన ప్రతిభకు తగ్గట్లుగా ఇంత వరకు రాణించలేక పోయాడు. అదే టీ20 ఫార్మాట్లో జరిగే ఆసియా కప్. ఈ టోర్నీలో రషీద్ ఇప్పటివరకు 8 మ్యాచ్‌లు ఆడి ఓ మోస్తరు ఎకానమీతో 11 వికెట్లు తీశాడు.

ఈ నెల 9 నుంచి యూఏఈ వేదికగా ప్రారంభం కాబోయే ఆసియా కప్ టీ20 టోర్నీలో రషీద్ తన మార్కు చూపించేందుకు సిద్ధపడుతున్నాడు. ఈ టోర్నీలో మరో 3 వికెట్లు తీస్తే.. ఈ టోర్నీలోని అత్యుత్తమ రికార్డు రషీద్ ఖాతాలో పడుతుంది. ప్రస్తుతం టీ20 ఫార్మాట్‌లో జరిగే ఆసియా కప్‌లో అత్యధిక వికెట్లు తీసిన రికార్డు టీమిండియా బౌలర్ భువనేశ్వర్ కుమార్ పేరిట ఉంది. భువీ ఈ టోర్నీలో 6 మ్యాచ్లో 5.34 ఎకానమీతో పరుగులిచ్చి 13 వికెట్లు తీశాడు. ఈ రికార్డుకు సంబంధించి ప్రస్తుతం రషీద్ నాలుగో స్థానంలో ఉన్నాడు. రషీద్‌కు భువనేశ్వర్‌కు మధ్యలో యూఏఈ బౌలర్లు అంజద్ జావెద్ (7 మ్యాచ్‌ల్లో 12 వికెట్లు), మొహమ్మద్ నవీద్ (7 మ్యాచ్‌ల్లో 11 వికెట్లు) ఉన్నారు.

రషీద్ ఖాన్‌తో పాటు టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా సంయుక్తంగా నాలుగో స్థానంలో ఉన్నాడు. ఆసియా కప్ టీ20 టోర్నీ చరిత్రలో అత్యుత్తమ బౌలర్‌గా నిలిచేందుకు రషీద్‌తో పాటు హార్దిక్ పాండ్యాకు కూడా సమాన అవకాశాలు ఉన్నాయి.

ప్రస్తుతం రషీద్ షార్జాలో జరుగుతున్న యూఏఈ, పాకిస్థాన్‌తో జరుగుతున్న ట్రై సిరీస్‌లో అదరగొడుతున్నాడు. తాజాగా యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో 3 వికెట్లు తీసి, అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా అవతరించాడు.

కాగా, ఆసియా కప్ టీ20 ఫార్మాట్లో ఇప్పటివరకు రెండు సార్లు జరిగింది. త్వరలో జరుగబోయేది మూడోది అవుతుంది. 2016లో ఈ టోర్నీని తొలిసారి పొట్టి ఫార్మాట్‌లో బంగ్లాదేశ్) నిర్వహించారు. ఆ తర్వాత 2022లో రెండో సారి జరిగింది (యూఏఈలో). తొలి టోర్నీలో భారత్ విజేతగా నిలవగా.. రెండో టోర్నీలో శ్రీలంక కప్పు గెలుచుకుంది. ఈ సారి టీ20 ఫార్మాట్‌లో జరుగబోయే మూడో ఆసియా కప్ యూఏఈ వేదికగా జరుగనుంది.




# సూపర్ కూల్.. సూపర్ స్వాగ్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఆల్రెడీ తెలుగు స్టేట్స్ సహా సోషల్ మీడియాలో సెలబ్రేషన్స్ సాగుతున్నాయి. ఇక తననుంచి వస్తున్న లేటెస్ట్ చిత్రాల్లో దర్శకుడు సుజీత్‌తో చేస్తున్న భారీ చిత్రం "ఓజి" నుంచి స్పెషల్ పోస్టర్‌ని పవన్ బర్త్ డే కానుకగా ఫ్యాన్స్‌కి అందించారు. ఈ పోస్టర్‌లో పవన్ కళ్యాణ్ సూపర్ కూల్‌గా కనిపిస్తున్నాడు. వింటేజ్ డాడ్జ్ కార్ మీద కూర్చున్న స్టైలిష్ ఓజి ఓ వైపు కార్‌కింద గమనిస్తే రక్తపాతం కనిపిస్తుంది. ఇలా రక్తపాతం తర్వాత సేద తీరుతూ కనిపించిన క్రేజీ పోస్టర్ ఫ్యాన్స్‌కి మంచి కిక్ ఇచ్చింది. కేవలం గ్లింప్స్ ఇంకా మొదటి పాటతోనే ఎనలేని అంచనాలు అందుకున్న సినిమా తాలూకా ట్రైలర్ కూడా ఏ రేంజ్‌లో ఇంపాక్ట్ చూపనుందో అందరికీ తెలిసిందే. ఓజి ట్రైలర్ కట్‌ని మేకర్స్ సెప్టెంబర్ 19న విడుదల చేయనున్నట్టుగా తెలుస్తుంది. అయితే ఇది రిలీజ్‌కి చాలా దగ్గరలో అని చెప్పాలి. మరి ట్రైలర్ అప్పుడే వస్తుందా లేక ఇంకా ముందే వస్తుందా అనేది చూడాలి. ఇక ఈ చిత్రానికి థమన్ సంగీతం అందించగా డీవీవీ ఎంటర్టైన్మెంట్స్ నిర్మిస్తోంది.

# పవన్ అంటే ఎంతో ఇష్టం



పవన్ కల్యాణ్, ఎఎం రత్నం అంటే తనకెంతో ఇష్టమని అంటున్నాడు దర్శకుడు క్రిష్ జాగర్లమూడి. 'హరి హర వీరమల్లు' కోసం తాను 40 నిమిషాల ఫుటేజ్ చిత్రీకరించినట్టు తెలిపారు. ఘాటి సినిమా ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో 'హరిహర వీరమల్లు'గురించి మరోసారి కొన్ని విషయాలు పంచుకుంటూ.. తాను అనుకున్న కథ పూర్తిగా వేరని తెలిపారు. "నేను రాసుకున్న కథ షూటింగ్ కూడా దర్బార్‌లో జరుగుతుంది. దీనికోసం అన్నపూర్ణ స్టూడియోస్‌లో భారీ సెట్ వేశాం. ఎఎం రత్నం ఎక్కడా రాజీ పడకుండా ప్రోత్సహించారు. పవన్‌తో మేం తీసిన సన్నివేశాలు కూడా చాలా అద్భుతంగా వచ్చాయి. ఔరంగజేబు దిల్లీ వెళ్లిన తర్వాత కథను చిత్రీకరిం చాం. పవన్ కల్యాణ్ అద్భుతమైన స్టంట్స్ చేశారు. కోహినూర్ దొంగి లించిన తర్వాత ఆయన మయూర్ సింహాసనం మీద నిల్చోవడం, ఔరంగజేబుకు సవాలు విసరడం, కోర్టుకు వెళ్లడం.. ఈ సన్నివేశాలన్నీ చిత్రీకరించాం. సెకండ్ పార్ట్‌లో నేను తీసింది 40 నిమిషాలు ఉంటుంది. చాలా గొప్ప ఉద్దేశంతో ఈ చిత్రం చేశాను. 'హరిహర వీరమల్లు' చాలా ఒడుదొడుకులు ఎదుర్కొంది. అనేక కారణాలవల షెడ్యూళ్లు ఆలస్యమయ్యాయి. మధ్యలో నేను 'కొండ పొలం' సినిమా పూర్తి చేశాను. దానికి కూడా పవన్ ఓకే అన్నారు. ఆయన చాలా గొప్ప వ్యక్తి" అని క్రిష్ తెలిపారు.

"షెడ్యూల్స్ కారణంగానే నేను 'హరిహర వీరమల్లు' నుంచి బయటకు వచ్చాననేది నిజం. 2024 ఎన్నికల్లో ఫలితం ఎలా ఉంటుందో ఎవరికీ తెలియదు. పవన్ ఆ ఎన్నికల కోసం పూర్తిగా బిజీ అయ్యారు. అందుకే షెడ్యూల్స్ ప్లాన్ చేయలేదు. దీంతో ఆలస్యమవుతుందని నేను వైదొలిగాను. అప్పటికే నేను ఈ సినిమా కోసం 5 ఏళ్లు వేచి ఉన్నాను. కొత్త దర్శకుడు రావాల్సిన అవసరం ఏర్పడింది. కాబట్టే నేను వైదొలిగాను" అని మరోసారి స్పష్టతనిచ్చారు.

## బంగారం స్మగ్లింగ్ కేసు:
## నటి రన్యారావుకు రూ.102 కోట్ల జరిమానా




బంగారం అక్రమ రవాణా కేసులో నిందితురాలైన కన్నడ నటి రన్యారావుకు ది డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆమెకు రూ.102.55 కోట్ల జరిమానా విధించింది. రన్యా సహా నలుగురు నిందితులకు మొత్తంగా రూ.270 కోట్ల పెనాల్టీ విధించింది. డీఆర్ఐ అధికారు లు జైల్లోనే నోటీసులు ఇచ్చారు.ఒకవేళ ఆ మొత్తాన్ని చెల్లించకపోతే ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరించారు. మరోవైపు, ఇదే కేసు విషయంలో విదేశీ మారక ద్రవ్య పరిరక్షణ, స్మగ్లింగ్ కార్యకలాపాల నివారణ బోర్డు దాఖలు చేసిన పిటిషన్‌ను కర్ణాటక హైకోర్టు విచారించింది. తదుపరి విచారణను సెప్టెంబరు 11కి వాయిదా వేసింది. దుబాయ్ నుంచి బంగారాన్ని అక్రమంగా తరలిస్తూ మార్చి తొలివారంలో రన్యారావు బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన సంగతి తెలిసిందే. ఆమెనుంచి 14.3 కిలోల బంగారాన్ని డీఆర్ఎ అధికారులు స్వాధీనం చేసుకొని అరెస్టు చేశారు. నిందితులకు ఏడాదిపాటు జైలు శిక్ష పడింది.

## ఈశ్వరా.. పవనేశ్వరా

అభిమానులతో పాటు భక్తులను కూడా సొంతం చేసుకున్న ఏకైక హీరో పవన్‌కల్యాణ్. ఈమాట ఇప్పటికే ఎంతో మంది సెలబ్రిటీలు పలు సందర్భాల్లో చెప్పారు. నేడు పవర్ స్టార్ పుట్టినరోజు కావడంతో సోషల్ మీడియా కళకళ లాడుతోంది. ఈసందర్భంగా ఆయనకు సంబంధించిన స్పెషల్ మ్యాష్అప్ వీడియో ఆకట్టుకుంటోంది.


'ఈశ్వరా.. పవనేశ్వరా..' అంటూ ప్రారంభమైన వీడియోలో ఆయన సినీ జీవితంతో పాటు రాజకీయ రంగంలోని ఒడు దొడుకులను కూడా చూపారు. పవన్ ఎమోషనల్ డైలాగులు.. ఆయన స్పీచ్‌లు అభిమానులకు గూస్‌బంప్స్ తెప్పిస్తున్నాయి. ఈ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది.

# అందుకే.. ఆఫర్స్ రిజెక్ట్ చేశా



'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'తో తొలి ప్రయత్నంలోనే నటిగా ప్రేక్షకులను మెప్పించిన తెలుగమ్మాయి శివాని నాగరం. ఇప్పుడు 'లిటిల్ హార్ట్స్'లో పూర్తి భిన్నమైన పాత్రతో అలరించేందుకు సిద్ధమైంది. 'నైన్టీస్.. ఏ మిడిల్ క్లాస్ బయోపిక్' ఫేమ్ మౌళి కథానాయకుడిగా సాయి మార్తాండ్ తెరకెక్కించిన చిత్రమిది. 'ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్స్'లో రూపొందిన సినిమాని నిర్మాత బన్నీ వాసు, వంశీ నందిపాటి ఈనెల 5న థియేటర్లలోకి తీసుకురానున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో శివాని పలు విశేషాలు పంచుకుంది. "సంగీత దర్శకుడు సింజిత్ యెర్రమల్లి నా బాల్య స్నేహితుడు. ఆయన ద్వారా ఈ సినిమా గురించి తెలిసింది. డైరెక్టర్ సాయి మార్తాండ్ కథ చెప్పినప్పుడే నటించేందుకు ఆసక్తి కలిగింది. అందులో నాదే కాదు ఇతర పాత్రలనూ తీర్చిదిద్దిన విధానం బాగుంది. ఇంతకుముందు నేను నటించిన 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు' తర్వాత కొన్ని అవకాశాలొచ్చాయి, కానీ, వాటిని అంగీకరించలేదు. కథాబలం ఉన్న సినిమాలే చేయాలని నిర్ణయించుకున్నా. థియేట్రికల్ మూవీనా, ఓటీటీ చిత్రమా? అనేది పట్టించుకోను. ఎంత పెద్ద సినిమా అయినా ఓటీటీలోకి రావాల్సిందే. వెబ్ సిరీస్ అవకాశాలు వచ్చినా చేసేందుకు సిద్ధంగా ఉన్నా" అని చెప్పుకొచ్చింది శివాని.

# స్క్రిప్ట్ చదువుతుంటే నవ్వాగలేదు



విభిన్న పాత్రలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే బాలీవుడ్ నటుడు మనోజ్ బాజ్‌పాయ్. ఆయన నటించిన 'ఇన్‌స్పెక్టర్ జెండే' ఈ నెల 5న నేరుగా ఓటీటీ 'నెట్‌ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'మూవీ స్క్రిప్ట్ చదువుతున్నప్పుడే నవ్వాగలేదు. తెరపై చూస్తే అంతకుమించి ఉంటుంది' అంటూ.. సీరియస్ అంశాన్ని వినోదంతో చెప్పే ప్రయత్నం చేస్తున్నామన్నారు. చిత్ర దర్శకుడు చిన్మయ్ మండ్లేకర్ మాట్లాడుతూ.. ఏదైనా ఘటన జరిగితే దాన్ని ఒక్కొక్కరు ఒక్కోలా చూస్తారని, ఈ సినిమాని తాను వినోదాత్మకంగా తెరకెక్కించానని తెలిపారు. "వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిస్తున్న సినిమా కాబట్టి.. ఇందులో నటింపజేసేందుకు కొందరు ముంబయి పోలీసులను సంప్రదించాం. అంత సమయం తమకు లేదని చెప్పారు. వారంతా అంకిత భావంతో పని చేస్తున్నారు" అని ఈ చిత్రాన్ని నిర్మించిన దర్శకుడు ఓంరౌత్ ప్రశంసించారు.

20కిపైగా హత్యలకు పాల్పడిన సీరియల్ కిల్లర్ చార్లెస్ శోభరాజ్ జీవితంలోని కీలక సంఘటనల ఆధారంగా 'ఇన్‌స్పెక్టర్ జెండే'ను తెరకెక్కించారు. శోభరాజ్‌ను పట్టుకునేందుకు పోలీసు అధికారి చేసిన సాహసాన్ని ప్రధానంగా చూపించనున్నారు. కామెడీకి ఎక్కువ స్కోప్ ఉంది. ఇన్‌స్పెక్టర్ మధుకర్ బాపురావ్ జెండెగా మనోజ్ బాజ్‌పాయ్, చార్లెస్ శోభరాజ్‌గా జిమ్ షర్బ్ నటించారు.

# హీరోయిన్లపై ఇంకా చిన్నచూపే

హీరోయిన్ కృతి సనన్ మరో ఘనత సాధించారు. 'ఐక్యరాజ్యసమితి పాపులేషన్ ఫండ్' ఇండియాకు లింగ సమానత్వ గౌరవ రాయబారిగా ఎంపికయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చిత్ర పరిశ్రమలో లింగ వివక్షపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇండస్ట్రీలో హీరోలకు ఉన్నన్ని సౌకర్యాలు హీరోయిన్లకు ఉండవని ఆమె తెలిపారు. "సౌకర్యాల విషయంలోనే కాదు.. నటీనటులను గౌరవించడంలోనూ అసమానత చూపుతారు. హీరోలకు పెద్దకార్లు, విలాసవంతమైన గదులు కేటాయిస్తారు. ఇది చాలా చిన్న విషయాలే కావచ్చు. కానీ, అలా ఎందుకు చేస్తారని బాధపడతాను. కేవలం కార్లు, సౌకర్యాల గురించే కాదు మహిళలను తక్కువ చేసి చూడడం గురించి నేను మాట్లాడుతున్నాను. హీరోలతో సమానమైన గౌరవానికి మేం కూడా అర్హులమే. షూటింగ్ విషయంలోనూ ఇలానే జరుగుతుంది. హీరోలు సెట్స్‌కు ఆలస్యంగా వస్తారు. కానీ, హీరోయిన్లు మాత్రం టైంకంటే ముందే వెళ్లి వారి కోసం ఎదురుచూస్తూ ఉండాలి. అసిస్టెంట్ డైరెక్టర్లు నన్ను ముందే సెట్స్‌కు రావాలని పిలుస్తారు. హీరోలకు మాత్రం ఆ మాట చెప్పలేరు. ఇలాంటి ఆలోచనా విధానంలోనే మార్పు రావాలి" అని కృతిసనన్ అభిప్రాయపడ్డారు.

